
ధర్మము

# హిందూ ధర్మ శాస్త్రము



ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్
www.freegurukul.org


సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజి
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస
అమ్మ శారదా దేవి
గురు వివేకానంద
గురు సాయిబాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళ స్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

Free Gurukul

"ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్" ద్వారా విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందించే సేవా కార్యక్రమంలో బాగంగా ఈ పుస్తకాన్ని ఇంటర్నెట్ నుంచి సేకరించి అందిస్తున్నాము. సేకరణ కర్త పేరు మాకు తెలియరాలేదు, అయినా వారు మంచి సేవ చేసారు కావున ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము.

సాయి రామ్ వారి సేవల విస్తరణలో బాగంగా ఈ ఫౌండేషన్ స్థాపించబడినది. దీనిద్వారానే అన్ని సేవలు అందించబడును. ఇటువంటి పుస్తకాలు మీరు వ్రాసినట్లయితే (లేక) సేకరిస్తే మాకు తెలియచేయండి. మేము ప్రతి విద్యార్థికి ఉచితంగా అందేలా చేస్తాము, తద్వారా ఉన్నత విలువలు, నైపుణ్యాలు కలిగిన విద్యార్థులను మన దేశానికి అందించవచ్చు. మాతో కలిసి నవ భారత నిర్మాణ కార్యక్రమంలో పనిచేయుటకు, భాగస్వామ్యం అగుటకు ఆసక్తి ఉంటే సంప్రదించగలరు.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ వెబ్ సైట్ : www.freegurukul.org
2) సాయి రామ్ వెబ్ సైట్ : https://sites.google.com/site/sairealattitudemanagement
3) మొబైల్ ఆప్: Free Gurukul

గమనిక: భక్తి,జ్ఞాన,ధర్మ ప్రచారార్ధం ఉచితంగా eBook రూపంలో ఇంటర్నెట్ నుంచి సేకరించి ఇవ్వడం జరిగింది. ఇది లాభార్జన దృష్టిలేని ఉచిత సేవ. ఈ సేవలో అంతర్జాలంలోని(ఇంటర్నెట్) లైసెన్సు / కాపీరైటు అభ్యంతరాలు లేనివి అనుకొన్న పుస్తకాలను గ్రహించటం జరిగినది. అనుకోకుండా ఏవైనా అభ్యంతరకరమైనవి ఉన్నచో మాకు తెలుప మనవి, వాటిని తొలగించగలము అని మనవి చేసుకొంటున్నాము.

Website: www.freegurukul.org Mobile App: Free Gurukul email: support@freegurukul.org
Facebook: www.facebook.com/freegurukul Helpline/WhatsApp: 9042020123

" మన లక్ష్యం: విలువలు, నైపుణ్యాలతో కూడిన విద్య అనేది ఉచితంగా + సులభంగా + ఆకర్షణీయంగా + నాణ్యతతో కూడి అందరికి అందించబడాలి "

ఉచిత గురుకుల విద్య ఫౌండేషన్ – Free Gurukul Education Foundation

సర్వం పరమాత్మ పాద సమర్పణమస్తు



# మోహన స్మృతి

## హిందూ ధర్మశాస్త్రము

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | జ్ఞానము | 1 |
| 2. | ఆడ-మగ | 4 |
| 3. | వివాహము | 7 |
| 4. | భార్య | 9 |
| 5. | భర్త | 18 |
| 6. | సంభోగము | 20 |
| 7. | వ్యభిచారము | 22 |
| 8. | కుటుంబ యజమాని | 24 |
| 9. | సంతానము | 25 |
| 10. | కుటుంబ సభ్యులు | 27 |
| 11. | సమాజము | 29 |
| 12. | సంపద | 31 |
| 13. | దానము | 32 |
| 14. | విద్య | 35 |
| 15. | ఆరోగ్యము | 38 |
| 16. | నీచవృత్తులు | 47 |
| 17. | మతము | 48 |
| 18. | ఆలయాలు | 50 |
| 19. | యజ్ఞము | 54 |
| 20. | ఆధ్యాత్మికత | 55 |
| 21. | రాజ్యము | 57 |
| 22. | భవిష్యద్ధర్మము | 59 |

# జ్ఞానము

జ్ఞానమునకు ఊహ ప్రేరణ. ప్రేరేపితమైన మనసు తన ఊహ సత్యమో లేక అసత్యమో తెలుసుకునేందుకు అన్వేషణ ప్రారంభిస్తుంది. అన్వేషణలో క్రొత్త సత్యాలు వెలువడతాయి. అంత వరకు సత్యములుగా విశ్వసించినవి అసత్యములని నిరూపిత మౌతాయి. ఊహ యొక్క అంతమే విశ్వాసము.

నీ ఊహలను అంతము చేసుకుని, నీయిష్టము వచ్చిన దానిని విశ్వసించే హక్కు నీకున్నది. అది నీ వ్యక్తిగతం. నీ వరకే పరిమితం. ఇతరుల ఊహలను కూడా అంతం చేసుకోమని కోరే హక్కుగాని, బోధించే అధికారముగాని నీకు లేదు.

హిందూ ధర్మము విశ్వాసాల ప్రాతిపదికగా రూపొందలేదు. ప్రకృతి ధర్మములను అధ్యయనంచేసి మానవునకు తన కర్తవ్యమేమిటో చెబుతోంది హిందూ ధర్మము.

నిరూపితమైనవి సత్యములుగాను, నిరూపితము కానివి అసత్యములుగాను భావించుటే నాస్తికత్వము.

నిరూపితమైనవి మరియు విశ్వాసములు అన్నియు సత్యములే అని భావించుట ఆస్తికత్వము.

'నిరూపితమైనవి సత్యములు, తక్కినవి ఊహలు. అన్వేషణలో కొన్ని ఊహలు సత్యములుగను, కొన్ని అసత్యములుగను నిరూపితం కావచ్చు. కావున ఊహలను సత్యములని గాని, అసత్యములని గాని తీర్మానించుట అజ్ఞానము' - అని ప్రవచించు నది హిందూ సాంప్రదాయము.

ప్రకృతి యదార్థము. దైవము ఊహ.

ధర్మము యదార్థము. ఆరాధన ఊహ.

కోరిక యదార్థము. ఫలము ఊహ.

సత్యముపై ఒక వ్యక్తికిగాని, ఒక సంస్థకుగాని, ఒక బోధకునికి గాని, మతమునకు గాని గుత్తాధిపత్యము లేదు. అన్వేషించే నేర్పు, ఓర్పు, శక్తి ఉన్నవారికి సత్యము సర్వాంతర్యామియై దర్శన మిస్తుంది.

స్వచ్ఛమైన మతము సత్యమునే ప్రవచించును. మానవులు గతి తప్పినప్పుడు శక్తి హీనులౌతారు. వారిని తిరిగి కక్ష్యలోకి రప్పించుటకు ప్రేరణను, శక్తిని ప్రసాదించుటయే హిందూ ధర్మము యొక్క ప్రధాన లక్ష్యము.

సమాజములో అధర్మము పాలు పెరిగినప్పుడు మత ధర్మాలు సైతం వక్రీకరించబడి ప్రజలను తప్పుడు మార్గమువైపు మళ్ళిస్తాయి. అందుకే ధర్మ శాస్త్రాలు ఎప్పటి కప్పుడు తాజాగా ప్రతియుగం లోనూ రూపొందించ బడాలనేది హిందూమతం యొక్క ప్రధాన ఆశయం.

సత్యాన్వేషణ నుండి జ్ఞానమును, జ్ఞానమునుండి ధర్మమును పుట్టు చున్నవి.

## బ్రహ్మజ్ఞాని

దైవ శక్తులను గుర్తించిన వాడే బ్రహ్మజ్ఞాని. బ్రహ్మజ్ఞాని ప్రకృతిని అధ్యయనం చేస్తూనే ఉంటాడు. అది అనంతమని గుర్తించి, తన అధ్యయనాన్ని, సాధనను నిత్య కృత్యముగా ఆచరిస్తాడు. సృష్టికి గాని, దైవానికి గాని, దైవశక్తులకు గాని పరిమితి యున్నదని విశ్వసించడు. దైవ సాక్షాత్కారమునకై యత్నించడు.

మానసికంగా బలీయమైన జ్ఞాని దైవంయొక్క రూపం గురించి చింతించడు. సాకార, నిరాకార, ఆస్తికత్వ, నాస్తికత్వ వాదనలలో తన మనసును బంధించడు.

బ్రహ్మజ్ఞాని ప్రకృతి నైజమైన, జీవిమనుగడకు అవసరమైన కర్మలు అనుష్ఠిస్తాడు. ఉపవాసాలు, బ్రహ్మచర్యం  వగైరాలు బ్రహ్మ జ్ఞానాన్ని పెంచనూ లేవు, జ్ఞాన తృష్ణ గల వానికి అడ్డుగాను నిలువవు. ఈ కర్మలను తృణీకరించడంగాని, వాటికి మితిమీరిన ప్రాధాన్యత నిచ్చి వాటికి బానిసలగుట గాని బ్రహ్మజ్ఞానులకు తగదు.

సమకాలీన సమాజపు రీతులను, నియమనిబంధనలను, ఆచార వ్యవహారములను, జ్ఞానయోగం ద్వారా సమీక్షించి, సమాజ శ్రేయస్సుకు దోహదపడే వాటికి మాత్రమే తన ఆమోదాన్ని తెలియజేస్తాడు. సమాజానికి ఏవిధంగానూ ఉపకరించని వాటిని నిర్ద్వందంగా ఖండించే వాడే బ్రహ్మజ్ఞాని. జ్ఞానం ఉండి కూడా ప్రాణభయం వల్ల సత్యాన్ని బహిర్గత పరచలేని వాడు బ్రహ్మజ్ఞాని కాదు.

బ్రహ్మజ్ఞాని ఎవరికీ భయపడడు. ఎవరినీ భయపెట్టడు. ఇతరులను తృప్తిపరచాలని యత్నించడు. తాను ఏది ధర్మమార్గమని విశ్వసిస్తాడో ఆమార్గం గుండా సంకోచం లేకుండా పయనిస్తాడు. తోడుకోసం వెదకడు. ఆధిపత్యం కోసం ప్రాకులాడడు. ప్రజల తిరస్కార భావానికి చలించడు. రాజ శాసనాలకు వెరవడు. కోరికల దోసిటి తెరచి దైవానికి అంజలి సమర్పించడు. భుక్తికై రాజులను, సంపన్నులను ఆశ్రయించడు. అనర్హులైన వారికి విద్యనేర్పడు. అర్హులైన వారిని మాత్రమే శిష్యులుగా స్వీకరించి జ్ఞానవంతులను చేస్తాడు. శిష్యుల వద్దనుండి ప్రతిఫలాన్ని ఆశించడు. అందుకే బ్రహ్మజ్ఞాని సాధారణ గురువు కాదు; పరమ గురువు. బ్రహ్మజ్ఞాని కావడానికి ప్రాథమిక లేక అర్హతను ఆపాదించే విద్యఅంటూ ఏమిలేదు. వ్యక్తిలో 'నా' అన్న భావనను నిద్రపుచ్చి మనోనేత్రంతో సృష్టని సమీక్షించి, యోగనిష్ఠ ద్వారా తన జ్ఞానాన్ని నిరంతరం పెంచుకోడానికి యత్నించే వారు బ్రహ్మజ్ఞానులు కాగలరు.

బ్రహ్మజ్ఞాని సమాజం గుర్తింపు కొరకై ప్రాకులాడరాదు. కావున యితడు తన వేషధారణ ద్వారా గాని లేక యితర అలంకరణల ద్వారా గాని ప్రజల దృష్టిని ఆకర్షించడానికి యత్నించరాదు. ఇతని దైనందిన జీవితంలో అవసరమైన వస్త్రధారణ చేయవచ్చు.  అవసరం లేని వస్త్రాలను త్యజించనూ వచ్చు. బ్రహ్మజ్ఞాని తననుతాను బంధించుకొనడు. బంధనాలలో యిరుక్కుపోయిన మనసును వాటినుండి విముక్తి గావించి ప్రకృతిలో లీనం చేస్తాడు.

అలాగని సమాజం నుండి దూరంగా పారిపోయే వారు బ్రహ్మజ్ఞానులు కారు. కొందరు సమాజానికి వెరచి దూరంగాపోయి తమకు యిష్టమైన కర్మలను అనుష్ఠిస్తారు. ఆపని చేయడానికి బ్రహ్మజ్ఞాని కానవసరంలేదు. బ్రహ్మజ్ఞాని సమాజ భవిష్యత్తుకు మార్గాన్ని సూచించాలి. అధ్యయనం

ద్వారా తాను తెలుసుకున్న దైవశాసనాలను ప్రజలకు తెలియజేయాలి. అలాగని పనికట్టుకుని ప్రచారం చేయరాదు. తన భావనలను అవసరమైన సందర్భాలలో బహిర్గతం చేయాలి. సమాజంలోని తప్పును నిర్ద్వందంగా ఖండించాలి. సత్యశోధన, సత్యబోధన బ్రహ్మజ్ఞాని లక్షణాలు, లక్ష్యాలు. వీటిని శాసనాలకు భయపడిగాని, దుష్టులకు తలవంచిగాని త్యజించిన నాడు, అతడు తన బ్రహ్మజ్ఞానాన్ని కోల్పోయినట్లే. మరణం ఎవరినైతే భయానికి గురిచేస్తుందో వారు బ్రహ్మజ్ఞానులు కారు. బ్రహ్మజ్ఞాని సుఖదుఃఖములకు అతీతుడు. వాస్తవ లేక ఊహాజనిత దుఃఖానికి తలవంచడు. అతని మనసును దుఃఖము తాకినను అది అచట నిలువజాలదు. అతని సుఖము అతని యోగధ్యాన నిష్ఠయే. ధ్యానమందు అతడు అనిర్వచనీయమైన ఆనందం పొందగలడు. ఆ ఆనందాన్ని మించి వేరే ఆనందం కోసం ప్రాకులాడడు. ఏలననగా, అదియే సర్వోత్తమమైన ఆనందమని అతనికి తెలియును.

బ్రహ్మజ్ఞానులు యిహపరమైన బంధనాలలో యిమడజాలరు. అవన్నీ వారికి కృత్రిమముగా గోచరిస్తాయి. ఎవరైతే వారిని బంధించాలని యత్నిస్తారో వారికి బ్రహ్మజ్ఞానులు దూరంగా జరిగిపోతారు. ఇతరులను మార్చాలని వీరు యత్నించరు. కానీ సమాజ మనుగడకు మార్గం చూపిస్తారు. సమాజం యొక్క తప్పుడు రీతులను ఖండిస్తారు. వీరు విశ్వమానవ శ్రేయస్సును కాంక్షిస్తారు. ఎచట మనసు బంధనాల నుండి విముక్తి చెందుతుందో అచట సంతోషం వెల్లివిరుస్తుంది. మానవులు సంతోషంగా ఉండాలాంటే వారికి బాధ్యతాయుతమైన స్వేచ్ఛ ప్రసాదించ బడాలని బ్రహ్మజ్ఞానులకు తెలుసు. వీరు కులమతాలకు అతీతులు.

బ్రహ్మజ్ఞాని తన ఉదర పోషణ గురించి చింతించడు. ప్రకృతిలో జీవులన్నిటికి సమృద్ధిగా ఆహారం ఉన్నదని వీరికి తెలుసు. వీరు బిక్షాటన చేయరు. ఏలననగా ఒక దివ్యశక్తి ముందు తప్ప మరే శక్తికీ వీరు తలవంచరు. ఆహారము శరీరపోషణకు మాత్రమే అని గుర్తించి ఏరూపంలోని ఆహారమునైనా భుజించగల సమర్థులు. అందుబాటులో నున్న ఆకులు తినైనా జీవించగల నేర్పు వీరికి అభ్యాసము ద్వారా అబ్బుతుంది.

వీరి మనసు నిత్యము ఆనందంలో ఉండుటచేత వీరి శరీరం తేజోవంతముగా యుండును. వీరికి ముసలితనము మామూలు జనులకువలె రాదు. శరీరము పూర్ణాయుష్కు వరకు తనవిధులను సక్రమముగా నిర్వర్తిస్తుంది.

ఇహపరమైన బానిసత్వమును వీరు ఏవగించుకుంటారు. ఒక వ్యక్తి మరోవ్యక్తి వద్ద తలవంచకుండా జీవించగల వ్యవస్థను అభిలషిస్తారు.

ఆది శక్తిలో తనని తాను విలీనం చేసుకుని తద్వారా తనకు ప్రాప్తించిన జ్ఞానాన్ని సామాన్యులకు తెలియజేసేవాడే బ్రహ్మజ్ఞాని.

ఆదిశక్తిలోని సూక్ష్మాతి సూక్ష్మమైన భాగాలే సూర్యుడు, భూమి, చంద్రుడు, గోళాలు, నక్షత్రాలు. ఆదిశక్తిని తెలుసుకోగల నేర్పు మానవుని మనోనేత్రానికి సాధనద్వారా ప్రాప్తిస్తుంది. ఈ విషయం గుర్తించిన బ్రహ్మజ్ఞాని దేవాలయాలను ఆశ్రయించడు. ప్రార్థనామందిరాలు నిర్మించమని ప్రబోధించడు.

# ఆడ - మగ

స్త్రీ పురుషుల కలయిక వలన సృష్టి కార్యము కొనసాగు చున్నది. ఉత్తమమైన సంతానము కొరకు ఉత్తముడైన మగజీవితో సంభోగించే హక్కు ఆడజీవికి ప్రకృతి ప్రసాదించి యున్నది. ఎచ్చట ఈ ప్రకృతి ధర్మమునకు విఘాతము కలుగునో అచటి జీవులు శ్రేష్ఠమైన సంతతిని ఉత్పత్తి చేయజాలవు.

ఒక స్త్రీ మనసావాచా ఒక పురుషునితో సంగమాన్ని అభిలషిస్తుంటే వారి కలయికను నిరోధించుట సృష్టిలో కెల్లా నీచకార్యము.

పరస్పరము ఆకర్షితులైన స్త్రీ పురుషుల కలయికను నియంత్రించెడి అధికారము వారి తల్లి దండ్రులకు గాని, రక్తసంబంధీకులకు గాని, గురువులకు గాని, హితులకు గాని, సుతులకుగాని, ధర్మ పీఠాధిపతులకుగాని, మతాచార్యులకు గాని, న్యాయాధిపతులకు గాని, శాసనకర్తలకు గాని లేదు.

మానసికంగా ఆకర్షితులై శారీరకముగా దూరముగా యున్న స్త్రీ పురుషులది అసంపూర్ణమైన ప్రేమ. సంభోగము ద్వారా ప్రేమకు పరిపూర్ణత ప్రాప్తించు చున్నది.

ప్రేమికులను విడదీసిన వారికి స్త్రీ హత్యా పాతకము అంటుతుంది. ప్రేమికులలో ఒకరిని చంపిన వారిని జంటహత్యల పాతకము ఆజన్మాంతము వెంటాడును.

ప్రేమికులను వారి తల్లి దండ్రులు విడదీయుటకు యత్నించినచో వారికి నీచకర్మానుష్ఠాన దోషము అంటుతుంది. అటువంటి తల్లి దండ్రులను త్యజించుట వలన ప్రేమికులకు ఏదోషము అంటుటలేదు.

ప్రేయసి తన తల్లి దండ్రులను, బంధువర్గమును త్యజించి తన ప్రియునితో ఊరిపొలిమేర దాటిన యెడల ఆ ప్రియుని ద్వారా సంతానవతి అయ్యేంతవరకు ఆ గ్రామంలో అడుగు పెట్టరాదు. తల్లి దండ్రులను వదిలి తనతో వచ్చిన ప్రేయసిని త్యజించు హక్కు ప్రియునకు లేదు.

ఎవరి వత్తిళ్ళకులోను కాకుండా, ఎటువంటి ప్రలోభాలకు లొంగక ప్రియునితో గ్రామ పొలిమేర దాటిన ప్రేయసి అతనికి భార్య అవుతుంది. అటుపై ఆమె భార్య ధర్మము నిర్వర్తించవలెను. ప్రియునికి అంతకు పూర్వమే వివాహమైనదని తెలిసియు అతనిని ప్రేమించిన స్త్రీకి అతనితో గ్రామ పొలిమేరను దాటెడి హక్కులేదు. ఒకవేళ అట్లు వెళ్ళినను ఆమెకు భార్య స్థానం లభించదు.

ప్రేయసి వివాహితయై యుండి ఆమె భర్తను త్యజించి ప్రియునితో గ్రామ పొలిమేరను దాటినచో ఆమె భర్త జీవించియున్నంత కాలము ఆ గ్రామములో అడుగు పెట్టరాదు. భర్త స్వాధీనములో నున్న తన స్త్రీధనముపై ఆమెకు ఎటువంటి హక్కుఉండదు.

సంతానవతి అయిన స్త్రీ తన సంతానమును భర్త వద్ద వదలి, ప్రియునితో గ్రామ పొలిమేరను దాటిన యెడల ఆమెను తిరిగి తన స్వాధీనము చేసుకొనెడి హక్కు భర్తకు గలదు. అట్లు భర్త స్వాధీనము చేసుకున్నను లేక ఆమె ప్రియునిపై విరక్తి చెందిగాని మరోకారణం చేతగాని

స్వయముగా భర్తను ఆశ్రయించినను ఆమెకు బానిస స్థానం ప్రాప్తిస్తుంది. అట్టి స్త్రీని తనకు యిష్టమైన రీతిలో వినియోగించుకునే హక్కు భర్తకు గలదు.

ప్రియునితో వెళ్ళక ముందు ఆమెకు కలిగిన సంతానమునకు సైతం ఆమె బానిస ధర్మము ప్రకారము సేవలు అందించవలయును.

ప్రియుని ద్వారా కలిగిన సంతానముతో భర్త కడకు తిరిగివచ్చిన యెడల, ఆ సంతానమును బానిస సంతానముగా పరిగణించబడును. అట్టిసంతతికి 14 సంవత్సరముల ప్రాయము వచ్చినంతనే బానిసత్వము నుండి విముక్తి కలుగును. తల్లికి బానిసత్వము పోవలెనన్నచో భర్తను వీడి కుమారునితో జీవించవలెను.

ప్రియునితో గ్రామ పొలిమేరను దాటిన స్త్రీని ఆమె తల్లిదండ్రులు బలవంతముగా వెనుకకు తీసుకొచ్చి వేరొక పురుషునితో వివాహము జరిపించినచో, ఆపురుషుని చెఱనుండి ఆమెను విముక్తురాలిని చేసేంత వరకు ఆమె ప్రియుడు మరో స్త్రీతో సంబంధము కలిగి యుండరాదు.

ప్రియురాలిని భర్త స్థానంలోని వ్యక్తి చెఱ నుండి విడిపించుటకై అతడు చేసెడి యత్నములకు యుద్ధ ధర్మము వర్తించుటచేత యితరులను చంపినను హత్యాదోషము అంటుటలేదు. అట్టి స్త్రీ యొక్క భర్త మరణించినను ఆమెకు వైధవ్యము అంటుట లేదు.

ప్రియురాలు చెఱపట్టిన భర్త ద్వారా సంతానవతి అయిన యెడల ప్రియుడు ఆమెకై యత్నించరాదు. భర్త ద్వారా సంతానవతి అయిన స్త్రీ తన సంతానమును భర్త వద్దనే వదిలి ప్రియుని చేరినచో ఆమెను పుణ్యస్త్రీగా భావించి ప్రియుడు స్వీకరించవలెను. ప్రియునితో మూడు సంవత్సరములు కాపురం చేసిన తర్వాత ఆమెకు భార్య స్థానం లభించును.

ఒకసారి ఒక ప్రియుని కోసం గ్రామ పొలిమేరను దాటిన స్త్రీ మరో ప్రియుని కోసం మరో గ్రామ పొలిమేర దాటినంతనే పతితగా మారుచున్నది. ఏ ఒక్క పురుషుడును ఆమెపై హక్కు కలిగియుండుట లేదు. ఆమెను శిక్షించు అధికారము ఏ పురుషునికీ లేదు. అట్టి స్త్రీ వలన గ్రామ వాతావరణం కలుషితమై పోవుచున్న యెడల ఆమెను గ్రామము నుండి బహిష్కరించ వచ్చును.

ప్రియుని ఏదశలోనైనను తిరస్కరించెడి హక్కు స్త్రీకి గలదు. ప్రియుని తిరస్కరించు సమయమున అతడిచ్చిన కానుకలను వాపసు చేయవలెను. అట్లు చేయని స్త్రీకి వ్యభిచారదోషము అంటును.

ప్రియుని ద్వారా సంతానవతి అయినచో ప్రియుని తిరస్కరించు కాలమున అతడు కోరినచో అతని ద్వారా కలిగిన మగశిశువును అతనికి కానుకగా యివ్వవలెను.

తన ప్రేయసి వద్దనుండి తనద్వారా జన్మించిన శిశువును కానుకగా స్వీకరించిన వ్యక్తికి తదుపరి వివాహము చేసుకొనెడి హక్కులేదు. తన జీవితమును కుమారుని తీర్చిదిద్దుటకు అంకితం చేయవలెను.

తన కుమారుని ప్రియునకు స్వాధీనం చేసిన స్త్రీ తదుపరి వివాహమునకు అయోగ్యురాలై యున్నది. ఆమె వేరొక పురుషుని వివాహమాడినను ఆమెకు భార్య హక్కులు ప్రాప్తించవు. హక్కుల పరంగా ఆమెది ఉంపుడుగత్తె స్థానము.

సమాజము యొక్క ఆమోదము పొందిన ప్రేమికులు విధిగా శాస్త్రనిర్దేశిత ధర్మములను ఆచరించవలెను.

## ప్రేమికులుగా ఆమోదం పొందిన నాటినుండి వివాహం పూర్తయ్యేంత వరకు ప్రేయసి పాటించ వలసిన నియమములు

పురుషులలో కామవాంఛను రెచ్చ గొట్టే విధంగా స్త్రీ వేషధారణ గాని, అలంకరణ గాని ఉండకూడదు. అన్యయువకులతో ఒంటరిగా సంచరించ రాదు.

వితంతువుల తోను, భర్తను వదిలేసిన స్త్రీ తోను, వ్యభిచారిణులతోను, సూర్యాస్తమయం నుండి సూర్యోదయం వరకు మాట్లాడరాదు.

సూర్యోదయమునకు ముందుగనే లేచి స్నానమాచరించి పరిశుద్ధమైన వస్త్రములను ధరించి ఉదయ భానునకు అంజలి ఘటించవలెను. తర్వాత కుటుంబ సభ్యులకు ఉదయం అవసరమైన ఆహారాన్ని తానే స్వయముగా తయారు చేసి వడ్డించవలెను. వారు తిన్న పాత్రలను తానే స్వయముగా శుద్ధిచేయ వలెను.

సాయంత్రం సూర్యాస్తమయానికి ఒక ఘడియ ముందుగా తన నివాసానికి సమీపంలో ఉన్న ఆలయానికి వెళ్ళి దైవ దర్శనం చేసుకొనవలెను. ప్రియురాలి దైవ దర్శనం పూర్తయ్యేంత వరకు ప్రియుడు ఆమెకై ప్రాంగణంలో నిరీక్షించ వలెను. దైవదర్శనం పూర్తయిన తర్వాత ప్రాంగణంలో యిరువురు సంభాషించు కొనవచ్చును. ఒకరినొకరు తాకరాదు, అన్యులకు జుగుప్స కలిగించే విధంగా ప్రవర్తించరాదు.

సూర్యాస్తమయానికి ముందుగా యిరువురు ఆలయ ప్రాంగణం నుండి వెలుపలికి రావలెను. ప్రియురాలి యింటి వరకు ప్రియుడామెకు తోడుగా వెళ్ళవలెను.

## ప్రియునికి నియమములు

ధూమపానము చేయరాదు. మత్తుపానియములు సేవించరాదు. జూదము ఆడరాదు. పందెములలో పాల్గొనరాదు. స్త్రీలతో ఒంటరిగా సంచరించరాదు. కన్యలను గాని, వివాహిత స్త్రీలను గాని ఆకర్షించే రీతిలో ప్రవర్తించరాదు. తోబుట్టువులు, వదినెలు అనుచితముగా ప్రవర్తించినను వారిని దూషించరాదు. సహనము పాటించవలెను. క్రోధము వ్యక్త పరచరాదు. నెలకు రెండు పర్యాయములు మించి మాంసము భుజించరాదు. తగవులు, కొట్లాటలలో పాల్గొనరాదు. విదేశ సంచారము చేయరాదు.

కుడిచేతి మణికట్టుకు పసుపురంగు దారమును కట్టుకొనవలెను. వారమున కొక పర్యాయము తైలమర్ధనము గావించుకుని కుంకుడు రసముతో తలస్నానము చేయవలెను. గోళ్ళు, గడ్డము పెంచరాదు. తలవెంట్రుకలు విపరీతముగా పెంచుకొనరాదు. గుండు చేయించు కొనరాదు. చిరిగిన వస్త్రములు, దుమ్ము, మరకలు అయిన వస్త్రములు, టోపీలు ధరించరాదు. నాగుపాములను చంపరాదు, మురికి నీటిని తాకరాదు, గోవులను హింసించరాదు, దైవ దూషణ చేయరాదు.

# వివాహము

ఒక స్త్రీయు, ఒక పురుషుడును పరస్పర ఆకర్షణకు లోనైనప్పుడు వారి కలయికకు ఉత్పన్నమయ్యే సామాజిక అవాంతరములను విఘ్నపరిచేందుకు సమాజము వారికిచ్చే ఔషధమే వివాహబంధము.

16 సంవత్సరములు నిండని స్త్రీ, 21 సంవత్సరములు నిండని పురుషుడు వివాహమునకు అనర్హులు.

తల్లి యొక్క సోదరుణ్ణి, అన్న కుమారుని, పినతండ్రి వరుసలోని వానిని, సహోదరి యొక్క భర్తకు సోదరుణ్ణి, సోదరి భర్తను, మేనత్త లేక మేనమామ కుమారుని, తండ్రి యొక్క ఉంపుడుగత్తె బంధువును, వ్యభిచార గృహముల యజమానురాలి కుమారుణ్ణి, తన వయసుకంటే రెట్టింపు వయసు గలవానిని, భార్య చనిపోయిన వానిని, తల్లి దండ్రులను హింసించు వానిని, తార్పుడు వృత్తిగా జీవించు వానిని, సోదరి సంపాదనపై జీవిస్తూ సోమరిగా కాలం వెళ్ళబుచ్చు వానిని, తన కనుబొమల కంటే తక్కువ ఎత్తుగల వానిని, తలపై సగం మేర వెంట్రుకలు లేని వానిని, నడుము వంగి పోయిన వానిని, ఒంటి చేతి వానిని, గోళ్ళపై నల్లని చారలున్న వానిని, ముఖముపై తెల్లని మచ్చలుగల వానిని, పాములుపట్టు వానిని, హృదయరోగిని, మలిన వస్త్రములు ధరించు వానిని, మరుగుదొడ్లను, మురుగు కాల్వలను శుభ్రము చేయుట వృత్తిగా స్వీకరించిన వానిని, ఊగే బొజ్జగల వానిని, ఇంటి వెలుపలకు శబ్దం వచ్చేలా గురక పెట్టే వానిని, నిద్రలో నడిచే అలవాటున్న వానిని, త్రాగుడు, జూదము, వ్యభిచారము, స్వలింగ సంపర్కము మొదలైన వ్యసనములకు అలవాటు పడిన వానిని, అవివాహితలైన అక్కలున్న వానిని కన్యలు వివాహమాడరాదు.

గర్భవతికి వివాహయోగ్యత లేదు. సంతానవతియైన స్త్రీ అవివాహితుడైన పురుషుని వివాహమాడరాదు. భ్రూణహత్యకు పాల్పడిన స్త్రీ అటుపై 18 మాసముల వరకు వివాహము చేసుకొనరాదు.

యోగ్యుడైన పురుషుడు అక్క కూతురిని, పినతల్లి లేక చెల్లెలు వరుసలోని స్త్రీని, అన్న భార్య చెల్లెలిని, సోదరునికి నిశ్చయమైన కన్యను, మేనత్త లేక మేనమామ కూతురిని, తనకంటే వయసులో పెద్దదైన స్త్రీని, తనకంటే మూడు అడ్డ వ్రేళ్ళకు మించిన ఎత్తుగల స్త్రీని, తన భుజాలకంటే తక్కువ ఎత్తుగల స్త్రీని, భర్తను వదిలేసిన స్త్రీని, 16 సంవత్సరములు నిండని స్త్రీని, సంతానవతిని, వ్యభిచారిణిని, ఇళ్ళకు వెళ్ళి పాలు అమ్మేదానిని, నాభికి దిగువ చీర కట్టే దానిని, ఇతరుల మైల బట్టలు ఉతికేదానిని, మాంసము విక్రయించేదానిని, అడవికి ఒంటరిగా వెళ్ళి కట్టెలు కొట్టుకొచ్చే స్త్రీని, వ్యభిచారిణియైన తల్లి సంరక్షణలోనున్న కన్యను, ధనాపేక్ష గలదానిని, అశుద్ధమైన పనులు చేసి జీవించెడి స్త్రీని, బావ చెల్లెలిని, పరిచారికను వివాహమాడరాదు. తల్లి దండ్రుల అనుమతి లేకుండా శత్రు కుంటుంబం లోని స్త్రీని వివాహమాడరాదు.

తల్లి, తోబుట్టువులలో ఎవరైనా వ్యభిచారమును వృత్తిగా స్వీకరించినను, భర్త జీవించి యుండగానే మరో పురుషునికి ఉంపుడుగత్తెగా వ్యవహరించు చున్నను వారు నివసించు గ్రామమునకు ఒక పగటి నడక దూరములో నివసించుచు, వారితో సంబంధములు కలిగి

సోదరుని భార్యతో గాని, అత్తవరుస స్త్రీలతో గాని శారీరక సంబంధమున్న యెడల 11 మాసములు, బంధువుల స్త్రీలతో సంబంధమున్న యెడల 9 మాసములు, ఇతర స్త్రీలతో సంబంధమున్న యెడల 6 మాసములు, తనతో కామసంబంధం పెట్టుకున్న స్త్రీని కంటితో చూడకుండా గడిపిన పిదప మాత్రమే పురుషుడు వివాహమునకు అర్హుడు.

సుఖరోగగ్రస్తుడైన వ్యక్తి తన రోగము తగ్గిన తర్వాత 18 మాసములు బ్రహ్మచర్యము అవలంబించిన పిదప మాత్రమే వివాహమునకు యోగ్యడు.

ఆరు మాసములలో మూడు పర్యాయములు సుఖవ్యాధులకు గురైనవాడు మూడు సంవత్సరాలు బ్రహ్మచర్యము పాటించిన అనంతరము వివాహమాడదగును.

తరచు గుండె నొప్పితో గాని, మూర్ఛరోగముతోగాని, ఉబ్బసంతో గాని బాధపడే వ్యక్తి సదరు రోగలక్షణములను, వాటియొక్క అనువంశిక లక్షణములను తను వివాహమాడదలచునున్న స్త్రీకి వివరించి, మాసమురోజుల తరువాత ఆమె అంగీకారం వ్యక్తపరచిన యెడల ఆమెను వివాహమాడ వచ్చును.

స్త్రీ పురుషుల కలయికను వారి తల్లి దండ్రులు గాని, బంధుమిత్రులు గాని, సమాజముగాని, ఆమోదించ కున్నను, స్థానిక హిందూ సమాజములోని స్త్రీ వివాహమునకు సంకేతముగా దేనినైతే ధరించునో దానిని పురుషుడు స్త్రీ మెడలో, అమె అంగీకారముతో అలంకరింప జేసిన యెడల వారి వివాహము జరిగినట్లుగా పరిగణించ వలెను. అటుపై వారిని విడదీయు అధికారము ఎవరికీ లేదు.

## వివాహములు మూడు రకములు

1) ఉన్నతమైనవి 2) సాధారణమైనవి 3) నిమ్నమైనవి.

లైంగిక అనుభవం లేని స్త్రీ పురుషులు పరస్పరం ఆకర్షితులైన పిదప చేసుకున్న వివాహము సర్వశ్రేష్ఠమైనది. స్త్రీ పురుషుల మధ్య ప్రకృతి పరమైన ఆకర్షణకు ప్రాధాన్యత నివ్వక వధువు తెచ్చే కట్నకానుకలు, వరుని ఆస్తి, హోదా, అంతస్తు మొదలైన వాటి వలన ప్రేరేపితులైన స్త్రీ పురుషుల వివాహబంధము నిమ్న జాతికి చెందినది. ఈ రెండు తరగతుల మధ్య నున్నవి సాధారణ వివాహములు.

సాధారణ వివాహ బంధము ద్వారా భార్యాభర్తలైన స్త్రీ పురుషులు శాస్త్రోక్తముగా తమ తమ ధర్మములను సక్రమముగా నిర్వర్తించిన యెడల వారి బంధము ఉన్నత దశకు చేరుకుని పవిత్ర బంధమగును.

ఉన్నతమైన వివాహబంధము ద్వారా భార్యాభర్తలైన స్త్రీ పురుషులు శాస్త్ర నిర్దేశితమైన ధర్మములను పాటించని యెడల వారి బంధము సాధారణ వివాహముల జాబితాలోను, దురాచార పరాయణులైన యెడల వారి బంధము నిమ్నజాతిలోను చేరును.

నిమ్నజాతి బంధములోని స్త్రీ పురుషులు అతికష్టము మీద మాత్రమే తమ బంధమును సాధారణ వివాహ బంధముల జాబితాలోకి చేర్చుకోగలరు. ఎట్టి పరిస్థితులలోను వారిబంధం ఉన్నతంగాను, పవిత్రముగాను రూపుదిద్దుకొన జాలదు.

హిందూ సమాజములో పురుషునికి స్వేచ్ఛ, అవకాశములు హెచ్చుగా యున్నందున తన వివాహమునకు పవిత్రత, ఔన్నత్యము చేకూర్చవలసిన బాధ్యత కూడ అతనిపై యున్నది.

యుక్త వయస్కుడైన వాడు తన మనసు ఒక స్త్రీకి గాఢముగా అంకితమైనప్పుడు. ఆమె తన పట్ల ఆకర్షితురాలవడానికి తనశక్తిని, యుక్తిని వినియోగించాలి.

ఆమె అంగీకారం పొందేందుకు ధనమును, బలమును ప్రయోగించిన యెడల వారి బంధము నిమ్న తరగతిలో చేరును. తన శారీరక మానసిక శక్తులద్వారా ఆమె హృదయంలో ప్రేమను మొలకెత్తించ వలెను.

ప్రేమ వివాహమునకు అవకాశము లేనియెడల పెద్దలు, బంధుమిత్రుల ద్వారా పరిచయం చేయబడిన కన్యతో ఏకాంతంలో సంభాషించి ఆమె భార్యగా తన ధర్మము నిర్వర్తించగలదని విశ్వసించిన పిదప ఆమెను వివాహము చేసుకొనవలెను. ఆమె మనసులోని భావములు ధైర్యముగా వ్యక్తము చేయగల వాతావరణమును పురుషుడు కల్పించవలెను. తన ఆస్తి, హోదాలు ఆమెకు ఎరగా చూపి ఆమెను వివాహమునకు ఒప్పించే అవాకాశమును గుర్తించి తగురీతిన ఆమె ఆంతర్యమును గ్రహించవలెను. లేనిచో నిమ్న తరగతి వివాహదోషము జీవిత పర్యంతము వేధించును.

వివాహమును తన కామ దాహమును తీర్చుకొనుటకు సురక్షితమైన మార్గముగా పురుషుడు ఎన్నటికి భావించరాదు. వివాహము ఒకవైపు భార్యా భర్తల మనసుల్లో మాధుర్యాన్ని నింపగలదు. మరోవైపు మనసుల్లో అశాంతిని, అలజడిని సృష్టించి జీవితాలను నరకం చేయగలదు.

తెలిసి నిమ్నజాతి వివాహమునకు సిద్ధపడుట వలన పురుషునికి ఆజన్మాంతం నీచకర్మానుష్ఠాన దోషం వెంటాడును. ఆ దోషము పోవలెనన్న ఆ బంధమునుండి విముక్తుడు కావలెను.

యువతిని భార్యగా స్వీకరించి, ఆమె వయసుని, సొగసుని తన అవసరాలకు వినియోగించుకుని, తల్లిని చేసిన పిదప ఆమెను త్యజించుట వలన స్త్రీ హత్యా దోషము వెంటాడును.

నిమ్నజాతి వివాహమునకు సిద్ధపడిన స్త్రీ పురుషులు అపురూపమైన తమ మానవ జన్మను వృధా చేసుకొను చున్నారు. కావున ఇది హిందూ ధర్మ సమ్మతంకాదు.

## భార్య

పురుషుని జీవితాన్ని స్వర్గముగా గాని, నరకముగా గాని మార్చగల శక్తి స్త్రీకి ఉన్నది. తనను వివాహమాడిన, లేక జతకూడిన పురుషుని జీవితాన్ని స్వర్గమయముగా చేసి అతని హృదయ సామ్రాజ్యంలో రాణి స్థానము ఆక్రమించిన స్త్రీ మాత్రమే పతివ్రతగా పిలవబడుచున్నది.

భర్త జీవితమును నరకముగా మార్చెడి స్త్రీ అన్యపురుషులతో సంబంధము కలిగి యుండనప్పటికి తమ బంధమునకు పవిత్రత చేకూర్చని కారణముగా పతితయగును.

నీచ కర్మలు అనుష్ఠించే వానికి, వికృతమైన రూపము గల వానికి తన శరీరాన్ని అర్పించుట వలన స్త్రీ అపవిత్రమగుచున్నది. తనలో బీజము నాటిన పురుషుని నీచకర్మల దోషములో

సగభాగమును, అతని వలన కలిగిన సంతానము యొక్క నీచకర్మల దోషములో సగభాగమును స్త్రీ భరించవలసి యున్నది.

ధనము కొరకు గాని, భోగములనుభవించవలెనన్న కోరికచేగాని, సంఘములో గౌరవమర్యాదల నిమిత్తముగాని, సంతాన ప్రాప్తికొరకుగాని, ఉదర పోషణార్థం గాని, తనకు యిష్టుడు కాని పురుషునితో సంభోగించెడి స్త్రీ నీచ కర్మానుష్ఠ దోషము వలన పతిత యగును.

పురుషుని చూడకుండా వివాహమునకు అంగీకరించిన స్త్రీ, ఒక పురుషుని గాఢముగా ప్రేమిస్తూ మరోపురుషుని వివాహమాడిన స్త్రీ, ఒక పురుషునితో శారీరక సంబంధము కలిగి ఆ బంధము కొనసాగుతున్న కాలములో మరొకనిని వివాహమాడిన స్త్రీ - వివాహ మౌలిక ధర్మమును విస్మరించుట వలన, తమ వివాహ బంధమునకు నిమ్నత్వమును ఆపాదించుట వలన పతివ్రత కాదు.

కట్నకానుకలు ఎంతమోతాదులో ఉన్నప్పటికిన్ని అవి స్త్రీ యొక్క అనర్హతను గాని, ఆశను గాని తెలియజేస్తాయి. కావున వీటివలన ఉత్పన్నమయ్యే దోషములో అధిక భాగము స్త్రీకి చెందుతుంది. స్త్రీ సత్కర్మను ఆశ్రయించుట ద్వారా దోషములను విసర్జించి పతివ్రత కాగలదు.

## భార్య ఆచరించ వలసిన సత్కర్మలు

భర్త హోదా ఆస్తి కారణంగా తనలో అహం కలుగనీయరాదు. భర్త హోదా, ఆస్తి, ఐశ్వర్యాల ఎదుగుదలకి, తరుగుదలకి అనుగుణంగా స్పందించ రాదు. తను వెంటగొని తెచ్చిన కట్నకానుకలు భర్తకు సమర్పించుకుని వాటిపై తనకేలాంటి ఆధిపత్యం లేదని భర్తకు తెలియపరచాలి.

ఆదాయము, వ్యయము కుటుంబ యజమాని పరిధిలోని అంశాలు. యజమాని భార్య యజమానురాలుకాదు. కావున అవి ఆమె పరిధిలోకిరావు. ఆమె పరిధిలో లేని అంశాలను గురించి భర్తను ప్రశ్నించరాదు. భర్తను సంపూర్ణముగా విశ్వసించలేనపుడు, అతడు మోసం చేస్తాడేమోనన్న భావన మనసులో మెదులుతున్నప్పుడు, అది దాంపత్యజీవనం కాదు. భర్తపట్ల అవిశ్వాసముతో కాపురం చేసే స్త్రీ భార్య స్థానం నుండి బానిస స్థాయికి దిగజారుచున్నది. కావున ఆమె సదా బానిస ధర్మమునే ఆచరించును.

యజమాని బలవంతుడైన బానిస భయభక్తులతో యజమాని ఆజ్ఞలను శిరసావహించును. యజమాని బలహీనుడైనచో బానిస అతనినే శాసించు చుండును. కావున భయంతో భర్తకు లొంగిన స్త్రీయును, భర్తను లొంగదీసుకున్న స్త్రీయును బానిస ధర్మమును అనుష్ఠించుటచేత పాతివ్రత్య ఫలమును పొందలేకున్నారు.

వివాహమవగానే స్త్రీ భర్త యొక్క కుటుంబములో సభ్యురాలవుతుంది. కుటుంబము మారగానే యజమాని మారతారు.

ప్రతి కుటుంబంలోను విధులు స్త్రీ పురుషులకు విడివిడిగా కేటాయించబడతాయి. ఆ కుటుంబ యజమాని వ్యక్తిత్వాన్ని బట్టి ఆ విధుల కేటాయింపు ఉంటుంది

## క్రొత్త కోడలు పాటించవలసిన విధులు

అత్తవారింట్లో అడుగు పెట్టిన తర్వాత ఆరునెలల వరకు ఆ యింటిలోని వారి ప్రవర్తన గురించి భర్తకు ఫిర్యాదు చేయరాదు. ఆ కుటుంబసభ్యులు ఎంత పరుషంగా మాట్లాడినా ఈ ఆరునెలలకాలంలో కంట తడి పెట్టరాదు. మాటకు మాట జవాబు చెప్పరాదు.

క్రొత్తకోడలు ఆరునెలలవరకు అత్తవారింట్లో తన భర్తవి తప్ప అన్యుల బట్టలుతుకుట వలన ఆ కుటుంబములో అనేక అరిష్టములు కలుగును. వీధి వాకిళ్ళు ఊడ్చరాదు. పగటి వేళలందు నిద్రించరాదు. భర్త తప్ప అన్యులు భుజించిన పళ్ళెరములలో భోజనము చేయరాదు. ఇతరుల మంచములపై కూర్చుండరాదు.

అత్తమామలు తప్ప అన్యులవద్దనుండి కాన్కలు స్వీకరించరాదు. ఒంటరిగా దేవాలయములను సందర్శించరాదు. ఆ కుటుంబసభ్యులలో ఒకరైనా తోడులేనిదే శుభకార్యములకు హాజరు కారాదు.

పూర్తి నల్లని వస్త్రముగాని, పూర్తి తెల్లని వస్త్రముగాని ధరించరాదు. బిగ్గరగా ఆవులించరాదు. పాదరక్షలు ధరించి యింటియందు సంచరించరాదు.

ప్రతి శుక్రవారము తలస్నానము చేసి, పాయసమును నైవేద్యముగా తన యిష్ట దైవమునకు అర్పించుకొని, ప్రసాదమును తన చేతులతో కుటుంబ సభ్యులకు పెట్టవలెను.

పౌర్ణమి రోజు పసిడి వర్ణపు వస్త్రములను ధరించి చంద్రుని ఆరాధించిన తరువాత వెన్నెలలో కూర్చొని భర్తతో కలిసి భోజనము చేయవలెను.

ఆడపడుచుల కంటే మిన్నగా ఆభరణములు ధరించరాదు.

వివాహానంతరం వచ్చే మొదటి అమావాస్యను పుట్టింటి యందు ఒంటరిగా గడుపవలెను. నెలపొడుపు చంద్రుని చూసేంత వరకు భర్తను చూడరాదు. నెల పొడుపు తర్వాత ఆడపడుచులకు నూతన వస్త్రములు కానుకగా సమర్పించుకొని అత్తవారింట ప్రవేశించవలెను. పుట్టింట స్వచ్ఛమైన నేతితో తయారు చేయబడిన తీపి పదార్థములను వెంటతీసుకెళ్ళి పొరుగునున్న ఐదిళ్ళవారికి పంచవలెను.

వివాహమైన ఆరునెలలలోగా అత్తవారింట్లో ఎవరైనా మృతి చెందిన యెడల శవదహనం తర్వాత 21 రోజులు పుట్టింట్లో గడుపవలెను.

కుమారుని వివాహం జరిగిన తర్వాత 6 నెలల వరకు గృహ నిర్మాణం చేపట్టరాదు. ఉన్న యింటికి మరమ్మత్తులు చేయడం అనివార్యమైన యెడల కోడలిని పుట్టి నింటికి పంపి, మరమ్మతులు పూర్తయినతర్వాత అత్తగారు వెళ్ళి స్వయముగా కోడలిని వెంట బెట్టుకుని రావలెను.కుమార్తె వివాహము నిశ్చయమైన రోజునుండి సంవత్సరకాలం వరకు నూతన గృహనిర్మాణము చేపట్టరాదు.

సంతానంలో ఇరువురికి ఒకే మాసంలో పెళ్ళి చేయరాదు. మగపిల్లల వివాహములకు మధ్య ఆరు మాసములు, ఆడపిల్లల వివాహములకు మధ్య తొమ్మిది మాసములు ఖాళీ ఉండాలి. కుటుంబంలో ఎవరైనా మరణించిన యెడల సంవత్సరకాలం వరకు ఆ యింట వివాహములు జరుగకూడదు.

కాపురం మొదలైనాక మూడుమాసములలోపు అత్తవారింట్లో ఎవరైనా తనను శారీరకంగా హింసించిన యెడల తన వివాహాన్ని యితరుల అనుమతితో నిమిత్తం లేకుండా రద్దు చేసుకునే హక్కు స్త్రీకి గలదు. ఈ హక్కును తొలగించే అధికారం సమాజానికి లేదు.

భర్త యొక్క లైంగిక అసమర్థత కారణంగా శోభనం తర్వాత ఆరునెలలలోగా ఎప్పుడైనా తన వివాహమును రద్దు చేసుకునే హక్కు స్త్రీకి గలదు. వివాహమును రద్దు చేసుకొనడానికి ముందు ఆమె మరో పురుషునితో శారీరక సంబంధం కలిగి యుండరాదు.

వివాహమైన తర్వాత ఆరునెలలలోగా స్త్రీ పర పురుషునితో శారీరక సంబంధం కలిగియున్న యెడల ఆ వివాహాన్ని రద్దు చేసుకునే హక్కు భర్తకుంది. అటుల వివాహము రద్దైన యెడల ఆ స్త్రీని పుట్టింటి వారు స్వీకరించరాదు. ఏ పురుషుడైతే ఆమెతో అక్రమ సంబంధం పెట్టుకొనినాడో అతడామెను భార్యగా స్వీకరించ వలెను.

ఆ పురుషునికి అంతకు పూర్వము వివాహమైనప్పటికీ అతడామెను భార్యగా స్వీకరించవలెను. ఆ పురుషుని ఆస్తిలో తర్వాత వచ్చిన భార్యకు హక్కు ఉండదు. అతని ద్వారా ఈమెకు కలిగిన సంతానానికి మాత్రం అతని తొలి భార్య సంతానంతో సమానముగా ఆస్తిలో హక్కు కలదు.

వివాహమైన తర్వాత ఆరు మాసములలోగా ఒకరికంటే ఎక్కువ మంది పరపురుషులతో సంబంధం కలిగిన స్త్రీని గ్రామమునుండి బహిష్కరించ వలెను. ఆమెను శారీరకంగా గాని, మానసికంగా గాని దండించే అధికారం సమాజానికి లేదు.

వివాహమైన తర్వాత ఆరునెలలలోపు భర్త సోదరునితో శారీరక సంబంధము కలిగి యున్నచో, ఆమె ఆ సోదరులకు ఉమ్మడి భార్యగాను, ఆ కుటుంబ సభ్యురాలిగాను పరిగణింప బడుతుంది. ఆమె సంతానానికి తండ్రి మొదటగా వివాహమాడిన వ్యక్తి. ఆమె యిష్టంతో నిమిత్తం లేకుండా ఆమె భర్తకు మరొక స్త్రీని వివాహమాడే స్వేచ్ఛ కలుగుతుంది.

## భాగ్యము

మనిషికి ఆనందాన్ని, తృప్తిని యిచ్చేది, మనసులో మధుర భావాలు నింపేది, లేమి భావనను పోగొట్టేది, అనుభవం ద్వారా ప్రాప్తించేది మాత్రమే భాగ్యము. భాగ్యమన్నది భోగయుక్తమై యుండాలి.

మానసికంగా అన్య స్త్రీలకు అంకితం కాని భర్త, కామకేళిలో తనని తృప్తి పరచగలిగిన భర్త, తనని సంతానవతినిచేయగలిగిన భర్త, ఉత్తములైన సంతానమును కలిగియున్న స్త్రీ అసలైన భాగ్యవతి. స్థిర చరాస్తులు, వస్తువాహనాలు, ఆభూషణములు, అన్నియు అల్పములే. భాగ్యవతి అయిన స్త్రీ శోభను, అహాన్ని పెంచడానికి మాత్రమే యివి ఉపకరిస్తాయి.

ఆశ, అసూయ అను రెండును భార్యకు ప్రధాన శత్రువులు. మనసులో నుండి వీటిని తరిమేయనంత కాలం యివి ఏదోక రూపంలో వివాహబంధంలో విషాన్ని చిలికిస్తూనే ఉంటాయి. కావున ఆశ, అసూయలను త్యజించుట భార్యగా స్త్రీ అనుష్ఠించవలసిన తొలిధర్మము.

## అలంకరణ

వివాహమైన తర్వాత స్త్రీ వస్త్రధారణ, అలంకరణలపై అధిపతి భర్త. ఏవిధంగా అలంకరించుకుంటే తను భర్తకు ఆకర్షణీయంగా కన్పిస్తుందో అదే భార్యకు ఉత్తమ అలంకరణ వివాహమైన తర్వాత కనీసం రెండు దశాబ్దాలైనా స్త్రీలు అలంకరణ ధర్మాలను పాటించాలి.

**అహింసా ధర్మము**

స్త్రీలోని క్రూరత్వం ఆమె ఆనందాన్నే బలిగొంటుంది. పెంపుడు జంతువుల పట్ల స్త్రీ ప్రేమతో వ్యవహరించాలి. మూగజీవుల పట్ల తనకంటే ఎక్కువగా కరుణ చూపే భార్యని పురుషుడు మరింతగా ప్రేమిస్తాడు.

తోటి మనుషుల్ని మాటలతో కష్ట పెట్టడమూ హింసే. స్త్రీకి రాక్షస రూపాన్నిచ్చేది ఆమె గయ్యాళి తనం. భర్తకు తనపై గల ఆకర్షణని భస్మం చేసేది తన గయ్యాళితనమేనని ప్రతి భార్య గుర్తించాలి. హృదయ సౌకుమార్యం లేని స్త్రీని సున్నిత మనస్కుడు వివాహమాడిన, అతని జీవితము నరక ప్రాయమే.

ఎటువంటి వ్యసనములకు బానిసకాని వాడు, ఉత్తమ కర్మలు అనుష్ఠించే వాడును, సున్నిత మనస్కుడును అయిన పురుషుడు రాక్షస లక్షణములను విసర్జించని భార్యను తానే విసర్జించ వలెను. ఆమెతో కలిసియున్నచో అతనికి కూడా నీచత్వం అంటును.

**సహకార ధర్మము**

భర్త అనుష్ఠించే సత్కర్మలకు పూర్తి సహకారం అందించుట భార్య కర్తవ్యము. భార్య ప్రవర్తన భర్త సంకల్ప బలాన్ని పెంచేదిగా ఉండాలి. మాటల ద్వారాగాని, చేష్టల ద్వారాగాని భర్త యొక్క మనోబలాన్ని క్రుంగదీసే భార్య 'స్వామి' ద్రోహి. స్వామి అనగా కుటుంబ యజమాని, ద్రోహి అనగా శత్రువు. స్త్రీ అనుష్ఠించే సహకార ధర్మముపై ఆమె వివాహబంధం యొక్క పవిత్రత ఆధారపడి యున్నది.

**సేవా ధర్మము**

అత్తవారింట్లో స్త్రీ యొక్క స్థానము ఆమె అనుష్ఠించే సేవాధర్మము పై ఆధారపడియున్నది. సేవయనగా బానిసత్వము కాదు. ఆత్మాభిమానమునకు భంగము కలుగని రీతిలో యితరుల కష్టములను తీర్చుటయే సేవ. కష్టములో లేనివారిని సోమరులుగా మార్చేది సేవ కాదు. సేవలో కృప మరియు ఆత్మాభిమానము మిళితమై యుండుట చేత ఈ ధర్మమును అనుష్ఠించు స్త్రీని భర్త గౌరవిస్తాడు.

**ఆత్మ రక్షణ**

శరీరము, మనసు బానిసత్వములోకి జారిపోకుండా కాపాడుకొనుటయే ఆత్మరక్షణ. వివాహమనే ప్రక్రియ ద్వారా స్త్రీని బానిసగా మార్చే హక్కు ఆమె తల్లిదండ్రులకు గాని, అత్తమామలకుగాని, భర్తకుగాని, సమాజానికిగాని లేదు.

కన్య తల్లిదండ్రులకు ధన, వస్తు, వాహనాది రూపంలో మూల్యం చెల్లించి, వివాహ మాడిన పురుషునికి ఆమె భార్యగా చెలామణి అవుతున్నా బానిస ధర్మాన్ని అనుష్ఠించాలి. ఆత్మ రక్షణ ధర్మం బానిసకు వర్తించదు.

సదరు మూల్యం చెల్లించ బడిన విషయం వివాహానికి ముందు ఆమెకు తెలియకున్నచో ఆమె బానిస కాదు. తానా విషయాన్ని తెలుసుకున్న వెంటనే, ఆమె తల్లి దండ్రులు స్వీకరించిన మూల్యాన్ని, వారు ఎవరి వద్దనుండి స్వీకరించారో వారికి వాపసు చేసేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. మూల్యం వాపసు చేయబపడనంత కాలం భర్తతో కాపురం చేయరాదు.

విక్రయించబడిన స్త్రీ పుట్టింటి వారితో ఎటు వంటి సంబంధమును కలిగి యుండరాదు. 'మూల్యం చెల్లించి నిన్ను కట్టుకున్నాను' అని మూడు సార్లు భర్త అపహాస్యము చేసిన యెడల ఆత్మరక్షణ ధర్మము ప్రకారము స్త్రీ ఆ పురుషుని త్యజించవలెను. అట్లు త్యజించకున్నచో ఆమెకు భర్తతో మాత్రమే సంబంధము కలికి యున్నప్పటికిని వ్యభిచార దోషము అంటుచున్నది. పరిస్థితుల ప్రభావమువల్ల అట్టి భర్తను త్యజించలేని స్త్రీ ఉంపుడుగత్తె ధర్మమును అనుష్ఠించవలెను.

మనుషులు ఎల్లకాలం ఒకలాగే ఉండరు. పరిస్థితుల ప్రభావమునకు లోనవుతారు. కొంత కాలం మంచిగా యున్న భర్త పరస్త్రీలోలుడు, జూదరి, త్రాగు బోతు కావచ్చు. అట్టి పరిస్థితులలో భార్య ధర్మం సంకటంలో పడుతుంది.

ఆత్మాభిమానం, కాపురాన్ని సరిదిద్దుకోవాలన్న ఆరాటం, బంధుమిత్రుల హితవు సామాజిక ఆచారములు, శాసనాలు, సంతానము, స్వయం పోషకత్వము మొదలగు అంశాలు ఆమె నిర్ణయాన్ని ప్రభావితం చేస్తాయి.

1. వ్యభిచార స్త్రీతో సంభోగించిన తరువాత ఆరుమాసముల వరకు పురుషుడు భార్యతో సంభోగించరాదు. భర్త వ్యభిచారిణితో కలిసెనని నిరూపితమైనచో ఆరు మాసములు అతనికి దూరముగా ఉండవలెను. ఈ ఆరుమాసములలో అతడు తన తప్పును తెలిసికొని పశ్చాత్తాపపడిన యెడల అతనిని తిరిగి భర్తగా స్వీకరించవచ్చు. అటుల కాక భర్త అలవాట్లు మారని యెడల సంవత్సర కాలం విడిగా యున్న తర్వాత వారి వివాహ బంధం తెగి పోయినట్లుగా గుర్తించవలెను.

2. ఇట్లు భర్తకు దూరముగా యున్న కాలంలో స్త్రీ సంపర్కము ఎరుగని అవివాహితుడైన యువకునితో సంబంధము కలిగి యున్నను ఆమె పవిత్రురాలుగనే యున్నది.

3. ఇట్లు భర్తకు దూరముగా యున్న కాలములో ప్రియుని ద్వారా గర్భవతి అయిన స్త్రీ వెంటనే తొలి భర్త అంగీకారము లేకనే ప్రియుని వివాహ మాడవచ్చు.

4. ప్రియుడు వివాహమునకు నిరాకరించిన కారణముగా ఆమె తొలి భర్త పంచన చేరినచో పతిత యగును.

5. ప్రియుని ద్వారా కలిగిన సంతానమును ఆమె భర్త ముద్దాడి దైవ సన్నిధిలో బిడ్డకు నామకరణం జరిపి, ఆమెను బిడ్డతో సహా తన గృహమునకు తీసు కెళ్ళుట వలన ఆమె పాతి వ్రత్యమునకు భంగము కలుగుట లేదు.

6. అట్లు భర్తతో తిరిగి కాపురానికి వెళ్ళిన పిదప ప్రియునితో తిరిగి సంబంధము కొనసాగించినచో ఆమె పతిత యగును.

7. భర్తకు దూరముగా యున్న కాలంలో ఒకరి కంటే ఎక్కువమంది అవివాహితులతో గాని, వివాహితుడైన ఒక వ్యక్తితో గాని. పుట్టింట్లో పని చేస్తున్న సేవకునితో గాని, భర్త స్నేహితునితో గాని, మేనత్త లేక మేనమామ కుమారునితో గాని, సన్యాసము స్వీకరించి కాషాయ వస్త్రములు ధరించిన వానితో గాని, మరో కన్యకు నిశ్చయమైన యువకునితో గాని, సంబంధము కలిగి యున్న యెడల ఆమె పతిత యగును.

8. భర్త ద్వారా గర్భవతి అయిన, భర్తకు దూరముగా యున్న స్త్రీ బిడ్డ ప్రసవించే ముందు కాలంలో గాని, ప్రసవించిన అనంతరం 18 మాసముల వరకు యితర పురుషునితో సంబంధము కలిగియున్నచో పతిత యగును.

9. మరో వనితతో కలిసి ఏకకాలమున ఒకే పురుషునితో సంగమించిన స్త్రీకి ఏదోషమూ అంటుటలేదు. ఆమె దేవతా స్త్రీ లక్షణములు సంతరించుకున్న కారణమున ఆమె కర్మలకు అతీతమై యున్నది. ధనము, భయము, లోభము వల్ల ప్రభావితమై అటువంటి చర్యకు పాల్పడిన పతిత యగును.

10. తల్లియు, బిడ్డను ఒకే వ్యక్తితో సంబంధము కలిగి యున్నచో తల్లికి మాత్రమే నీచకర్మానుష్ఠాన దోషము కలుగు చున్నది. తల్లీ బిడ్డలు ఒకే పురుషుని ద్వారా గర్భవతులైనచో ఆ పురుషుడు కూతురికి భర్తస్థానంలో ఉన్నప్పటికినీ యిరువురు పతితలగు చున్నారు.

వ్యభిచారేతర వ్యసనముల కారణముగా స్త్రీ భర్తను త్యజించరాదు. కాని ఆ వ్యసనములకు బానిస అయిన భర్త తన కామవాంఛ తీర్చని యెడల అతినితో కాపురం చేస్తూ, మరో వ్యక్తి ద్వారా తన శారీరక వాంఛలను తీర్చుకున్న స్త్రీ పతివ్రతగానే యున్నది.

భర్తకన్నా నీచుడైన వ్యక్తితో సంభోగించిన స్త్రీకి వాని దోషములు అంటుచున్నందున పతిత యగును.

భర్తయొక్క యజమానితో, సేవకునితో, మిత్రునితో, సోదరునితో సంభోగించిన స్త్రీ పతిత యగును.

తన కుమారుని ఈడు గలవానితోనూ, తన కుమారుని మిత్రునితోనూ సంభోగించిన స్త్రీ పతితలలోకెల్లా నీచ స్థానములో యుండును.

కూతురు యొక్క అనుమతి లేకుండా ఆమె ప్రియునితో గాని, భర్తతో గాని సంభోగేచ్ఛ కలిగిన క్షణమే స్త్రీ పతిత యగును.

తన వద్ద విద్యనభ్యసించు యువకునితోగాని, తనకు విద్యనేర్పెడి గురువుతోగాని సంభోగించుట వలన అవివాహితయైన స్త్రీ వివాహమునకు అర్హత కోల్పోవు చున్నది.

స్త్రీ విద్యాభ్యాసము పూర్తయిన దినమునుండి సంవత్సరకాలం గురువును చూడకుండా ఉన్న తర్వాత అతనిని వివాహమాడినను లేక అవివాహితగా అతనితో శారీరక సంబంధము కలిగియున్నను ఆమె పతివ్రతగానే కొనసాగును.

స్త్రీ యిష్టమునకు వ్యతిరేకముగా గాని, ఆమె సమ్మతిలేకగాని, ఆమె శరీరరమును మరో పురుషుడు తన కామవాంఛ తీర్చుకొనుటకు వినియోగించుకొనిన, ఆమెను శీలవతిగానే పరిగణించవలెను.

తన అనుమతి లేకుండా కామాంధుడై తన శరీరంపై దాడి చేసిన పురుషుని పరిణయమాడిన స్త్రీ పతితయగును. అటువంటి వానితో భార్యగా కాపురం చేయుట వ్యభిచారము కంటెను నీచమైన కర్మ.

భయపెట్టిగాని, ప్రలోభపెట్టిగాని, మత్తు నిచ్చిగాని, ప్రేమపూర్వకమైన వత్తిడి ద్వారాగాని, యితర బెదిరింపుల ద్వారా గాని ఒక స్త్రీకి వివాహము జరిపించబడిన యెడల ఆ వివాహము ధర్మ సమ్మతం కాదు. అట్టి స్త్రీని అవివాహిత గానే పరిగణించ వలెను. ఆమె భర్తది పరపురుషుని స్థాన మైనందువలన ఏదశలోనైనా అతనిని త్యజించి, తనకిష్టమైన పురుషునితో జీవించే హక్కు

ఆ స్త్రీకి ఉంది. ఆమె వివాహమైన తర్వాత యిష్టపూర్వకముగా భార్య ధర్మమును అనుష్ఠించినను, భర్తద్వారా సంతానవతియైనను ఆమెను అతని భార్యగా పరిగణింపవలెను.

వివాహమైన తరువాత పదకొండు సంవత్సరములలోపు భార్య సంతానవతి కాని యెడల మరొక స్త్రీని వివాహమాడే హక్కు భర్తకు గలదు. భర్త యొక్క రెండవ భార్యను తన సహోదరిగా భావించి తొలి భార్య తన హక్కులలో సగము ఆమెకు కానుకగా యివ్వవలెను.

రెండవ వివాహము చేసుకున్న పురుషుడు తొలిభార్యపై తనకు గల అధికారమును కోల్పోవుచున్నాడు. ఆమె యితర పురుషుల ద్వారా సంతానవతి అయినచో వారిని తన సంతానముగనే భావించి తండ్రి ధర్మము నిర్వర్తించవలెను.

తన తొలి భార్య తన సేవకుని ద్వారా గర్భవతి అయినచో ఆమెను సేవకునికి కానుకగా సమర్పించుకొనవలెను. తన ఆస్తిలో నాలుగింట ఒక భాగమును తొలి భార్యకు పంచి ఋణ విముక్తుడు కాని యెడల ఆయుఃక్షీణము కలుగును. అట్టి సేవకుని పరిణయ మాడుటకు తొలి భార్య నిరాకరించిన యెడల తన ఆస్తిలో ఆరింట ఒక భాగమును ఆమెకు పంచి యిచ్చి ఋణ విముక్తుడు కావలెను.

తొలి భార్య తన సోదరుని వల్ల గర్భవతి అయినచో కుటుంబ యాజమాన్యపు హక్కుఆమెకు సంక్రమిస్తుంది. తొలిభార్య సంతానానికి ఆస్తిలో ఐదింట మూడు భాగములును, మిగిలినది యితర కుటుంబ సభ్యులకును చెందును.

భార్యకు వరుసగా మూడు సార్లు గర్భ విచ్ఛిన్నం జరిగినను,లేక వరుసగా ముగ్గురు నెలల శిశువులు చనిపోయినను,ఆమె ద్వారా సంతానము పొందవలెనని పురుషుడు యత్నించరాదు. అట్టి యత్నము ప్రేమపూర్వకముగా చేసినప్పటికిని భార్యపై భర్త చేసెడి దురాగతముగా పరిగణించవలెను.

కోడలిని సంతానవతి కమ్మని కోరు హక్కుగాని, శాసించు అధికారము గాని అత్త మామలకు లేదు. కావున సంతాన విషయమై అత్తమామల కోర్కెను తిరస్కరించి వారికి మానసిక వేదన కలుగ జేసినప్పటికిని ఆ కోడలుకు ఎటువంటి దోషమును అంటదు. తనను మానసికంగా హింసించే అత్తమామల పట్ల ఆ కాలంలో కోడలు తన సేవా ధర్మమును నిర్వర్తించకనే నిర్వర్తించిన ఫలమును పొందుచున్నది. స్త్రీ గర్భవతిగానున్న సమయంలో ఆమెను శారీరకంగా హింసించిన వారిని శిశుహత్యాపాతకము వెంటాడుచున్నది. గర్భవతిగానున్న స్త్రీ తన ఆత్మరక్షణార్థం ఆయుధముల నుపయోగించి తనపై దాడి చేసిన వ్యక్తి మృత్యువునకు కారకురాలైనప్పటికిని ఆమెకు హత్యా దోషము అంటుట లేదు. అట్టి స్త్రీని శిక్షించిన ధర్మాధిపతిని స్త్రీ హత్య మరియు శిశుహత్య పాతకములు వెంటాడును.

అయితే స్త్రీ గర్భవతిగా యున్న కాలంలో పరపురుషునితో సంభోగించిన యెడల, ఆ ఘటన ద్వారా ప్రేరేపితుడైన భర్త చర్యల వల్ల ఆమెకు గర్భస్రావం జరిగినను అతనికి ఏ దోషమునూ అంటుటలేదు.

సంతానవతి యైన స్త్రీ తదుపరి గర్భవతిగాయున్న కాలంలో పర పురుషునితో సంబంధము ఏర్పరచుకున్న యెడల ఆమెను వెంటనే త్యజించెడి హక్కు భర్తకు గలదు. ఆమె తొలి సంతానాన్ని

సైతం తన సంతానం కాదని తీర్మానించే హక్కు భర్తకు గలదు. అట్లు త్యజించబడిన స్త్రీకి గాని, ఆమె సంతానానికి గాని భర్త ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండదు. అట్లు త్యజించునపుడు స్త్రీకి సంవత్సరకాలమునకు సరిపోవు భత్యమును యివ్వనిచో ఆ పురుషుడు తదుపరి వివాహమునకు అయోగ్యుడు.

సంతానవతియైన స్త్రీ తదుపరి గర్భవతిగానున్న కాలంలో భర్త సోదరునితో సంబంధము కలిగియున్నచో ఆమెను త్యజించెడి హక్కు భర్తకు లేదు. ఆమెకు పుట్టిన మరియు పుట్టబోవు సంతానమును తన సంతానముగానే స్వీకరించి తండ్రి ధర్మము నిర్వర్తించవలెను. సోదరులకు యిష్టమైనచో ఆమెను ఉమ్మడి భార్యగా స్వీకరించ వచ్చును. ఉమ్మడి భార్యను కలిగియున్న సోదరులు వ్యక్తిగతంగా మరొక భార్యను కలిగి యుండవచ్చు.

ఉమ్మడి భార్యను కలిగియున్న సోదరుల ఆస్తిని ఉమ్మడి ఆస్తిగా పరిగణించవలెను. వారి బిడ్డలందరు ఆస్తిపై సమానహక్కును కలిగియున్నారు.

ఇరువురు సోదరులకు ఉమ్మడి భార్యగా ఉంటున్న కాలంలో భర్తల యొక్క మరో సోదరునితో సంబంధము యేర్పరచుకున్న యెడల అతడును ఆస్త్రీకి భర్త అగుచున్నాడు. ముగ్గురు సోదరులకు భార్యయైన స్త్రీని తక్కిన సోదరులు కూడా భార్యగా స్వీకరించవలెను.

ఒక స్త్రీ తాను అవివాహితగా యున్న కాలంలో యిరువురు సోదరులతో సంబంధము కలిగియున్నచో, ఆ స్త్రీని ఒక సోదరుడు వివాహమాడినచో ఆమెకు ఉమ్మడి భార్య స్థానము లభించును. ఆమెను గాని, ఆమె సంతానమునుగాని స్వంతంచేసుకొను అధికారము ఏ ఒక్క సోదరునికీ లేదు.

అవివాహితగా యున్నకాలంలో ముగ్గురు కాని అంత కంటే ఎక్కువ మంది సోదరులతో సంబంధము కలిగియున్న స్త్రీకి వివాహయోగ్యత లేదు. వారామెను వివాహం చేసుకున్నప్పటికిన్ని ఆమెకు గాని, ఆమె సంతానమునకుగాని ఆ సోదరుల ఆస్తిలో ఎటువంటి హక్కు ఉండదు.

నీవు నీ సోదరుని భార్యతో సంబంధము పెట్టుకొన్నయెడల నీ భార్యపై సగం హక్కు నీ సోదరునకు ప్రాప్తించుచున్నది. కానీ ఆ స్త్రీలు మీసోదరులకు ఉమ్మడి భార్యలు కారు. నీ భార్యకు కలిగిన సంతానమునకు నీవు తండ్రివి. నీ సోదరుని భార్య సంతానమునకు అతడు తండ్రి. ఒక స్త్రీ వివాహమైన 11 సంవత్సరముల తర్వాత భర్త సోదరులతో సంబంధము ఏర్పరుచు కున్నచో ఈ నియమము వర్తించదు.

ఉమ్మడి భార్యగానున్న స్త్రీ, భర్తల సోదరుడు కాని వ్యక్తితో సంబంధము కలిగియున్న యెడల ఆమెను ఉమ్మడి ఉంపుడుగత్తెగా భావించి ఆ సోదరులు పోషించవలెను.అటుపై ఆమె సంతానమునకు సోదరుల ఆస్తిలో హక్కుఉండదు.

స్వర్గస్థుడైన సోదరుని భార్యను ఆరు మాసములలోగా వివాహమాడవచ్చును. సోదరుని సంతానమును తన సంతానముగా స్వీకరించవలెను. అవివాహితుడైన యువకుడు సోదరుని భార్యను వివాహము చేసుకొన్న తర్వాత మరో కన్యను వివాహం చేసుకొనవచ్చును. చిన్న భార్య పెద్దభార్య పట్ల సేవాధర్మము నిర్వర్తించవలెను.

భర్త చనిపోయిన తర్వాత ఆరు మాసములలోగా భర్తయొక్క అవివాహితుడైన మిత్రుని వివాహమాడవచ్చును. సంతానవతియైన స్త్రీ అవివాహితుడైన భర్తయొక్క మిత్రుని వివాహమాడరాదు.

తన భార్య అంగీకరించిన యెడల చనిపోయిన మిత్రుని భార్యను వివాహమాడవచ్చును. అట్లు అంగీకరించిన భార్య తనభర్తవద్దనేయుంటూ ఒక అవివాహితుడైన పురుషుని ప్రియునిగా కలిగియున్నను ఆమె పాతివ్రత్యమునకు భంగము కలుగుటలేదు. ప్రియుని కలిగియున్నదను నెపము చేత భార్యను త్యజించెడి అధికారము ఆమె భర్తకు లేదు. ఏకకాలమున ఆమె ఒకరికంటే ఎక్కువమంది ప్రియులను కలిగియున్నచో పతిత యగును. అప్పుడు భర్త ఆమెను, తనకు మిత్రునిభార్యతో వివాహమైన తర్వాత ఆమెకు కల్గిన సంతానమును త్యజించవచ్చును.

వివాహితులైన సంతానమును, 16 సంవత్సరములకు పైబడిన ఆడ సంతానమును, 5 సంవత్సరములలోపు శిశువులును, వికలాంగులైన సంతానమును గల భార్యా భర్తలు విడిపోవుట నేరముగా పరిగణింపవలెను. పైనుదహరించిన సంతానముగల భార్యాభర్తలు విడిపోయిన యెడల వారిని, వారికి ఆశ్రయమిచ్చిన వ్యక్తులను స్థానిక సమాజంనుండి బహిష్కరించవలెను. అట్లు కలసియున్న భార్యాభర్తలు తల్లిదండ్రులుగా తమ విద్యుక్త ధర్మాన్ని నిర్వర్తిస్తూ మరొక వ్యక్తిని ప్రియుడు/ప్రియురాలిగా కలిగియుండవచ్చును. భార్య యొక్క ప్రియుని బంధువుతోగాని, భర్తయొక్క ప్రియురాలి బంధువుతోగాని వారి సంతానము యొక్క వివాహము జరిపించరాదు. అట్లు కలిసియున్న భార్య తన భర్త సోదరునితో గాని, భర్త తన భార్య సోదరితోగాని జతకూడరాదు.

భార్యా భర్తలు విడిపోయిన ఏడు సంవత్సరముల తర్వాత తిరిగి కలయిక నిషిద్ధము.

భార్య భర్తను వీడియున్న ఏడు సంవత్సరముల కాలములో యితర పురుషులతో సంబంధము కలిగి యుండనప్పటికీ, ఆమె భర్త పంచన చేరినను ఆమెకు భార్యస్థానం లభించదు. ఆమె భార్య ధర్మమును అనుష్ఠించినను ఏ విధమైన ప్రయోజనమూ కలుగదు. అట్టి స్త్రీ ప్రేయసి ధర్మమును అనుష్ఠించుట ఉత్తమము.

అట్టి కలయిక తర్వాత స్త్రీకి కలుగు సంతానమునకు భర్త ఆస్తిలో హక్కు ఉండదు.

## భర్త

యోగ్యుడైన పురుషుడు తన వివాహమునకు పవిత్రతను, ఔన్నత్యమును చేకూర్చవలెనన్న విధిగా మూడు ధర్మములను పాటించవలెను.

1. భార్యకు తగు ఆహారమును, వస్త్రములను, నివాస యోగ్యమైన గృహ వసతిని కల్పించవలెను.
2. ఇతరుల శారీరక, మానసిక దాడుల బారినుండి భార్యకు రక్షణ కల్పించవలెను.
3. భార్య కామదాహమును తీర్చవలెను.

ఈ మూడు ధర్మములను సక్రమముగా నిర్వర్తించు చున్నంత కాలం భర్తగా భార్యపై హక్కు కలిగి యుండును. ఏ ఒక్క ధర్మమును విస్మరించినను, అశ్రద్ధ చేసినను వివాహ బంధము అపవిత్రమగును.

ఏ పనియు చేయక సోమరిగా సంచరించుచు భార్య సంపాదన పై జీవించువాడు మొదటి ధర్మమును, భార్యను తల్లిదండ్రుల దయా దాక్షిణ్యములకు వదలినవాడు రెండవ ధర్మమును, వివాహనంతరం పరస్త్రీలతో రమించువాడు మూడవ ధర్మమును విస్మరించు చున్నారు.

వివాహానంతరము వ్యభిచారిణులతో సంభోగించుట వలన అతని భార్యకు కూడా వ్యభిచార కర్మదోషము అంటుచున్నది. భర్త ద్వారా వ్యభిచార కర్మదోషమును ప్రాప్తించుకున్న స్త్రీ ఆ పిదప భర్త జీవితుడై యుండగానే ఎందరు పురుషులతో సుఖించినను ఆక్షేపించెడి అధికారమును భర్త కోల్పోవు చున్నాడు. అట్టి స్త్రీకి భర్తను త్యజించు హక్కుకలదు. కానీ ఆమెను త్యజించే హక్కు భర్తకు లేదు. ఆమె సంతతిని తన సంతతిగానే భావించి తండ్రి ధర్మము నిర్వర్తించుటవలన అతని కర్మదోషము అంతమగును.

పురుషుడు వివాహితుడని ఎరింగియు, అతనిని భర్తగా పొందుట సాధ్యము కాదని రూఢిగా తెలిసియు, యుక్తవయస్కురాలైన కన్య ఆ పురుషుని ప్రమేయంలేకుండానే అతని వైపు ఆకర్షితురాలై చూపుల ద్వారాగాని, మాటల ద్వారా గాని లేక చేష్టల ద్వారా గాని అతనితో సంభోగేచ్ఛను వ్యక్తపరచిన యెడల ఆమె వివాహం యితర పురుషునితో నిశ్చయం కావడానికి ముందుగా ఆమెతో మూడు పర్యాయములు కలియుట వలనగాని, మూడు రాత్రులలో అనేక పర్యాయములు కలియుట వలన గాని వేరొక స్త్రీకి భర్తగా అతనికి ఏదోషము అంటుట లేదు.

ఆ విధమైన కలయిక వలన ఆకన్య సంతానవతియైన, ఆమెను భార్యగా స్వీకరించి ఆమె సంతానము పట్ల తండ్రిగా తన ధర్మమును మొదటి భార్య యొక్క సంతానముతో సమానముగా నిర్వర్తించవలెను. ఈ విధముగా రెండవ భార్యను కలిగియున్న పురుషుడు మొదటి భార్యను ఏ కారణము వలననైనా త్యజించవలసి వచ్చినచో తన యావదాస్తి మొదటి భార్యకు దానము చేయవలెను.

భార్య అందమును విక్రయించి ధనము సంపాదించు వాడును, పుట్టినింటి నుండి ధనము, నగలు, సంపద మొదలైనవి తెమ్మని భార్యను శారీరకంగానూ, మానసికంగానూ హింసించువాడును ఒకే విధమైన నీచ కర్మను అనుష్ఠించుచున్నారు.

ఇట్టి నీచ కర్మను అనుష్ఠించు వానికి భార్యగా ఆరు మాసములకు మించికొనసాగిన స్త్రీకి భర్త కర్మదోషముతో సగభాగము సంక్రమించును. పవిత్రురాలిగా జీవించ దలచుకున్న స్త్రీ భర్త యందలి నీచగుణములను గ్రహించిన దినము నుండి ఆరు మాసములలోగా శ్మశాన వాటికకు వెళ్ళి ఎండుపుల్లలతో చితిని పేర్చి, దానిపై భర్త వాడిన వస్త్రము నొకదానిని కప్పి నిప్పు అంటించవలెను. మెడలోని తాళిని లేక వివాహ బంధానికి గుర్తుగా యున్నదానిని తీసి పసుపు నీటిలో ముంచి, దానిని దోసిట పట్టుకొని చితిమంట చుట్టూ మూడు సార్లు ప్రదక్షిణ చేసి, భూదేవికి, సూర్యదేవునికి నమస్కరించి తాళిని అగ్నికి ఆహుతి చేయవలెను. అనంతరం అగ్ని దేవునికి నమస్కరించి తెల్లని వస్త్రమును ముసుగుగా ధరించి వెనుదిరిగి చూడకుండా పుట్టినింటికి వెళ్ళవలెను. పుట్టినిల్లు వేరు గ్రామంలో యున్నయెడల ఆమె ప్రయాణించెడి వాహనము పైభాగమును తెల్లని వస్త్రముతో కప్పవలెను.

పుట్టినిల్లు చేరిన అనంతరం ఆమె తలార స్నానం చేసి, తెల్ల చీరె (వస్త్రము) ధరించి గడప దాటి లోనికి వెళ్ళవలెను. ఆ తరువాత పక్షం రోజులు సంతాప సూచకముగా రోజుకు ఒక పూట

ఉపవాసము ఆచరించవలెను. 15వ రోజున బంధువులుకాని అయిదు కుటుంబాల వారిని విందుకు ఆహ్వానించవలెను. ఆరోజు తలంటు సాన్నం చేసి తన కిష్టమైన రంగు వస్త్రములు ధరించి, వారితో సహపంక్తి భోజనము చేయవలెను. ఆక్షణము నుండి ఆమె మరోపురుషుని వివాహము చేసుకొనుటకు యోగ్యురాలు.

ఇదే రీతిలో ఆమె రెండవ భర్తను కూడా త్యజించిన యెడల ఆమెను ఏపురుషుడూ వివాహమాడరాదు. అవివాహితులైన పురుషులు అట్టి స్త్రీలతో సంభోగించుట వలన వారి శక్తి హరించబడును.

ఈ రీతిలో భార్యను కోల్పోయిన పురుషుడు ఆరుమాసములు గడిచిన తరువాత, వితంతువునుగాని, భర్తనొదిలేసిన స్త్రీనిగాని, యితర గ్రామాలకు చెందిన వ్యభిచారిణిని గాని వివాహమాడ వచ్చును. కన్నె పిల్లలు యిట్టి పురుషుని వివాహమాడరాదు. తదుపరి వివాహమాడిన స్త్రీ అంతకు మునుపే సంతానవతి అయిన యెడల ఆసంతానమునకతడు తండ్రిగా వ్యవహరించవలెను.

సంతానవతి అయన స్త్రీ కాని లేక గర్భవతి అయిన స్త్రీ కాని పైనుదహరించిన రీతిలో భర్తను త్యజించుట నిషిద్ధము.

## సంభోగము

ఆరోగ్యవంతులైన స్త్రీ పురుషులలో కామం ఒక జ్వాలలా రగులుతుంది. ఆ జ్వాలను స్త్రీ పురుషులు సంభోగప్రక్రియ ద్వారా చల్లార్చుకొనుట ధర్మము. ఇతర మార్గముల ద్వారా కామమును అణచి పెట్టుట వలన ఎవరూ ఔన్నత్యమును పొందుట లేదు. సంభోగేతర ప్రక్రియల ద్వారా కామమును చల్లార్చుకొనుట వ్యక్తిగత విషయం. అది వ్యక్తి నివసించే పరిస్థితులపైన, అతని మనస్తత్వం పైన ఆధారపడి ఉంటుంది.

ఒక స్త్రీ మరో స్త్రీ ద్వారాను, ఒక పురుషుడు మరో పురుషుని ద్వారాను కామ జ్వాలను చల్లార్చుకోవడం నీచము. అట్టి నీచకర్మను అనుష్ఠించే స్త్రీ స్థానము వ్యభిచారి కంటే దిగువను, పురుషుని స్థానము నపుంసకుని కంటే దిగువను యున్నది.

ఇట్టి నీచకర్మను అనుష్ఠించు వారు అధ్యాపకులుగను, దేవాలయములలో పూజారులగను, ధర్మకర్తలుగను, పాలకులుగను, శిశు సంక్షేమ కేంద్రములలో నిర్వాహకులుగను, వైద్యులుగను, జీవిత భాగస్వాములుగను పనికి రారు.

స్త్రీ పురుష సంభోగములో అనేక దశలున్నాయి.

స్త్రీ పురుషు లిరువురు పరస్పరం ఆకర్షితులై సంభోగించిన, అది అత్యుత్తమ సంగమము.

స్త్రీ పురుషులు వివాహబంధము ద్వారా భార్యభర్తలై వారికి పరులయందు మనసులగ్నంకాని స్థితిలోని కలయికది ద్వితీయ స్థానం.

స్త్రీ పురుషుని గాఢముగా ప్రేమించుచు, పురుషుడు మాత్రము తాత్కాలిక ప్రేరణకు లోనైనప్పుడు జరిగే సంభోగానిది తృతీయ స్థానం.

స్త్రీ పురుషులు తమ మధ్య ఆకర్షణ నశించినప్పటికిని వివాహము ద్వారా బంధింపబడుట చేత, తమ కోర్కెను తీర్చుకొనుటకు అన్యమార్గము లేకుండుట కారణముగా కొనసాగించెడి శృంగారానిది నాలుగో స్థానం.

స్త్రీకి పురుషునిపై ప్రేమ లేనప్పటికి పురుషుడు భర్త స్థానములో నుండి ఆమెను గాఢముగా వాంఛించుట కారణముగా జరిగెడి సంభోగానిది ఐదో స్థానం.

స్త్రీ పురుషులు భార్యాభర్తలుగా పరస్పరం ద్వేషించుకుంటూ తమలో ప్రజ్వలిత మౌతున్న జ్వాలను చల్లార్చుకోడానికి అన్యులు లభించని కారణమున జరిగెడి కలయికది ఆరోస్థానం.

విటుడు వేశ్యల కలయిక, స్త్రీని హింసించిగాని, బెదిరించిగాని, బలవంతముగ పురుషుడు ఆమెతో సంభోగించుట, స్త్రీ కార్యార్థియై పురుషునితో సంభోగించుట, యవ్వనం క్షీణించిన పిదప తమ సౌలభ్యం కోసం వివాహమాడిన భార్యాభర్తల కలయిక మరియు యితరములన్నియు చివరి స్థానములో ఉన్నాయి.

సంభోగము పురుషుని యొక్క శక్తికి పరీక్షలాంటిది. రాజ్యములు జయించిన యోధుడైనను సంభోగములో స్త్రీని ఓడించలేని యెడల అతని శౌర్యము నిరర్థకము. అభ్యాసము ద్వారా యుద్ధవిద్యలయందు ప్రవీణుడైన విధముగా సాధనద్వారా స్త్రీని జయించగలడు.

తనపై ప్రేమతో గాని, తాత్కాలిక యిష్టముతోగాని, సంతానాపేక్షతోగాని తనని సంభోగానికి ఆహ్వానించిన స్త్రీ యొక్క కామదాహమును పూర్తిగా తీర్చుట పురుషుని యొక్క ధర్మము.

స్కలనము పురుషుని యొక్క శక్తి విడుదలకు సంకేతము. తిరిగి శక్తి సమీకరణకు కాలవ్యవధి అవసరం. కాలవ్యవధి పురుషుని యొక్క శరీరనిర్మాణముపైన అతని యొక్క ఆహార నియమములపైన, స్త్రీయొక్క ప్రేరణాశక్తిపైన, చుట్టూఉన్న ప్రకృతి వాతావరణముపైన ఆధారపడియున్నది.

శృంగార యోగమనగా తన వీర్యస్కలనముపై పురుషుడు ఆధిపత్యము పొందుట.

మనసు యొక్క ఆజ్ఞలేనిదే శరీరములో ఏదియు జరుగదు. మనసు సంకేతము పంపనిదే స్కలనము జరుగదు. మనసు సంకేతం పంపడానికి సిద్ధమౌతునట్లు నీవు గ్రహించగానే ఒక్కక్షణకాలం కదలికలను ఆపి నిశ్చలస్థితిలో ఉండి శక్తి విడుదల ఆగిపోవాలని శాసించు. మొదట కొంతకాలం నీ యత్నాలు విఫలం కావచ్చు. కానీ నీ విజయం తథ్యం. నీవు విజయం సాధించలేకుంటే నీ సంకల్పం బలహీనమైనదై యుండాలి.

పురుషుని యొక్క శృంగార యోగాధ్యయన కాలమునందు అతనికి పూర్తిగా సహకరించుట స్త్రీ ధర్మము. స్త్రీ సహకరించనిదే అది సాధ్యపడదు. శృంగారయోగ సాధనకు పురుషుడు తన ప్రియురాలు లేక భార్య సహకారము మాత్రమే పొందాలి. అన్యులు అనర్హులు. ఈ విద్యను వ్యభిచార స్త్రీలవద్ద అభ్యసించరాదు. వారిపై ప్రదర్శించరాదు.

ఈవిద్యలో నిష్ణాతుడైన పురుషునికి స్త్రీ సదా అంకితమైయుంటుంది. అట్టి పురుషుని పొందియు ఆమె అన్యవిషయములద్వారా లభించే ఆనందమునకు ప్రాధాన్యతయిస్తూ పురుషుని మనసును పదేపదే గాయపరచుచుండిన యెడల పురుషుడామె సాంగత్యమును విడువవలెను.

శృంగారమునందు నిష్ణాతుడు కాలేనివాడు సత్యమును అన్వేషించలేడు. సత్యాన్వేషి కానిదే అధ్యాత్మికత చింతన అలవడదు. మనిషి యొక్క మానసిక వికాసంలో శృంగారం యొక్కపాత్ర అత్యంత కీలకమైనది. ఎవని శృంగారం రుగ్మతల వలయంలో చిక్కుకుంటుందో వానికి సంపూర్ణానందం లభించదు.

వ్యక్తుల శృంగార భావనలను నియంత్రించే అధికారం సమాజానికి లేదు. ఒకవేళ సమాజం నియంత్రించడానికి యత్నించిన అందుకు దాని శక్తిచాలదు. ఏ సమాజమైతే శృంగారంపై ఎక్కువ ఆంక్షలు విధిస్తుందో అచ్చట స్త్రీ పురుషుల మధ్య నున్న బంధాలలో ఔన్నత్యం నశిస్తుంది.

**బ్రహ్మచర్యము**

మతమునకు గాని, ధర్మశాస్త్రమునకు గాని, బోధకునికి గాని, అధ్యాపకులకు గాని బ్రహ్మచర్యము గురించి బోధించెడి హక్కు లేదు. సంభోగేచ్ఛ, అవకాశము లేని స్త్రీ పురుషులు బ్రహ్మచర్యము నాచరించెదరు.

మానసిక రుగ్మత వలన, శరీరములో శక్తి క్షీణించుట వలన, జీవిత భాగస్వామి లేక ప్రియురాలి ప్రవర్తనతో విసుగు చెందినందు వలన, వృద్ధాప్యము వలన సంభోగేచ్ఛ తగ్గుట గాని, పూర్తిగా నశించుట గాని జరుగును. అట్టి స్థితిలో ఆచరించెడి బ్రహ్మచర్యము వలన ఆధ్యాత్మిక జ్ఞాన సంపద పెరగదు.

యుక్త వయస్కులైన స్త్రీ పురుషులు ఏమి చేయవలెనో ప్రకృతి నిర్దేశించి యున్నది. అందుకు భిన్నముగా ప్రవర్తించమనుట అల్పత్వం.

విద్యాభ్యాస కాలమందును, శరీరము పూర్తిగా వికసించని కాలమందును, ఆత్మరక్షణకు, ఆత్మగౌరవమునకు భంగము కలిగే పరిస్థితుల యందును, యుద్ధకాలమందును, శరీరము రోగముచే పీడించబడుతున్న కాలములోను, మనసును శోకము దహించెడి కాలములోను సంభోగము అనర్థదాయకము. అట్టి పరిస్థితులందు పూర్తిగా ప్రేరేపితమైన కామజ్వాలను మనోశక్తి ద్వారా తాత్కాలికముగా ఉపశమింప జేయుటే ఉత్తమ బ్రహ్మచర్యము.

అట్టి బ్రహ్మచర్యము వలన పురుషుడు శక్తి వంతుడై శృంగార యోగమునందు ప్రవీణుడగు చున్నాడు.

## వ్యభిచారము

కనక, వస్తు, వాహనాది ప్రలోభములకు లొంగిగాని, ఏదేని కార్యసిద్ధికొరకు గాని, పురుషుని కామవాంఛ తీర్చు కొనుటకు స్త్రీ తన దేహమును అర్పించుటయే వ్యభిచారము.

వ్యభిచారము కంటే పతనము స్త్రీ జీవితములో మరేదియును లేదు. అట్టి పతనము నుండి స్త్రీ ఔన్నత్యమును పొందవలెనన్న మూడు సంవత్సరముల ఏడుమాసములు పురుష సంపర్కము లేకుండా దైవధ్యానములో గాని, పసిపిల్లల సేవలో గాని గడుపవలెను.

వ్యభిచరించెడి స్త్రీకి వివాహ యోగ్యతలేదు. ఆమె వ్యభిచారవృత్తిని విసర్జించి ముందు పేర్కొనబడిన విధమున ఔన్నత్యమును పొందినచో వివాహమునకు యోగ్యురాలగును.

వ్యభిచారమును విసర్జించిన పిదప వ్యభిచారము ద్వారా ప్రాప్తించుకున్న రోగముచే, ఆమె బాధింపబడుచున్న యెడల, అట్టికాలమందు ఆమె యితరులను సేవించుటకు అనర్హురాలై యున్నది. ఆ రోగమునుండి విముక్తి పొందిన పిదప మూడు సంవత్సరముల తొమ్మిది మాసములు పురుష సంపర్కమునకు దూరముగా యున్నగాని ఆమెకు వివాహ యోగ్యత ప్రాప్తించుట లేదు.

వ్యభిచార కాలమందు సంతానవతియైన స్త్రీ తదుపరి కాలములో ఎంతటి ఉన్నత దశకు ఎదిగినప్పటికిన్ని ఆమెకు వివాహ యోగ్యత ప్రాప్తించుట లేదు.

ఒక సంవత్సరకాలములో ముప్పది దినములందు రేయికి ఒకని కంటే ఎక్కువ మంది పురుషులకు దేహమును అర్పించిన స్త్రీ వ్యభిచార వృత్తిని విసర్జించిన తరువాత, తనా వృత్తి ద్వారా సంపాదించుకున్న సంపదనంతయు త్యజించి, వరుసగా ముప్పది మూడు పున్నమి రాత్రులు దైవచింతనలో జాగరణ చేసిన పిదప వివాహమునకు అర్హత పొందుచున్నది.

ఒక స్త్రీని నిర్బంధించి, భయాందోళనలకు గురిచేసి, ఆమెతన దేహమును తనకు యిష్టము లేకనే పురుషునకు అర్పణ చేసుకునే పరిస్థితి కల్పించ బడినయెడల, ఆ పరిస్థితులలో ఉన్నప్పటి చర్యల కారణంగా ఆమెకు వ్యభిచార దోషము అంటుటలేదు. అట్టి ప్రతికూల పరిస్థితుల నుండి బైటపడిన తర్వాత 18 మాసములకు ఆమెకు వివాహయోగ్యత ప్రాప్తించుచున్నది. ఈ మధ్యకాలములో ఆమె తన ప్రియునితో సంగమించిన యెడల అతనిని వెంటనే వివాహమాడ వచ్చును.

ఒక పురుషుని ఆధీనములో నున్న సంపదను గాని, హోదాను గాని, అనుభవించ వలెననెడి కోరికతో పురుషుని పట్ల తాను ఆకర్షితురాలు కాకున్నను అతనిని వివాహమాడిన స్త్రీకి జీవిత పర్యంతము వ్యభిచార కర్మ దోషము వెంటాడును. ఆమె వివాహమునకు ముందుగాని, పిదపగాని అన్య పురుషులతో సంబంధము కలిగి యుండ నప్పటికిన్ని పతిత యగుచున్నది.

భర్త కామాతురుడై తన దరిచేరినప్పుడు, అతనికి యిష్టములేని కార్యము నిర్వహించుటకు వాగ్దానము చేయువరకు అతనిని నిరోధించెడి భార్య తన భర్త వద్దనే వ్యభిచరించు చున్నది.

కుమార్తెకు యిష్టము లేని వ్యక్తితో ఆమె వివాహము జరిపించిన తల్లి దండ్రులకు కుమార్తె యొక్క వ్యభిచార కర్మదోషము అంటుటచే ఆమె తల్లి పతితయగును. తండ్రి నీచుడగును.

ఒక స్త్రీ ఒక పురుషునికి మానసికముగా అంకితమై యున్నకాలములో ఆమెను ఆపురుషుని నుండి వేరుచేసి మరియొక పురుషునితో ఆమె వివాహము జరిపించబడిన యెడల, ప్రియుని మనసునందు ధ్యానించుచున్నంత కాలము ఆమెకు ఏ విధమైన దోషము అంటుటలేదు.

తల్లి దండ్రులను వీడి తనతో రమ్మని ప్రియుడు ఆహ్వానించినప్పటికీ, దానిని తిరస్కరించి తల్లి దండ్రుల ప్రేరణ మేరకు మరొకనిని వివాహమాడిన స్త్రీ, భర్త స్థానములోని వ్యక్తితో మాత్రమే శారీరక సంబంధము కలిగియున్నప్పటికీ వ్యభిచార కర్మదోషము అంటుచున్నది.

ప్రియుని చూడకుండా ఆరుమాసములు స్వచ్ఛందముగా గడిపిన స్త్రీ ఆతరువాత ఎవరిని వివాహమాడినను ఎటువంటి దోషము అంటుట లేదు.

# కుటుంబ యజమాని

ఒక కుటుంబము యొక్క గౌరవము, ప్రగతి, స్థిరత్వము ఆ కుటుంబ సభ్యుల ప్రవర్తన, శ్రమ మరియు అంకిత భావముపై ఆధారపడి ఉన్నాయి. కుటుంబ ఆధీనంలో నున్న వొనరులను. సభ్యుల శక్తిని కుటుంబ శ్రేయస్సు లక్ష్యంగా సద్వినియోగం చేయుటే కుటుంబ యాజమాన్యం. ఆ యాజమాన్య బాధ్యతలు నిర్వహించే వ్యక్తి కుటుంబ యజమాని.

21 సంవత్సరములకు పైబడి వయసు గలవాడు, తెలివిగలవాడు, శక్తివంతుడు, వ్యసనములకు బానిసకానివాడు కుటుంబ యజమానిగా వ్యవహరించవలెను. కుటుంబములో యోగ్యుడైన పురుషుడు లేని యెడల ఆ కుటుంబములో వ్యవహార దక్షతగల స్త్రీ యాజమాన్యపు బాధ్యతలు నిర్వహించవలెను.

కుటుంబ యజమాని భార్య యజమానురాలు కానేరదు. ఆమెకు యజమానురాలి హోదాయివ్వడం శాస్త్ర సమ్మతం కాదు. ఆమె మిగతావారిలా కుటుంబములో ఒక సభ్యురాలు మాత్రమే. ఆమె భర్తకు మాత్రమే సహధర్మచారిణి. కుటుంబమునకు కాదు.

కుటుంబ యాజమాన్యంలో తరచుగా జోక్యము చేసుకుంటూ భర్త మనసును గాయపరిచే స్త్రీ, భార్యగా తన ధర్మమును విస్మరించు చున్నది.

యజమాని ప్రథమ కర్తవ్యము కుటుంబ పోషణ. యజమాని ఒక్కడే శ్రమించి కుటుంబమును పోషించుట గాని, కుటుంబ సభ్యులచే పనులు చేయించి యజమాని సోమరిగా యుండుటగాని శాస్త్ర సమ్మతం కాదు.

12 సంవత్సరాల వయసుకు లోబడిన వారిచేతను, 62 సంవత్సరాల వయసుకు పై బడిన వారిచేతను బలవంతముగా శ్రమ చేయించరాదు. 12 సంవత్సరముల లోపు బాలబాలికలపై యజమాని తన దండనాధికారమును వినియోగించి విద్యాబుద్ధులు నేర్పించవలెను. 62 సంత్సరములకు పైబడిన వారిపై యజమాని తన దండనాధికారమును వినియోగించి వారు మిగతా కుటుంబ సభ్యుల ప్రవర్తనపై ఆంక్షలు విధించకుండా చూడాలి.

62 సంవత్సరములు నిండగానే కుటుంబ యజమాని పదవీ విరమణ చేయవలెను. పదవీ విరమణ చేసేవ్యక్తి తనస్థానంలో తన వారసులలో యోగ్యుడైన వ్యక్తిని కుటుంబ యజమానిగా నియమించవలెను. తన వారసులు అయోగ్యులైన యెడల యాజమాన్యపు బాధ్యత తన భార్యకు అప్పగించ వలెను. భార్యను అయోగ్యురాలైన యెడల తన బంధువులలో యోగ్యుడైన వ్యక్తిని దత్తతగా స్వీకరించి యాజమాన్యపు బాధ్యత అప్పగించవలెను. బంధువులలో యోగ్యుడు దొరకని యెడల తన గ్రామంలో ఎవరినైనను దత్తత తీసుకొనవచ్చును.

హిందూ ధర్మము పట్ల విశ్వాసము లేని వారిని, నీచులను, హంతకులను, వ్యభిచారులను, ఎట్టిపరిస్థితులలోను దత్తతగా స్వీకరించరాదు.

కుటుంబ సభ్యులకు వారివారి శరీర దారుఢ్యమును బట్టి పనులు పురమాయించవలెను. అదేవిధముగా ఎవరి శరీర అవసరాలకు తగినంత ఆహారము వారికి లభ్యమయ్యేలా ఏర్పాటు చేయబడాలి.

కుటుంబ వార్షిక ఆదాయములోంచి వార్షిక ఖర్చును మినహాయించగా మిగిలిన దానిలో సగభాగాన్ని కుటంబ సభ్యులందరికీ వయసుతో నిమిత్తం లేకుండా సమానముగా పంచాలి. మిగిలిన సగభాగాన్ని కుటుంబ ఉమ్మడి ఆస్తిగా పరిగణించాలి. సభ్యులకు పంచిన ధనముపై జమాఖర్చులు అడిగే హక్కు కుటుంబ యజమానికి లేదు.

62 సంవత్సరములకు పై బడిన వారు తమ వాటాధనాన్ని కుటుంబంలో ఒకరికి కానుకగా యిచ్చిన యెడల మరుసటి సంవత్సరం నుండి వారికి ఆదాయంలో వాటా పంచుకునే హక్కు ఉండదు.

ఒక కుటుంబంలోని వ్యక్తి సభ్యునిగా తన బాధ్యతలు నిర్వహిస్తూ మిగులు సమయంలోని శ్రమ వల్ల లభించే ఫలితంపై కుటుంబానికి ఎటువంటి హక్కు ఉండదు.

ఒక వ్యక్తి తన కుటుంబమునకు దూరముగా ఉంటూ కుటుంబ వార్షిక ఆదాయంలో సగము కంటే ఎక్కువ సంపాదించుచుండిన యెడల అతనికి కుటుంబ వార్షిక ఆదాయంలో వాటా ఉండదు. అయితే కుటుంబం విడిపోయే సమయమున అతనికి వాటా కావలెనన్న ఒక పద్ధతిని పాటించవలెను.

కుటుంబం నుండి దూరంగా ఉన్న వ్యక్తి అలాదూరంగా ఉన్నకాలంలో సంపాదించిన స్థిర చరాస్తులలో సగం కుటుంబ ఆస్తులలో కలిపి వారసులందరికీ సమానముగా (విడిగా ఉన్న వ్యక్తితో కలిపి) పంచవలెను.

62 సంవత్సరములకు పైబడినవారికి ఏవిధమైన వాటాలివ్వాలన్నది స్థానిక సంఘాలుగాని, కుటుంబ సభ్యులుగాని నిర్ణయించవచ్చు. వీరికి మిగతా సభ్యులతో పాటు సమానమైన వాటాయిచ్చిన యెడల ఆ ఆస్తిపై అమ్మకపు హక్కుగాని, దానంయిచ్చే హక్కుగాని వారికి ఉండదు. వారి మరణానంతరం వారి ఆస్తిని పంపకాల సమయంలోని వాటాదారులకు (వాటాదారులు మరణించిన యెడల వారి వారాసులకు) సమానముగా పంచవలెను.

కుటుంబ సభ్యుల విద్యాభ్యాసమునకు అయ్యేఖర్చును కుటుంబఖర్చుగా పరిగణింప వలెను. విద్యాభ్యాసకాలంలో వారికి ఆదాయంలో వాటా ఉండదు.

## సంతానము

సమాజం తన మనుగడను, శ్రేయస్సును, పురోభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని యువతను సక్రమమైన మార్గంలో నడిపించడానికి యత్నించాలి. అంతకు మించిన ఆంక్షలుగాని, పనిభారంగాని సహించవలసిన నైతిక బాధ్యత యువతకు లేదు.

యువతలో శక్తి ఉంది. ఈ శక్తిపై ముసలితరం పెత్తనం వహించుట ధర్మ విరుద్ధం. ముసలి తరంలో అనుభం ఉంది. యువశక్తికి అనుభవం తోడైతే సమాజం అత్యంత శక్తి వంత మౌతుంది. సమాజంలో యువతరం పాలకులు గాను, వృద్ధతరం సలహాదారులుగాను ఉండాలి.

62 సంవత్సరాలకు పైబడిన వ్యక్తులు కుటుంబ యజమానులుగా గాని, గ్రామ పెద్దలుగా గాని, మండాలాధిపతులుగా గాని, దేశాధిపతులుగా గాని, శాసన కర్తలుగా గాని యుండుట ధర్మ విరుద్ధము.

62 సంవత్సరములకు పైబడిన వారు తమసంపదను వారసులకు పంచి వాన ప్రస్థాశ్రమ ధర్మమును నిర్వర్తించవలెను. ఆత్మ చైతన్యమును పొందుటకు అదియే ఉత్తమ మార్గము.

తమ వారసులు బాల్యదశలో యున్నయెడల వారికి 21సంవత్సరముల వయసు నిండేంతవరకు బాధ్యతలు నిర్వర్తించవచ్చును.

62 సంవత్సరములు నిండిన వారికి వారిస్వార్జితమైన ఆస్తి యందును హక్కు ఉండదు. వారి ఉదర పోషణార్థము, వైద్య సదుపాయనిమిత్తము సరిపోయే ఆస్తిని మాత్రమే కలిగి యుండవలెను.

వారికి ఏ విధమైన ఆస్తులు లేని యెడల వారిని పోషించవలసిన బాధ్యత వారి వారసులపై యున్నది. ముసలి తల్లి దండ్రులను పోషించని వానికి నీచ కర్మానుష్ఠాన దోషము కలుగును.

వృద్ధులైన తల్లి దండ్రులను సేవించని వాడు ఎన్ని సత్కర్మలు చేసినను. యజ్ఞయాగాది క్రతువులు నిర్వహించినను, నిష్ఠగా తపస్సు ఆచరించినను వాటి వలన ఏ విధమైన ఫలితమును పొందుటలేదు. ఆ సత్కర్మల వలన తల్లి దండ్రులను సేవించని పాపము విడువదు.

62 సంవత్సరములు నిండిన తర్వాత ఆస్తిపై మమకారము వీడక దానిని వృద్ధిచేయుటకై శ్రమించెడి వారిని, ఆస్తిని ఎరగా చూపి తమ వారసులను తమకు యిష్టమైనరీతిలో నడచుకునేలా బలవంతపేట్టే వారిని, సంతానమునకు యిష్టములేని వ్యక్తితో వివాహము జరిపించిన వారిని, కోడలి మృతికి కారకులైన వారిని, సంతానము యొక్క వైవాహిక జీవితములో తలదూర్చి కలతలు సృష్టించిన వారిని, సంతానము యొక్క ప్రేమకు విఘ్నములు కలుగ చేసిన వారిని, ఏ కారణము చేతనైనను ఆత్మహత్యకు పాల్పడిన వారిని, ఆత్మహత్య చేసుకుంటామని సంతానమును బెదిరించిన వారిని, సంతానమునకు వివాహమైన తర్వాత కూడా వివాహేతర శారీరక సంబంధములు పెట్టుకున్న వారిని, అక్రమ మార్గముల ద్వారా ధనము, ఆస్తులు కూడ బెట్టిన వారిని, శత్రురాజ్యపు గూఢచారులుగా వ్యవహరించిన వారిని, మిత్రులను మోసం చేసిన వారిని, త్రాగునీటి వనరులను నాశనం చేసిన వారిని, ఇతరుల ఆస్తులను దగ్ధం చేసిన వారిని, జూదములో ఆస్తులను హరింపజేసిన వారిని, మత్తుపానీయములకు బానిసయైన వారిని, స్త్రీల క్రయ విక్రయములలో ప్రమేయము ఉన్నవారిని, సమాజ ద్రోహమునకు, రాజద్రోహమునకు పాల్పడిన వారిని, పండితులను, సాధుపుంగవులను, ధర్మభిక్షువులను, గర్భిణీ స్త్రీలను హింసించిన వారిని, నాగుపాములను చంపుట వృత్తిగా గలవారిని, శిశు హత్యలకు పాల్పడిన వారిని, ఆలయాలలోని విగ్రహములను గాని, నగలు ఆభూషణములను గాని, లేక ఆలయానికి చెందిన మరేయితర సంపదను గాని దొంగలించిన వారిని, ఆలయ పూజారులతో గాని, వారి కుటుంబ స్త్రీలతో గాని అనుచితంగా పవర్తించిన వారిని, తాళపత్రగ్రంధములను నాశనం చేసిన వారిని, కాపుతో వున్న ఫలవృక్షములను నరికిన వారిని, నరికించిన వారిని, పావురముల మాంసము భుజించిన వారిని, మిత్రుని సంపదను తస్కరించిన వారిని, చెరువు గట్టులకు గండ్లుపెట్టు వారిని, పసికందులను దొంగిలించి విక్రయించు వారిని, సంతానము యొక్క విద్యాభ్యాసమును ఆటంకపరచిన వారిని, 15 సంవత్సరములలోపు వయసు గల సంతానమును యితరుల సేవకు

నియమించి వారి శ్రమ ఫలితాన్ని అనుభవిస్తూ సోమరిగా జీవించిన వారిని, కోడలు గర్భవతిగాయున్న కాలంలో ఆమెను, ఆమె తల్లి దండ్రులను హింసించిన వారిని, యుద్ధభూమినుండి పారిపోయి వచ్చిన వారిని, వైద్యుడు గ్రామమును వీడి పోవుటకు కారకులైన వారిని, దేవాలయాల ప్రక్కన గోతులు త్రవ్విన వారిని, వన్య మృగములను సంహరించి వాటి శరీర భాగములను విక్రయించు వారిని, సుఖ వ్యాధులతో బాధపడేవారిని, దేవుని అవతారముగా ప్రచారము చేసుకొను వారిని, రోజుకు ఒక పర్యాయమైనా స్నానము చేయని వారిని, మలిన వస్త్రములు ధరించు వారిని, సేవించేవారి మనసును గాయపరిచే వారిని, యుద్ధము నందు పాల్గొన వద్దని తమ సంతానమును బలవంత పేట్టే వారిని, ధనాపేక్షతో స్వధర్మమును విడనాడి పరధర్మము స్వీకరించిన వారిని, న్యాయ మూర్తి స్థానంలో ఉండి నిర్దోషులను శిక్షించిన వారిని, సాధుజన హంతకులను రక్షించిన వారిని, దిగంబరులను సేవించ వలసిన బాధ్యత వారి సంతానమునకు లేదు.

అట్టి తల్లి దండ్రులను సేవించనప్పటికినీ వారి సంతానమునకు నీచకర్మ దోషము అంటుట లేదు.

అట్టి తల్లి దండ్రులు 72 సంవత్సరములు నిండిన వారై తాము గతములో చేసిన దుష్కర్మలకు పశ్చాత్తాప పడినచో, వారి హృదయమాలిన్యము పశ్చాత్తాపముతో కడుగబడినచో వారిని సేవించుట వారి సంతానము యొక్క కర్తవ్యము.

## కుటుంబ సభ్యులు

ఒక కుటుంబ సభ్యుడుగాని లేక సభ్యురాలుగాని కుటుంబ యజమానికి తనపై గల ప్రేమని ఆసరాగా చేసుకొని కుటుంబ యాజమాన్యములో జోక్యము చేసుకొనరాదు. కుటుంబ యాజమాన్య విషయంలో సలహాలిచ్చు నపుడు సేవకుడు ఏ విధముగా ప్రవర్తించునో కుటుంబ సభ్యులును ఆ విధముగానే ప్రవర్తించవలెను.

యజమానురాలి వలె ప్రవర్తించుచు కుటుంబ యజమాని స్థానములో నున్న భర్తపై ఆధిపత్యము చెలాయించెడి స్త్రీ భార్యగా తన స్థానమును స్వయముగా బలహీన పరుచు కొనుటచే తమ వివాహబంధమును అపవిత్రము గావించుచున్నది.

తల్లికి తన సంతానంపై వారికి 12 సంవత్సరములు నిండునంత వరకు దండనాధికారము కలిగియున్నది. సంతానమునకు 15 సంవత్సరములు నిండునంతవరకు తండ్రికి దండనాధికారము గలదు. అటుపై వారిని దండించే అధికారము కుటుంబ యజమానిది.

15 సంవత్సరములకు పై బడిన వారు తమ విధులను సక్రమముగా నిర్వహించని యెడల వారిని కుటుంబము నుండి బహిష్కరించెడి అధికారము కుటుంబ యజమానికి గలదు. అట్లు బహిష్కరించు సమయమున బహిష్కరణకు గురైన వ్యక్తికి ఆరుమాసములకు సరిపడు ఆహారధాన్యములను. వస్త్రములను యివ్వవలెను. నాలుగు సెంట్ల స్థలములో నివాసయోగ్యమగు పాక నిర్మించి అతనికి యివ్వవలెను.

ఒకసారి కుటుంబము నుండి బహిష్కరించ బడిన వ్యక్తిని మూడు సంవత్సరములలోపు కుటుంబ సభ్యునిగా చేర్చుకొనరాదు. ఒక వ్యక్తి బహిష్కరణ శిక్షను అనుభవిస్తున్న కాలములో మిగిలిన వారు కుటుంబ ఆస్తులను వాటాలుగా చేసి పంచుకొనరాదు.

ఒకవ్యక్తి కుటుంబము నుండి బహిష్కరించ బడిన కాలములో కుటుంబ యజమాని మృతిచెందిన యెడల బహిష్కరణ శిక్ష రద్దైపోతుంది. అతడును మిగిలిన కుటుంబ సభ్యులవలె హక్కును కలిగి యుండును.

యుక్త వయస్కులైన స్త్రీ పురుషులను వారి ప్రేమ వ్యవహారాల కారణంగా వారిని కుటుంబమునుండి బహిష్కరించెడి అధికారము యజమానికి లేదు. కుటుంబములో ఎవరైనా యజమాని అనుమతి పొందకుండా వివాహము చేసుకున్న యెడల వారు వివాహమాడిన వ్యక్తికి కుటుంబములో సభ్యత్వము లభించదు. వారికి సంతానము కలిగిన వెంటనే వారికిని. సంతానమునకును కుటుంబ సభ్యుల హోదా లభించు చున్నది.

కుటుంబ యజమాని మృతి చెందిన పక్షములో ఆకుటుంబములోని ఆడపిల్లలకు వివాహముచేయకుండా వాటాలు పంచుకొనరాదు. ఒకవేళ ఆంతరంగిక విభేదాల కారణముగా వాటాలు పంచుకొనడం తప్పనిసరైనచో మృతి చెందిన యజమాని యొక్క అవివాహితలైన కుమార్తెలకు కుమారులతో సమానముగా వాటా పంచవలెను.

వివాహిత యైన స్త్రీ యొక్క భర్త మృతి చెందినచో, ఆమె సంతానవతి కాని యెడల పుట్టినింటివారు ఆమెను తిరిగి తమ కుటుంబసభ్యురాలిగా స్వీకరించ వలెను. మృతి చెందిన భర్త యొక్క ఆస్తికి వారసురాలైన స్త్రీకి తదుపరి వివాహయోగ్యత లేదు. ఆమె ఒక ప్రియుని కలిగి యుండి అతని ద్వారా సంతానము పొందవచ్చును.

కుటుంబములోని వ్యక్తి హిందూధర్మశాస్త్ర రీత్యా అయోగ్యుడైన పురుషుని గాని, అయోగ్యురాలైనా స్త్రీని గాని వివాహమాడినచో కుటుంబ ఆస్తియందు వారికి వాటా లభించదు.

యుక్త వయస్సు వచ్చిన స్త్రీకి అటుపై తొమ్మిది సంవత్సరములలోగా వివాహము కాని యెడల ఆమెకు 26వ సంవత్సరము నుండి ఆస్తిలోనూ, వార్షిక ఆదాయములోనూ రెండు వాటాలకు హక్కుదారు అవుతుంది.

కుటుంబయజమాని హెచ్చరికను ఖాతరు చేయకుండా 15 సంవత్సరములకు పై బడిన కుటుంబ సభ్యులు పదేపదే కలహించు కొనుట ద్వారా గాని, కొట్లాడు కొనుట ద్వారా గాని కుటుంబ ఐక్యతకు భంగము కలిగించుచున్న యెడల వారికి ఒక సంవత్సరకాలము కుటుంబ బహిష్కరణ శిక్ష విధించవలెను. శిక్షాకాలం పూర్తయిన తర్వాత కూడా వారి మధ్య సయోధ్య యేర్పడని యెడల వారిపోషణకు అవసరమైన ఆస్తిని వారికి వాటాగా పంచి కుటుంబము నుండి శాశ్వతముగా దూరము చేయవలెను.

# సమాజము

సమాజము శరీరము వంటిది. వ్యక్తులు అంగముల వంటివారు. శరీరము ఒక అంగమును ఉన్నతమైనది గాను, మరోదానిని నీచమైనది గాను చూచుటలేదు. పౌరులందరినీ సమదృష్టితో చూచుట సమాజము యొక్క ధర్మము. శరీరములోని అన్ని భాగాలకు అవసరమైన ప్రాణవాయువు, పోషక పదార్థాలు అందజేయబడుతున్న విధముగానే, సమాజము తన పౌరుల మౌలిక అవసరములను తీర్చుటలో నిష్పక్షపాత వైఖరిని అవలంబించ వలెను.

అంగము శరీరములోని భాగమే తప్ప శరీరమునకు బానిసకాదు. అదే విధముగా ఏ ఒక్క వ్యక్తిగాని, వర్గము గాని, కులము గాని, జాతి గాని, తనకు బానిస కాదన్న సత్యమును సమాజము గుర్తించ వలెను.

శరీరములోని ఒక భాగము మరో భాగమునకు బానిస కాదు. అదే విధముగా ఆదర్శవంతమైన సమాజంలో ఒక వ్యక్తి యజమానిగను మరోవ్యక్తి ప్రత్యక్ష లేక పరోక్ష బానిసగను ఉండరాదు.

ఒక అంగము గాయపడినచో దానికి విశ్రాంతినిచ్చి, గాయము మాన్పుటకు అవసరమైన చర్యలు శరీరము తీసుకుంటుంది. అదే విధముగ పౌరులకు ఏ విధమైన బాధలు కలిగినను వాటిని నివారించుట సమాజము యొక్క కర్తవ్యము.

చలి, వర్షము, ఎండ బారినుండి అన్ని భాగములకు తగిన రక్షణ శరీరము కల్పించు చున్నది. పౌరులందరికీ వారి అవసరాలను తగిన విధముగా గృహ వసతి కల్పించుట సమాజము యొక్క బాధ్యత.

బాహ్య శత్రువుల బారినుండి శరీరములోని అన్ని అవయవములు కాపాడ బడుతున్న రీతిలోనే పౌరులకు సంపూర్ణ రక్షణ కల్పించుట సమాజము యొక్క మనుగడ ధర్మము.

శరీరములోని అవయవముల మధ్య ఆంతరంగిక విభేదములు లేవు. ఒక అంగము మరో అంగమును నాశనము చేయుటకు యత్నించుట లేదు. ఒక అంగము శరీరము నుండి వేరు పడుటకు యత్నించుటలేదు. సమాజములోని ఆంతరంగిక విభేదములను అంతమొందించుట సమాజ పాలనాయంత్రాంగం యొక్క మౌలిక బాధ్యత.

ఒక అంగము క్రుళ్ళిపోయి యితర అంగములను నాశనం చేయుటకు యత్నించినచో శరీరము ఆ అంగమును తన నుండి వేరు చేయు చున్నది. అట్టి మాదిరిగనే ఒక వ్యక్తిగాని వర్గం గాని, జాతిగాని, తెగ గాని, సమాజమును రోగగ్రస్తం చేస్తున్న గాని, చేయడానికి యత్నించిన గాని, వారిని తగురీతిలో శిక్షించి సమాజము యొక్క ఉనికిని కాపాడుట పాలనా యంత్రాంగము యొక్క కర్తవ్యము.

శరీరములో ఒక అంగమును ఎక్కువ కాలం సోమరిగా ఉంచినయెడల అది శక్తిహీన మగును. తరువాత దాని ప్రభావం మిగతా అవయవములపై బడును. సమాజములో ఒక వర్గమును చైతన్యరహిత స్థితిలో శక్తిహీనముగా ఉంచుట వలన సమాజ శ్రేయస్సుకు విఘాతము కలుగును.

శరీరమును నియంత్రిస్తున్న మనసు వ్యసనములకు బానిసయైనచో ఆ దేహము క్రమక్రమముగా క్షీణించును. అటులనే సమాజ పాలనాయంత్రాంగము అవినీతి యనెడి వ్యసనమునకు బానిసయైనచో ఆ సమాజము అవినీతి స్థాయిని బట్టి పతన మగును.

శరీరములోని మలినములు, వ్యర్థపదార్థములు స్వేదము, మలమూత్రాదుల ద్వారా విసర్జింపబడు చున్నవి. సమాజము నందు ఆవరించియున్న అధర్మమును మలినముగా గుర్తించి విసర్జించని యెడల సమాజము సదా రోగగ్రస్తమై యుండును.

ఒక అంగముపై అంటువ్యాధి ప్రబలుటకు అవకాశం యిచ్చినచో అది త్వరలోనే శరీరమంతయు వ్యాపించును. సమాజములో స్వార్థగుణము అంటువ్యాధి వంటిది. దాని వ్యాప్తిని ప్రాథమిక దశలో అరికట్టుట సులభము. అది సమాజమంతటా వ్యాపించి బలపడిన యెడల దాని బారినుండి సమాజమును రక్షించుటకు చాలా కఠినచర్యలు తీసుకొన వలసి యుండును.

సోమరితనమునకు అలవాటు పడిన శరీరము యొక్క ఆకృతిలో వికారము గోచరించును. ఎంత పెద్ద సమాజమైనను సోమరితనమునకు అలవాటు పడిన యెడల సర్వత్రా పౌరుల ప్రవర్తనలో వికారము కన్పించును. కావున సోమరితనమును బహిష్కరించుట సమాజము యొక్క విధి.

శరీరములో గుండె కీలకమైనది. అది స్తంభించినచో శరీరము మృతి చెందును. ధర్మము సమాజమునకు గుండె వంటిది. గుండె ఏ విధముగా విరామమెరుగక పని చేయునో అట్టి విధముగా, ధర్మము నిత్య చైతన్య స్థితిలో నుండవలెను. శరీరములో గుండెకు ఏ విధముగా రక్షణ కల్పించబడి యున్నదో అదేవిధముగా ధర్మమునకు సదా రక్షణ కల్పించవలసిన బాధ్యత సామాజిక వ్యవస్థపై యున్నది. ధర్మము లేనిచోట పాలకులు, పాలించబడే వారు అనే రెండు వర్గాలు మాత్రమే ఉంటాయి. యజమాని బానిసల మధ్య ఉండే సంబంధం అది. యజమాని తన శక్తిని యుక్తిని వినియోగించి బానిసలను తనకు అనుకూలమైన పనులకు నియోగిస్తాడు. అందువలన తాను మరింత శక్తివంతుడౌతాడు. యజమాని బలహీనుడవగానే బానిసలు తిరుగుబాటు చేస్తారు.

ఒక దేహములో అంగములు లోపించిన యెడల దానికి మరోదేహము యొక్క సహకారము అవసరము. ఒక సమాజము తన దైనందిన అవసరాల నిమిత్తం యితర సమాజాలపై ఆధారపడుట తన అంగవైకల్యమును ప్రదర్శించుకొనుటయే. అంగములుండియు అంగవైకల్యము నటించుట అత్యంత హేయమైనది. తన సామర్థ్యమును పూర్తి స్థాయిలో వినియోగించు కోకుండా యితర సమాజాల సహకారాన్ని అర్థించే సమాజము తనని తాను నీచముగా చిత్రించు కొనుచున్నది. ఇది పాలనా యంత్రాంగం తన విధుల నిర్వహణలో విఫలమైన దనడానికి సూచిక.

పాలనా యంత్రాంగము విఫలమైనప్పుడు అది ప్రజలను బానిసలుగా మారుస్తుంది. అట్టి దశలో ఆపాలనా యంత్రాంగాన్ని తొలగించేందుకు తమ శక్తిని ప్రజలు ఏ విధముగా ప్రయోగించినను అది ధర్మసమ్మతమే ప్రజా వ్యతిరేక పాలనా యంత్రాంగము యొక్క ఉనికిని రక్షించే సామాజిక శాసనాలను ఉల్లంఘించే అధికారము ప్రజలకు ఎప్పుడూ ఉంటుంది.

ఎప్పుడైతే సామాజిక శాసనాలు పౌరులలో మూడవ వంతు మంది సమ్మతిని కోల్పోతాయో అప్పుడే అవి అధర్మశాసనాలుగా మారిపోతాయి. అధర్మ శాసనాలను అమలు పరిచేది అధర్మయంత్రాంగము. ధర్మశాస్త్రం ప్రకారం మూడవ వంతు పౌరుల సమ్మతిని కోల్పోయిన క్షణమే ఆ శాసనాలు, వాటి రక్షణ యంత్రాంగము రద్దయి పోయినట్లే. అట్టి స్థితిలో ప్రజల తిరుగుబాటును శాసనోల్లంఘన గాను, సమాజ వ్యతిరేక చర్యగాను భావించరాదు. వారి చర్యలను ధర్మపోరాటముగా పరిగణింప బడాలి.

సమాజము యొక్క ప్రగతి దాని శక్తి సామర్థ్యాలపై ఆధారపడి ఉంటుంది. తన పౌరుల శక్తి సామర్థ్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవలసిన బాధ్యత సమాజముపై నున్నది. స్వీయ వినాశ దిశగా వారిగి పోకుండా ప్రతి సమాజము తనని తాను రక్షించు కోవాలి. అంతర్గత కలహాలు, వైరుధ్యాలు స్వీయ వినాశ సంకేతాలు.

సమాజంలో ఒక వర్గము బలహీన పడినచో అందుకు మూలకారణాలు అన్వేషించి వెంటనే ఆ వర్గం యితర వర్గాలతో సమానముగా శక్తి పుంజుకునేలా చర్యలు గైకొనబడాలి. ఒక వర్గము బలహీనముగా యున్నప్పుడు మరో వర్గము బలపడుతుంటే దానిని అరికట్టుటలోనే సమాజ పాలనా దక్షత యిమిడి యున్నది. పాలనా దక్షత కొరవడినచోట సమాజములో అసమ్మతి, అరాచకత్వము వ్యాప్తి చెందుతాయి. ఇవి ఒక దశవరకు నివురు కప్పిన నిప్పువలె ఉండి అనుకూల పవనాలు తోడైనప్పుడు సామాజిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తాయి.

సమాజము యొక్క ఉనికి వ్యక్తుల పైన, వ్యక్తుల యొక్క ఉనికి సమాజము పైన ఆధారపడి యున్నది. తన ఉనికి ప్రత్యక్షముగాను, పరోక్షముగాను సమాజము పై ఆధారపడి యున్నందున వ్యక్తి సమాజము పట్ల తన ధర్మమును గుర్తించి తదనుగుణంగా ప్రవర్తించాలి.

## సంపద

ప్రతి జీవి తన మనుగడకు అవసరమైనంత మేరకు మాత్రమే తనకందుబాటులో ఉన్న ప్రకృతి వానరులను, వాటి ఆధారముగా జీవించే చరాచర జీవులను వినియోగించుకోవాలన్నది దైవశాసనం. ఇదే కృతయుగ ధర్మము.

మానవుడు తన మనగడకు అవసరమైన ప్రకృతి వానరులను, చరాచర జీవులను 'సంపద' యని పిలుచుచున్నాడు. ఒక రాజ్యములో నివసించెడి ప్రజలందరు ఆరాజ్యములోని సంపదపై హక్కును కలిగియున్నారు.

తన ఆధీనములోని సంపదను గాని, యితరుల ఆధీనములోని సంపదను గాని నాశనముచేయు అధికారము ఎవనికీ లేదు. సంపదను నిరుపయోగముగా యుంచెడి అధికారము దాని యజమానికి సైతము లేదు.

ఒక రాజ్యములో నివసించువారు తమ రాజ్యములోని జీవ సంపదను యితర రాజ్యాల వారికి విక్రయించుట అధర్మము. ఇట్టి జీవహింసవలన ఆ రాజ్యములోని సత్కర్మల పుణ్యఫలమంతయు నశించుచున్నది.

సంపద ఎవరి ఆధీనములో నున్నప్పటికీ దాని వినియోగాన్ని నిర్దేశించే హక్కు సమాజమునకు గలదు. ఏ సమాజములోనైతే సంపద తక్కువ వ్యత్యాసముతో పౌరులకు పంపిణీ చేయబడుతుందో ఆ సమాజము ఎల్లప్పుడు పటిష్ఠముగా యుండును.

సామాజిక సంపద యొక్క పంపిణీలోని అధర్మమునకు సంకేతమే పేదరికం. ఒక ప్రాంతములోని ప్రజలు తమ శక్తి సామర్థ్యములను పూర్తి స్థాయిలో వినియోగించుకొనని యెడల సామాజిక సంపద పంపిణీ సవ్యముగా జరిగినప్పటికి వారు పేదరికమును అనుభవించ వలసి వచ్చును.

ఒక ప్రాంతములోని ప్రకృతి వనరులు పోషించగలిగిన సంఖ్య కంటే ఎంతో ఎక్కువ సంఖ్యలో ప్రజలు ఆ ప్రాంతములో నివసించవలసిన పరిస్థితులు ఏర్పడినను అచట పేదరికము తాండ వించును. అట్టి దశలో ఆ ప్రాంతవాసులు యితర ప్రాంతాలకు వెళ్ళి అచటి మిగులు భూమిని స్వాధీన పరుచుకొనవచ్చును. ఇది వలస ధర్మము.

ఇతర ప్రాంతాలకు వలస వెళ్ళుటకు సాధ్యపడదని తెలిసినప్పుడు జనసంఖ్యను నియంత్రించవలసిన బాధ్యత సమాజానిది. అట్టి సందర్భములలో జనసంఖ్యను నియంత్రించుటకు సమాజము ఏ విధమైన కఠినచర్యలు చేపట్టినప్పటికి అవి ధర్మశాస్త్ర సమ్మతములై యున్నాయి.

నీవు నివసించే సమాజంలో యితర సభ్యుల ప్రత్యక్ష, పరోక్ష సహకారము లేనిదే నీ వద్ద సంపద వొనగూడదు. నీవు సమాజములోని సగటు పౌరుని వద్దనున్న దానికంటే ఎక్కువ ఆస్తి కలిగియున్న యెడల నీవు యితరులను ప్రత్యక్షముగానో, పరోక్షముగానో దోచుకుంటున్నావన్న సత్యమును గుర్తించు.

ఐదు సంవత్సరముల కొక పర్యాయము వ్యక్తుల వద్ద ఒక స్థాయికి మించి వొన గూడిన సంపదను సమాజము స్వాధీనపరచుకొనవలెను. పరిమితిలేని సంపదను కలిగియుండెడి స్వేచ్ఛను, అవకాశములను వ్యక్తులకు కల్పించబడిన సమాజములో ధర్మము నశించును. సంపదను వొనగూడ్చుకొను యత్నములో నీతి నియమములు విసర్జింపబడతాయి. ఒకరినొకరు దోచుకును యత్నములో పౌరులు పరస్పర సహకార ధర్మమును విస్మరించెదరు. సామాజిక అసమానతల నుండి అసంతృప్తియు, అసంతృప్తి నుండి అరాచకత్వము వ్యాప్తి చెందును.

## దానము

శరీర అవయవములన్నియు సక్రమముగా ఉన్నవారు, తమ ఆహారాన్ని తామే సేకరించగల సామర్థ్యమున్నవారు భిక్షకు అనర్హులు. అర్హత లేని వారికి ఏది దానము చేసినా అది దురాచారమే అవుతుంది. భిక్షకు ఎవరు అర్హులో గ్రామ స్థాయిలో నిర్ణయం జరగాలి. వికలాంగులు, శారీరకంగా బలహీనులు, అంధులు, వారసులు లేని ముదుసలులు - వీరంతా భిక్షకు అర్హులే. వీరిని పోషించడం ఆ గ్రామస్తుల నైతిక బాధ్యత. అదే మానవత్వం. ఆ బాధ్యతను గ్రామవాసులంతా కలిసి తమ శక్తి మేరకు నిర్వహించాలి. అంతేతప్ప ఆ బలహీనులకు జోలె సాచి ప్రతి యింటికీ వెళ్ళి యాచించే దుస్థితి కల్పించరాదు. ఏ గ్రామంలో నైతే అచ్చటి బలహీనులకు ఆ దుస్థితి

ఒక గ్రామస్తుడు బిక్ష కొరకు మరో గ్రామం వెళ్ళడం- నిశిద్ధం. భిక్షకుడు ఏగ్రామానికి చెందినవాడో ఆ గ్రామానికి అది అపకీర్తిని ఆపాదిస్తుంది. స్వంత ఊరిలో భిక్షకు అనర్హులుగా గుర్తింపబడినవారు లేదా అర్హులై ఉండి స్వగ్రామంలో నిరాదరణకు గురైనవారు మాత్రమే యితర గ్రామాలకు, ప్రాంతాలకు భిక్షాటనకు వెళతారు.

అర్హుడైన భిక్షకుణ్ణి అతని గ్రామస్తులు పోషించలేదంటే వారు తమ బాధ్యతను విస్మరించినట్లే. భిక్షకుని తాత్కాలికముగా పోషించి అతని గ్రామానికి తీసుకెళ్ళి, అచటి పెద్దలను సమావేశ పరచి, ఆ పెద్దలు ఆ భిక్షకుని పోషణ బాధ్యత స్వీకరించేలా చేయవలె. ఆ గ్రామంలో సదాచారులు ఎవరూ లేరని నిర్ధారించుకున్న తర్వాత మాత్రమే యితర గ్రామస్తులు ఆ భిక్షువు పోషణ బాధ్యత సీకరించవలె.

అంతే తప్ప నీ కుటుంబ సభ్యులు తినగా మిగిలినది, మరో జంతువుకు సమర్పించే బదులు తోటి మానవునికి యివ్వడం దానము కాదు. అది దానమని చేప్పేవాడు జ్ఞానికాదు. హిందువు అంతకంటే కాదు. అలాంటి చర్యలు సమర్థించేవారు కేవలం వక్రభాష్యకారులు.

ఏ వ్యక్తులైతే మానవులలో సదాచారాన్ని, శిష్టత్వాన్ని నెలకొల్పడానికి తమ జీవితాలను అంకితం చేస్తారో వారిని పోషించవలసిన బాధ్యత మానవాళి అంతటిపైనా యున్నది. వీరు కేవలం ఒకే ప్రాంతానికి అంకితమై యుండుట సమర్ధనీయం కాదు. వీరు సదా సంచారంలో ఉంటూ అన్ని ప్రాంతాలవారి మనోవికాసానికి తోడ్పడాలి. వీరు భాషకు, మతాలకు అతీతులై ఉంటారు. వీరు మానవాళి శ్రేయస్సును వాంఛిస్తారు. అటువంటి మహనీయులు, వారి శిష్యులు తమ ఉదర పోషణార్ధం ఒకే ప్రాంతంలో స్థిరపడితే అది మానవ సమాజానికి శ్రేయస్కరం కాదు. అందుకే వారికి బిక్షాటన ద్వారా తమ ఉదర పోషణ గావించుకొను ఆచారము ఏర్పరచబడినది.

వీరు వండిన ఆహార పదార్థములను భిక్షగా స్వీకరించరాదు. వండని పదార్థములను భిక్షగా స్వీకరించి, వాటిని తమ నియమాలకు అనుగుణంగా పక్వంచేసి భుజించవలె. అటుల వీలుకాని పక్షంలో ఆ గ్రామస్తులే వీరికి ఒక ప్రాంతంలో వంట చేసి అర్పించుకోవచ్చు. వీరు అతిధులుగా గ్రామవాసుల యిళ్ళకు వెళ్ళి భుజించడం వలన దుష్టుడు తన దుష్టత్వాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఈసాధువులకు ఆశ్రయమిచ్చే అవకాశాలు హెచ్చుగా ఉంటాయి. ఒక దుష్టుని ఆతిధ్యం స్వీకరిస్తూ వీరు సత్వర్తనని బోధిస్తే వీరి బోధనలు ఆ సమాజాన్ని ప్రభావితం చేయలేవు. వీరి శ్రమలో ఎక్కువ భాగం వృధా అవుతుంది. అందుకే వీరు గ్రామస్తుల యిళ్ళకు అతిధులుగా వెళ్ళవలసివస్తే ముందుగా పేదవాని యింట్లోను, చివరగా ధనవంతుని యింట్లోను ఆతిధ్యము స్వీకరించవలెను. దైవకార్యాల పేరుతో ధనవంతుల నాశ్రయించుకుని బ్రతికే వారి పాండిత్యం సమాజానికి ఉపకరించదు.

ఒక సమాజం మరో సమాజం నుండి గాని ఒకదేశం మరో దేశం నుండి గాని ఉదారంగా సహాయాన్ని ఏరూపంలో స్వీకరించినా అది భిక్షే అవుతుంది.

ప్రకృతిలో అనేక పరిణామాలు సంభవిస్తాయి. ప్రకృతి విలయతాండవం చేసినప్పుడు ఒక

ప్రాంతంలో ఆహార పదార్థాల కొరత ఏర్పడవచ్చు. ఇతర ప్రాంతాలవారు సహకరించకపోతే కరువు ప్రాంతప్రజలు ఆకలితో అలమటించి, వారిలో ఎక్కువ మంది గాని, కొంతమందిగాని అకాల మరణానికి గురిఅయ్యే అవకాశం హెచ్చు. ఆ సందర్భాలలో ఆప్రాంతవాసులు ఇతర ప్రాంతాలవారి సహాయాన్ని అర్థించవచ్చు.

లభ్యమైన సహాయాన్ని, ఏవిధంగానూ దుర్వినియోగం చేయరాదు. పూర్తిగా సద్వినియోగ పరచుకుని, తమ పరిస్థితులను చక్కదిద్దుకుని స్వయం పోషకత్వదిశగా పయనించాలి.

ఇది భిక్ష కాదు. ఒకరికొకరు సహకరించుకోవడం. ఇది గ్రామంలోనూ జరుగుతుంది. ఒకని గృహం అగ్నికి ఆహుతి అయినప్పుడు,సాటిగ్రామస్తులు అతనికి సహకరించవలె. ఒక గ్రామంకష్టాల్లో ఉంటే పొరుగు గ్రామస్తులు, ఒక ప్రాంతం బాధల్లో ఉంటే పొరుగు ప్రాంతాలవారు, ఒకదేశం కరువు కాటకాల్లో చిక్కితే పొరుగు దేశాలవారు సహకరించుకోవడం ఉత్తమ సాంప్రదాయం.

ఏ దేశంలోనైతే పేదరికాన్ని ఆసరాగా తీసుకొని కొంతమంది సంపన్నులు తమ సంపదని పెంచుకుంటూ పోతారో ఆదేశం కరువుకాటకాల్లో సైతం యితర దేశాల వద్ద నుండి సహాయాన్ని పొందే అర్హతను కోల్పోతున్నది.

దేశంలో కరువు ఉన్నప్పుడు, ఆ దేశంలోని ధనవంతుల సంపదను స్వాధీనం చేసుకుని ప్రజల అవసరాలు తీర్చవలసిన బాధ్యత ఆదేశాన్ని పాలించే ప్రభుత్వానిది. అలాగే తమ దేశంలోని ధనవంతులు ఏవిధమైన త్యాగాలు చేయకుండా, ఇతర దేశాల సహాయ సహకారాల పై ఆధారపడి తమ సమస్య నుండి బైటపడాలని యత్నించే ప్రభుత్వాలు కేవలం ధనిక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నాయని గుర్తించాలి.

అలా ఒక వర్గానికి మాత్రమే ప్రాతినిధ్యం వహించే ప్రభుత్వాల పాలనలో నున్న దేశాలకు సహకరించవలసిన బాధ్యత పొరుగు దేశాలకు లేదు. 'మీ దేశంలోని సామర్థ్యాన్ని సంపూర్ణంగా వినియోగించుకున్న తర్వాత మాత్రమే, అది చాల లేదని నమ్మిక కుదిరిన తర్వాత మాత్రమే మీకు సహకరిస్తాం' అన్న సిద్ధాంతాన్ని ప్రతి దేశము పాటించాలి.

అలాకాకుండా వర్గ ప్రాతినిధ్య ప్రభుత్వాల ఏలికలోనున్న దేశాలకు సహకరించే దేశాల చర్యలు స్వార్థ పూరితమైనవిగా గుర్తించాలి. ఒక వైపు ఉచిత సహకారాన్ని అందించినట్లే అందిస్తూ, మరోవైపు వ్యాపారపరమైన లావాదేవీల ద్వారా ఆ మొత్తాన్ని వసూలు చేసుకుంటారు. వాస్తవంలో వీరు ఏ దేశానికి సహకరిస్తారో ఆ దేశాన్ని పరోక్షంగా కొల్లగొడతారు. ఆ విషయం తెలిసీ సహాయాన్ని స్వీకరించే ప్రభుత్వము జాతిద్రోహానికి పాల్పడుతున్నట్లే.

సమాజం కానీ, దేశం కానీ తన సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకోవడానికి చిత్త శుద్ధితో కృషి చేయాలి. అలా చేయకుండావర్గ రక్షణ చర్యలు మాత్రమే తీసుకొంటుంటే ఆ ప్రభుత్వ పాలనలో మిగతా వర్గాల ప్రజలు బానిసలైనట్లే. బానిసత్వం నుండి విముక్తి పొందుటకు బాధితులు దృఢ సంకల్పంతో పోరాడవలె. ఇది పౌరుల బాధ్యత.

# విద్య

విద్య అనగా జ్ఞానము. వ్యక్తి యొక్క జ్ఞానము సమాజముతో అనుసంధా నించబడనప్పుడు నిరుపయోగమైన వస్తువువలె యుండును. కావున వ్యక్తి తన వద్ద నున్న విద్య ఆధారంగా యితరుల సంపదను ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని దోచుకొనుటకు గాని, యితరులపై ఆధిపత్యము చెలాయించుటకు గాని, సామాజిక సంపదను ధ్వంసము చేయుటకు గాని, ప్రకృతి సమతుల్యమునకు విఘాతము కలిగించుటకు గాని, ప్రజారోగ్యమునకు భంగము కలిగించుటకు గాని, సామాజిక ప్రగతిని నిరోధించుటకు గాని, యితరులను వేదనకు గురిచేయుటకు గాని హక్కు లేదు.

వ్యక్తుల యొక్క జ్ఞానము సమాజము నాశ్రయించుకుని వృద్ధిచెందుచున్నది. కావున వ్యక్తులు తమ జ్ఞానమును సమాజమునకు అంకితము చేయవలెను. ఒక వ్యక్తి తన జ్ఞానమును సమాజమునకు అర్పించుటకు నిరాకరించిన యెడల సమాజము తన శక్తిని వినియోగించి అట్టి వ్యక్తి వద్ద నున్న జ్ఞానమును స్వాధీన పరచుకొనవచ్చును.

మానవుని వికాసముగాని, వినాశనముగాని అతని జ్ఞానముపై ఆధారపడి యున్నది. మానవుని వికాసమునకు ఉపయోగపడు జ్ఞానమును సంపదగాను, అతని వినాశనమునకు దోహదకారియగు జ్ఞానమును అంతర్గత శత్రువు గాను పరిగణించవలెను. వ్యక్తిగాని, కుటుంబము గాని, సమాజము గాని తమ వికాసమునకు ఉపకరించు జ్ఞానమును పెంపొందించుకొనుచు, తమకు వినాశకారి యగు జ్ఞానమును త్యజించవలెను.

సృష్టిలో జీవులన్నియు తమ జీవనమనుగడ నిమిత్తము ఆహారము సంపాదించుకొనుటకు అవసరమైన జ్ఞానమును కలిగియున్నాయి. దైవానుగ్రహితమైన ఈ భుక్తి జ్ఞానము సమస్త చరాచార జీవులకు ఉన్నందున, భుక్తికొరకై ఎవరూ విద్య నభ్యసించ వలసిన అవసరము లేదు.

జ్ఞానము పై అధిపతి సమాజమైనందున పౌరులలో సమాజ వికాసమునకు ఉపయోగపడే జ్ఞానమును వృద్ధి చేయవలసిన బాధ్యత సమాజముపైనే యున్నది.

## ప్రాథమిక విద్య

నాగరికత పురోభివృద్ధి చెందిన కొలది పౌరులందరు ఒక స్థాయి వరకు విద్య నభ్యసించవలసిన అవసరము యేర్పడుతుంది. అదే ప్రాథమిక విద్య.

నిర్బంధ ప్రాథమిక విద్యా విధానమును అమలుపరచెడి అధికారము సమాజమునకు గలదు. కానీ 12 సంవత్సరములు నిండిన బాల బాలికలను వారి యిష్టానికి వ్యతిరేకముగా విద్య నభ్యసింపజేసెడి అధికారము యిటు తల్లిదండ్రులకు గాని, అటు సమాజమునకు గాని లేదు.

12 సంవత్సరములు పూర్తయిన సంతానమునకు తదుపరి మూడు సంవత్సరాలలో స్వతంత్రముగా తమ జీవనానికి అవసరమైన అహారము సంపాదించుకును విధానమును వారి తల్లిదండ్రులే నేర్పవలెను.

సంతానమునకు 15 సంవత్సరముల వయస్సు నిండిన పిదప వారి మౌలిక అవసరములు తీర్చవలసిన బాధ్యత తల్లిదండ్రులపై లేదు. కావున 15 సంవత్సరములు నిండిన విద్యార్థుల విద్యాభ్యాసమునకు మరియు పోషణకు అయ్యే ఖర్చును సమాజమే భరించవలెను.

## విద్యార్థి

ధర్మహీనత జాతి యొక్క చైతన్య రహిత స్థితికి సూచిక. ధర్మము లేని జాతి మృత్యుకళేబరం వంటిది. రాబందుల వంటి బాహ్య సమాజాలు ఆ కళేబరంపై వాలి తమ ఆకలి తీర్చుకుని అస్థిపంజరాన్ని మాత్రమే మిగులుస్తాయి.

ధర్మము జాతి యొక్క జీవం. జాతి యొక్క జీవమును రక్షించగలిగిన శక్తి విద్యార్థుల వద్ద కలదు. విద్యార్థుల చైతన్య శక్తిని సద్వినియోగం చేసుకోలేని విద్యావ్యవస్థ నిరుపయోగమైనది మరియు సమాజమునకే భారమైనది. తన జాతి యొక్క సాంస్కృతిక వారసత్వము, ధార్మిక సాహిత్యము, ఉత్తమ ఆచార వ్యవహారములు తెలియని వాడు ఏరంగములో నిష్ణాతుడైనప్పటికిని నిరక్షరాస్యునితో సమానమే.

క్రమశిక్షణ పేరుతో విద్యార్థి మనసు గాయపడేలా శిక్షించుట సామాజిక నేరము. అట్లు శిక్షించుట వలన విద్యార్థులకు గురువులపై విశ్వాసము నశించును. వారి బోధనలు విద్యార్థులపై ప్రభావము చూపవు. ధర్మవ్యాప్తి జరుగదు.

అధర్మపరాయణుడు అధ్యాపకుని స్థానంలో ఉన్న యెడల అతనిని గురువుగా నిరాకరించే హక్కు విద్యార్థి కున్నది. అట్టి అధ్యాపకునికి గ్రామ బహిష్కరణ, సాంఘిక వెలి ద్వారా శిక్షించాలి.

విద్యార్థి తన గురువులను హీన భావముతో చూడరాదు. వారిని నీచముగా చిత్రించి మాట్లాడరాదు. వారి కుటుంబ సభ్యులతో తగవులాడరాదు. గురుపత్నిని మాతృభావముతో చూడవలె. ఎగతాళి చేయరాదు.

భుజించుటకు ఆహారము దొరకక గురువు పస్తులున్న యెడల విద్యార్థి తన కార్యములన్నియు నిలిపివేసి గురువు కొరకై ఆహారము సేకరించుటలో నిమగ్నము కావలెను. ఆకలితో గురువు మరణించిన యెడల గురుహత్యా పాతకం శిష్యులందరిని వెంటాడును. తన గురువును శారీరకంగా గాని, మానసికంగా గాని హింసించువారిని విద్యార్థి తన శత్రువుగా భావించి అడ్డుకొనవలెను. గురువు యొక్క మానము హరించబడునపుడు మౌనముగా తిలకించు వాడు స్వయముగా మానహీనుడగుచున్నాడు.

ప్రాథమిక దశలోనున్న విద్యార్థులు, అనగా 12 సంవత్సరములలోపు వయసు గల వారును, వికలాంగులను, గురువుచే నీచముగా చూడబడువారును, గురువు దురాచార పరాయణుడని తెలిసియు అతని వద్ద విద్యనభ్యసించు వారును, గురువు పట్ల విద్యార్థి ధర్మమును అనుష్ఠించనందు వలన ఎటువంటి దోషము కలుగుట లేదు.

గురువు ప్రేమకలహాలలో చిక్కుకున్నప్పుడు, కుటుంబ సభ్యులతో తగవులాడే సమయం లోనూ, గ్రామ పెద్దలచే శిక్షించబడే కాలంలోనూ, గురువును వారిపై అధికారులు మందలించే సందర్భములలోనూ, దేశద్రోహ నేరానికి గురువుపై విచారణ జరుగుతున్న కాలంలోనూ,

విద్యార్థులు ఐక్యము చేసుకొని గురువును రక్షించుటకుయత్నించిన, వారికి గురువు యొక్క కర్మదోషములు అంటుచున్నవి.

తన వద్ద విద్య నభ్యసించెడి యువతితో శారీరక సంబంధము కలిగిన వాని వద్దను, హంతకుని వద్దను, ఏక కాలములో యిరువురు పురుషులతో సంబంధము కలిగిన స్త్రీ వద్దను, పరిచారిక భర్త వద్దను, మత్తుపానీయములకు బానిస అయిన వ్యక్తి కడను, అంటు వ్యాధులతో పీడించబడే వాని యొద్దను, స్త్రీలను తార్చువాని కడను, యాచకుల సంతానము వద్దను, తల్లిప్రియుని వద్దను, తండ్రి ప్రేయసి వద్దను విద్య నభ్యసించరాదు.

## సమాజ సేవకుడు

21 సంవత్సరములు దాటిన వెంటనే విద్యార్థి దశ అంతమై సమాజ సేవకుని దశ ప్రారంభమౌతుంది. సమాజం తనకు నేర్పిన విద్యను సమాజం నిర్దేశించిన విధముగా ఉపయోగించుట సమాజ సేవకుని ప్రథమ కర్తవ్యము.

సమాజంలో సాధారణ అనగా దిగువ స్థాయిలో నున్న పౌరుని ఆదాయము కంటే రెట్టింపుకు మించిన ఆదాయమును సమాజ సేవకుడు కలిగి యుండుట అధర్మము. సాధారణ పౌరుని జీవన ప్రమాణమునకు అనుగుణంగా సమాజ సేవకుని జీవన ప్రమాణం పెరగాలి.

సమాజమును పాలించువాడు ధర్మకర్త. అతడు స్వయముగా ధర్మమును అనుష్ఠించుచు, సమాజ పౌరుల చేతను, సమాజసేవకుల చేతను వారి వారి ధర్మములను అనుష్ఠింపజేయవలెను. పాలకుడు అధర్మపరాయణుడైనచో సమాజ సేవకులు వాని ఆజ్ఞలను ఉల్లంఘించుట ధర్మసమ్మతమే కానీ అట్టి ఉల్లంఘన కారణముగా అరాచకము తలెత్తి సమాజం విచ్ఛిన్నమయ్యే అవకాశం ఉన్న యెడల నీచుడైన పాలకుని ఆజ్ఞలు శిరసావహించుటయే ధర్మము. పాలకుని తొలగించుటకు సమాజ సేవకులు యత్నించుట ధర్మవిరుద్ధం. ప్రజా హితము కొరకు పాలకుని తొలగించుట అవసరమని తలంచిన వారు సమాజసేవకుల స్థానం నుండి వైదొలగి ఆ యత్నము చేయవలెను.

సమాజ సేవకునిగా తన స్థానమును ఉపయోగించి ప్రజలపై ఆధిపత్యము చేయువాడు, ప్రజలను వేధించు వాడు, సమాజ సంపదను లేక వ్యక్తుల సంపదను ప్రత్యక్షముగానైనా లేక పరోక్షముగానైనా అనుభవించువాడు, కన్యలను తనతో వివాహమునకు ప్రేరేపించువాడు, పరిస్థితులకు లొంగి గాని లేక యిష్ట పూర్వకముగా గాని సమాజ సంపదకు నష్టము కలిగించు వాడు, ప్రజలకు కష్టము కలిగించు వాడు, భూమి మరియు జల సంపదల దుర్వినియోగమునకు సహకరించు వాడు, బాహ్యసమాజముల శ్రేయస్సుకై పనిచేయువాడు, తన సమాజ సందను యితర సమాజాలకు అప్పగించువాడు, వ్యాధులు ప్రబలుటకు కారకుడైన వాడు, యుద్ధకాలమున పదవిని త్యజించిన వాడు, వ్యభిచరించువాడు, హత్యలు చేయువాడు లేక హత్యలకు సహకరించు వాడు, దోషులకు రక్షణ కల్పించు వాడు, నిర్దోషులపై నేరములు మోపువాడు, నిర్దోషులను శిక్షించు వాడు, మూఢ నమ్మకములను వ్యాపింపజేయువాడు, విధి నిర్వహణలో మత్తుపానీయములు సేవించు వాడు, స్త్రీలను అగౌరవపరచు వాడు, వన్యప్రాణులను హతమార్చువాడు, లేక వన్యప్రాణుల నాశనమునకు సహకరించు వాడు, ధర్మకర్తల మరణమునకు

ప్రత్యక్షముగానో లేక పరోక్షముగానో సహకరించిన వాడు, ఆశ్రితజనులకు, బంధుమిత్రులకు పక్షపాత వైఖరితో సహకరించువాడు, తన విధులు నిర్వర్తించక సోమరిగా కాలము గడుపు వాడు ధర్మ శాస్త్ర పరిధిలో అత్యంత నీచుడై యున్నాడు.

సమాజ సేవకుడు నీచుడుగా మారినాడని గుర్తించిన వెంటనే వానిని ఆ స్థానము నుండి తొలగించెడి అధికారం వాని సేవలు అందుకోవలసిన ప్రజలకు గలదు. స్థానిక ప్రజల అభీష్టమునకు విరుద్ధముగా సమాజ సేవకుడు తన స్థానమును విడువకున్నను, ధర్మకర్తగాని, పాలక వర్గముగాని ప్రజాభీష్టమునకు వ్యతిరేకముగా వానిని రక్షించు చున్నను, వానిని తొలగించుటకై ఆందోళన చేసెడి వారిపై అత్యాచారములు, దాడులు నిర్వహించబడినను, ఆందోళన కారుల నాయకులను నిర్బంధించి హింసించినను, అట్టి ప్రజావ్యతిరేకి అయిన సమాజ సేవకునికి మృత్యుదండన విధించే హక్కు సత్కర్మలను అనుష్ఠించే స్థానిక పౌరునికి గలదు.

ధార్మికుడు మరో యిరువురు ధార్మికుల సమ్మతి పొందిన తరువాత మాత్రమే మరణదండన అమలు చేయవలెను. అట్టి మరణ దండన అమలులో ప్రత్యక్షముగానూ, పరోక్షముగానూ సహకరించే వారికి మునుపటి నీచకర్మల అనుష్ఠాన దోషము హరించును. మరణ దండన విధించిన వారికిని అమలు జరిపిన వారికిని హత్యాదోషము అంటుటలేదు. సూర్యుని వెలుతురులో దండన అమలు జరపబడిన యెడల హత్యాదోషము అంటును.

ఆ విధముగా మరణ దండన విధించబడిన వాని భార్య తదుపరి వివాహమునకు అనర్హురాలు. అమెతో సంగమించిన పురుషునకు వ్యభిచార కర్మదోషము ప్రాప్తించును. ఆమె సంతానము సమాజ సేవకులుగా నియమించబడరాదు.

## ఆరోగ్యము

సమాజము యొక్క శక్తి ప్రజల ఆరోగ్యముపై ఆధారపడి యున్నది. ప్రజల ఆరోగ్యము వారు భుజించే ఆహారము, నివసించే గృహము, పరిసరాల వాతావరణము, అలవాట్లు, వైద్య సదుపాయములు మున్నగు అంశములపై ఆధారపడియున్నది. ప్రజల ఆరోగ్యమును రక్షించుట, మెరుగుపరుచుట సమాజము యొక్క ప్రాధమిక కర్తవ్యము.

### ఆహారము

తన ఆధీనములోనున్న భూమి, నీరు మరియు యితర వనరులను సక్రమ పద్ధతిలో వినియోగించి, తద్వారా ఉత్పత్తి అయిన ఆహారమును ప్రజలందరికి సక్రమముగా పంపిణీ చేయుట సమాజము యొక్క పాలనాధర్మము.

సమాజములో ఒక వర్గమునకు ఆహారము పుష్కలంగా లభిస్తూ మరొక వర్గము చాలీ చాలని ఆహారముతో జీవనం గడుపుతుంటే పాలనా యంత్రాంగము తన ధర్మమును పాటించుట లేదని అర్ధము. అట్టి పాలనా యంత్రాంగమును తొలగించుటకై ఆహార కొరతతో భాధపడేవారు ఏవిధమైన కర్మను అనుష్ఠించినప్పటికీ అది ధర్మసమ్మతమే.

సోమరిగా కాలం వెళ్ళబుచ్చు వానికి ఆహారము సరఫరా చేయవలసిన బాధ్యత సమాజానిది కాదు. సోమరి ఆకలితో మరణించు చున్నప్పటికీ వానికి ఎవరూ ఆహారం దానం చేయరాదు. ఆహార దానము వలన సోమరుల సంఖ్య పెరిగి సమాజము యొక్క శక్తి తరుగును. భిక్షాటనను నియంత్రించుట సమాజము యొక్క బాధ్యత.

ప్రతి ఒక్కరికీ వారి శరీర నిర్మాణానికి, వారి శారీరక శ్రమకు, అనువైన మరియు అవసరమైన ఆహారము లభించే యేర్పాట్లు సమాజము చేయవలెను. తక్కువ శ్రమపడే వారికి ఎక్కువ ఆహారము, ఎక్కువ శ్రమపడేవారికి తక్కువ ఆహారము లభ్యమగుచున్నచో సమాజము సంపన్నులచే శాసించబడి, ఒక వర్గము యొక్క శ్రమను మరో వర్గము దోపిడీ చేయుట వలన సమాజము శక్తి హీనమగుచున్నది.

భుజించుటకు యోగ్యమైన ఆహార పదార్థములను వ్యర్థము చేయుట వ్యక్తులు అనుష్ఠించే అత్యంత నీచమైన కర్మ. అట్టి వ్యక్తులను మందలించే అధికారము సమాజాని కున్నది. నీవద్ద ఎక్కువగా ఉన్న ఆహార పదార్థములను సమాజానికి వాపసు చేయవలెను. ఆహార పదార్థములను నష్టపరచు వాడు సమాజ శక్తిని నష్టపరచుచున్నాడు.

పౌరుల ఆరోగ్యమునకు భంగము కలిగించు ఆహార పదార్థముల ఉత్పత్తిని నిరోధించుట సమాజం యొక్క కర్తవ్యం. ఏ ఆహారమునైతే భుజించుట వలనగాని, త్రాగుట వలన గాని వ్యక్తులు తమ దైనందిన కార్యక్రమాలు నిర్వర్తించుటలో అశక్తులగు చున్నారో అట్టి పదార్థములను వ్యర్థ పదార్థములుగా పరిగణించవలెను. వ్యర్థ పదార్థముల ఉత్పత్తిని నిరోధించలేని సమాజము అసమర్థుల చేత పరిపాలించబడుచున్నదని గుర్తించాలి.

పౌరుల ఆరోగ్యమును క్షీణింపజేయు ఆహార పదార్థములపై సుంకము విధించి ప్రోత్సహించెడి సమాజంలో నీతి క్షీణిస్తుంది. కొంతకాలం తర్వాత అది నీతిలేని సమాజంగా గుర్తింపు పొందుతుంది.

శరీరమునకు శక్తి యివ్వని ఆహారమును, హానిచేయు ఆహారమును, శరీరమును రోగ గ్రస్తము చేయు ఆహారమును, శరీరము జీర్ణించుకోలేని ఆహారమును, చైతన్య స్థితిని పోగొట్టు ఆహారమును భుజించుట నీచకార్యమని సమాజము తన పౌరులకు తెలియజేయ వలెను.

## వైద్యము

ఆహార ధర్మమును చక్కగా అనుష్ఠించని వాడు అనారోగ్యము ద్వారా శిక్షించ బడుచున్నాడు.

ఔషధము కూడా ఆహారమే. శరీరమునకు అవసరములేని ఔషధము శరీరములో చేరిన యెడల అది దేహములోని ఏదోక భాగము యొక్క పని తీరును దెబ్బతీయును. కావున విచక్షణారహితముగా ఔషధములను సేవించుటయు అధర్మమే.

నీ శరీరములో శత్రువులు ప్రవేశించి నపుడు నీవు అస్వస్థుడవగు చున్నావని గుర్తించు. జ్వరము, జలుబు, దగ్గు - ఇవి మానవుడు జీవించి యున్నంత కాలము వెంటాడుచునే యుండును. వీటి నివారణ కొరకు వైద్యుడు అవసరం లేదు. శరీరములోని రక్షక దళం ఆ కార్యమును నిర్వర్తించగలదు.

రక్షక దళం యొక్క పనిలో నీవు జోక్యము చేసుకొనుటవలన అవి సోమరులుగా మారుటయో, లేక అధికముగా శ్రమించవలసిన అగత్యము యేర్పడుటయో జరుగును. రెండునూ నీ దేహమునకు హానికరమే. కావున శరీర ఆరోగ్యపరిరక్షణకు అవసరములేని ఔషధములను భుజించరాదు.

భుజించిన ఆహారము అరుగుదల కానప్పుడు, రక్షకదళం శత్రువులతో తీవ్రంగా యుద్ధం చేస్తున్నప్పుడు ఆకలి మందగిస్తుంది. అట్టి పరిస్థితుల్లో ఆకలయ్యేంతవరకు నీవు ఆహారము భుజించరాదు. అట్టి సమయంలో ఉపవాసం నీ ధర్మం.

శరీరములో ఏమార్పు ఎందుకు సంభవించుచున్నదో తెలుసుకోలేని వాడు వైద్యుడు కానేరడు. ఒక స్థాయికి శరీర ఉష్ణోగ్రత పెరిగితే శరీరంలో ప్రవేశించిన శతువులను హతమార్చవచ్చని రక్షక విభాగము గుర్తించిన వెంటనే శరీర ఉషోగ్రత పెరిగే ఏర్పాటు చేస్తుంది. ఆ ఉష్ణోగ్రతని ఔషధాల సహాయంతో నీవు తగ్గిస్తే శరీరంలోపలి శత్రువులు నాశనమయ్యేదెలాగు?

సరదాగా ఔషధం మ్రింగి నీ శరీరంలో ఎంత అలజడి సృష్టిస్తున్నావో నీకు తెలుసా? యుద్ధములో శత్రుసేనకు సహకరించుట ఎంతటి అపరాధమో నీ చర్యకూడా అంతటి నీచమైనదే. పదే పదే నీ చర్యతో విసిగిపోయిన రక్షక విభాగము తన పని మానేస్తుంది. ఫలితంగా నీ శరీరంలోని వ్యాధి నిరోధకశక్తి తగ్గిపోయి నీవు తరచుగా రోగములతో పీడించబడెదవు.

ఒక పదార్థము రుచిగా యున్నదని అతిగానూ, తరచుగానూ భుజించుటవలన శరీరము లోపల శక్తిని విడుదల చేసే భాగమునకు కోపము వస్తుంది. ఆ పదార్థము పట్ల విముఖతను ఉదరంలో అలజడి లేక నొప్పి ద్వారానో, జలుబు, తుమ్ములు, అయాసము, దద్దుర్లు మొదలైన వాటి ద్వారానో బాహ్యచేతనానికి తెలియజేస్తుంది.

శరీరంలోపలి భాగాలు నిరాకరిస్తున్న పదార్థాన్ని మూడు మాసముల వరకు నీవు భుజించరాదు. మూడు మాసముల తర్వాత ఆ పదార్థమును కొద్ది మోతాదులో భుజించు. శరీరము నిరసన వ్యక్తము చేసిన యెడల మరో ఆరు మాసముల వరకు ఆ పదార్థమును భుజించరాదు. ఆరు మాసముల తర్వాత భుజించినప్పుడు తిరిగి నిరసనవ్యక్తం చేసిన యెడల సంవత్సరకాలము - ఇలా కాలవ్యవధిని రెట్టింపు చేసుకుంటూ పోవలె. నాలుగు సంవత్సరముల విరామము తర్వాత కూడా తిరస్కరింపబడిన పదార్థమును ఎన్నటికీ భుజించరాదు.

పైనుదహరించిన విధముగా విరామము తర్వాత ఆ పదార్థమును శరీరము తిరస్కరించని యెడల ఆ పదార్థమును పరిమితమైన మోతాదులో స్వీకరించుటకు శరీరము సిద్ధముగా యున్నదని గుర్తించి ఆ పదార్థమును స్వల్ప మోతాదులో మాత్రమే భుజించవలెను. ఈ ధర్మమును విస్మరించినచో పరిణామములు తీవ్రంగా ఉంటాయి.

శరీర అవసరములకు మించిన ఆహారమును భుజించుటయు దోషమే. సృష్టిలో ప్రతిజీవియు తన ఆహారమును స్వయముగా తానే వెదుక్కోవలసియున్నది. ఆ వెదుకులాటలో జీవి శరీరమునకు అవసరమైన వ్యాయామము లభించుచున్నది. మానవుడు ఆహార సముపార్జనకు తన తెలివిని వినియోగించుకొనుటవలన అతని శరీరమునకు తక్కువ వ్యాయామము లభించుచున్నది. తక్కువ శ్రమపడువాడు ఎక్కువ ఆహారమును భుజించిన యెడల వాని దేహమే వానికి భారమగును.

నీదేహమే నీకు భారమైనచో దానిని మించిన శిక్ష వేరేమున్నది? భారమైన దేహములు నిర్ణీత గడువుకు ముందుగనే నశించి పోవును.

**ఆకలి**

సంకేతం వచ్చినప్పుడే తగు మోతాదులో ఆహారము భుజించవలెను. తిరిగి ఆకలి సంకేతము వచ్చునంతవరకు నీవు మరేదియును భుజించరాదు. నీవు తిన్న ఆహారము జీర్ణాశయములో జీర్ణమై శక్తి రూపములో నీ శరీరభాగములకు అందుతుంది. ఆహారము పూర్తిగా జీర్ణమైన తర్వాత తిరిగి ఆకలి సంకేతం వెలువడుతుంది. ఆకలి సంకేతము లేకుండా భుజించు వాడు తన దేహములోని జీర్ణప్రక్రియను ఆటంకపరచుచున్నాడు. జీర్ణ ప్రక్రియను పదే పదే ఆటంక పరచిన వాని జీర్ణ ప్రక్రియలో అవాంతరాలు ఏర్పడుతాయి. అటువంటి వాడు తిన్న అహారము జీర్ణముకాక శక్తి హీనుడగుచున్నాడు.

ఆకలి కలిగి నప్పుడు ఆహారమును భుజించక పోవుటయు నేరమే. ఆకలిగొన్నవాడు తనకు అందు బాటులో ఉన్న ఆకులు అలములు తినైనా ఆకలి తీర్చుకోవాలి. పృధ్విపై ఆకలితో ఏ జీవియు మరణించుట లేదన్న సత్యమును నీవు గ్రహించుము.

ఆకలి గొన్నప్పుడు నీవు నీకన్నా బలహీనమైన జీవిని తిని బ్రతికే హక్కు ప్రకృతి నీకు ప్రసాదించినది. ఆహారమును కూడ బెట్టుకును హక్కు ఏ జీవికిని లేదు. తెలివిగా కొన్ని జీవులు నిల్వయుంచుకొనినచో, దానిని యితర జీవులు తస్కరించవచ్చును. ఇది బలాబలాలకు సంబంధించిన సమస్యే తప్ప ధర్మాధర్మముల ప్రసక్తి రాదు.

ఆకలిగొన్నవాడు ఒకరోజు భత్యమును తోటి మానవుని వద్ద నుండి తస్కరించిన అది నేరము కాదు. ఒకరోజు భత్యమునకు మించి వాడు దొంగిలించినచో అది అపరాధమే యగును.

పృధ్విపై ఒక ప్రాణికి మరోప్రాణిపై అధికారము లేదు. ఒక జీవికి మరో జీవిని బానిసగా చేసుకొనే హక్కులేదు. నీ ఆధీనంలో ఎన్ని జంతువులున్నను ఆకలిగొన్న వాడికి వాటిని చంపితినే హక్కున్నది.

అటులనే చెట్టుపై నీకెలాటి అధికారమును లేదు. నీ చెట్టు ఫలములను నీ అనుమతిలేకుండా యితరులు భుజించుట దొంగతనం కాదు. అదే దొంగతనమైన ఆ చెట్టున్న భూమి నీకు ఎచట నుండి వచ్చినది? నీకు విక్రయించిన వానికి ఎక్కడిది? అలా వెనక్కు వెళితే బలవంతుడు ఆక్రమించుకున్నదే. నీ అవసరాలకు మించిన భూమిని కలిగియుండే హక్కు నీకు ప్రకృతి యివ్వలేదు.

**ఉపవాసం**

నీవు యితరులను లోబరుచుకోవలెనన్న నీ శక్తిని వినియోగించుము. వారు నీకు నచ్చని యెడల వారిని దూరముగా నెట్టుము. అంతే తప్ప యితరుల ప్రవర్తనను మార్చుటకు నీవు ఉపవాసము చేసి నీ శరీరమును శిక్షించెడి అధికారము నీకు లేదు. కావున నిరాహారదీక్ష అధర్మమే.

నిరాహారదీక్ష యనెడి అత్యాచారము నీదేహము పై చేయుచు ధర్మమును పాటించమని యితరులను కోరెడి హక్కు నీకు లేదు.

ఇతరులను నిర్బంధించి ఆకలితో మాడ్చినను, నీకు నీవుగా ఆకలితో మాడినను అధర్మములే యగును. ధర్మస్థాపన అధర్మ మార్గము ద్వారా జరుగదు.

శక్తివంతమైన ఆహారమును భుజించగల వొనరులుండియు, వానిని వినియోగించక, ద్వితీయ శ్రేణి ఆహారమును భుజించువారు నీచత్వమును ప్రోగుజేసుకొనుచున్నారు. ఆహారము విషయములో పొదుపుచేయు వాని ఆయువును పొదుపుగనే (కుదింపబడి) యుండును.

12 సంవత్సరములలోపు పిల్లలచే ఆహార నియమములను అనుష్ఠింపజేయవలసిన బాధ్యత తల్లిపై నున్నది. పిల్లలను ఆకలితో మాడ్చినను, వారి శారీరక అవసరములకు మించిన ఆహారము యిచ్చినను, ఆకలి లేని సమయములో వారిచే బలవంతముగా ఆహారము భుజింపజేసినను, విరామము లేకుండా తరచుగా తినిపించినను, వారికి గిట్టని పదార్థములు తినిపించినను, లేక నిరోధించకున్నను, వారి శరీరమునకు చెరువు చేసే విధముగా ఔషధములు స్వీకరింపజేసినను, శక్తివంతమైన ఆహారము వారికి అందకుండా చేసినను, ఒకేపదార్థమును వారి శరీరము వ్యతిరేకించు వరకు పదేపదే తినిపించినను దోషము తల్లి భరించవలయును.

ఒక సంతానమునకు పుష్టికరమైన ఆహారమును ప్రసాదించలేని స్త్రీ మరల సంతానమును పొందెడి అర్హతను కోల్పోవుచున్నది. శక్తివంతమైన ఆహారము లభించక శుష్కించిన శరీరముగల బిడ్డకు తల్లియైన స్త్రీతో సంపర్కము అత్యంత నీచకార్యము. అట్టి సంభోగము వలన పురుషునికి శిశుహత్యా పాతకము అంటుచున్నది.

పుట్టిన బిడ్డకు 18 మాసముల వయస్సు వచ్చునంతవరకు తన స్తన్యం ద్వారా పాలు త్రాపని స్త్రీకి మరల బిడ్డను ప్రసవించే హక్కులేదు. స్తన్యం ద్వారా పాలు యివ్వలేని కారణమున బిడ్డ మృతి చెందిన యెడల ఆ స్త్రీ తన భర్తపై అన్ని హక్కులను కోల్పోవు చున్నది.

అట్టి స్త్రీతో భర్త అయినను లేక ప్రియుడైనను ఆమె బహిష్టు అయిన తర్వాత 11వ దినమునుండి వరుసగా తొమ్మిది రోజులు సంభోగించరాదు. అట్లు సంభోగించినవానికి శిశుహత్యా దోషము ఆజన్మాంతము వెంటాడును.

అట్టి స్త్రీ భర్తను త్యజించినను, పునర్వివాహమునకు అయోగ్యురాలై యున్నది. ఆమె పునర్వివాహమును నిరోధించెడి హక్కు ఆమె తొలిభర్తకు గలదు.

ఒక పురుషుని వలన సంతానవతియైన స్త్రీ తన సంతానములో అంగవైకల్యము గుర్తించిన యెడల ఆ పురుషుని ద్వారా మరల సంతానమును పొందుటకు యత్నించరాదు.

స్తన్యం ద్వారా ఒక బిడ్డకు పాలు త్రాపుచున్న కాలంలో స్త్రీ గర్భవతి కారాదు.

కుటుంబములో ఎవరైనా మృతి చెందిన యెడల ఆ యింట్లో మూడు మాసముల వరకు స్త్రీ పురుషులు సంభోగించుట అరిష్టము.

యాచక వృత్తిని స్వీకరించిన వాని ద్వారా సంతానము పొందుట నిషిద్ధము. బిక్షగత్తెతో సంభోగము వలన పురుషుడు శక్తిహీనుడౌతాడు.

## మద్యము

మత్తు పానీయాల వలన శరీర ఆరోగ్యం పాడవుతుంది. మద్యం సేవించే వ్యక్తి తన శరీరం పట్ల అధర్మాన్ని అనుష్ఠిస్తున్నాడు. ఫలితంగా ఆ దేహము త్వరగా క్షీణిస్తుంది. అదే అతనికి శిక్ష.

ఇది వ్యక్తిగత ధర్మము అయినందున దానిని రక్షించుట సమాజముయొక్క కర్తవ్యము కాదు. బలవంతం చేసి వ్యక్తుల చేత మద్యం మాన్పించడం సమర్ధనీయంకాదు. కానీ త్రాగిన మైకంతో యితరులకు యిబ్బంది కరంగా ప్రవర్తిస్తే శిక్షించే హక్కు సమాజానికి ఉన్నది.

వ్యక్తులకు మద్యం అందుబాటులో ఉండనివ్వండి. వారానికి ఒకరోజు త్రాగుబోతుల కొరకు కేటాయించండి. ఆ ఒక్క రోజే మద్యం విక్రయించబడాలి. తక్కిన రోజుల్లో ఎవరూ త్రాగరాదు. ప్రజలంతా త్రాగుబోతులైనప్పుడు, ఎక్కడికక్కడ బట్టీలు పెట్టి సారా తయారుచేసుకుని మత్తుకు బానిసలుగా జీవిస్తామంటే, వారికా స్వేచ్ఛను యివ్వండి.

## నీరు

నీరు అన్ని జీవులకు ప్రాణాధారమైయున్నది. నీరు లేనిదే జీవము లేదు. జీవికి ఆహారము లేదు. ఆహారోత్పత్తి సమాజం యొక్క నీటి వొనరులపై ఆధారపడి యున్నది. కావున జల సంపదను దుర్వినియోగం చేయకుండా రక్షించవలసిన బాధ్యత సమాజానిది.

నీటికి మూలము వర్షము. వర్షపాతము అడవులపై ఆధారపడి యుండుట చేత వాటిని సమాజమే రక్షించుకొన వలయును. విచక్షణా రహితముగా అడవులను, వన్య ప్రాణిని ధ్వంసం చేయుటను నిరోధించలేని సమాజం భవిష్యత్తులో శిక్షించ బడుతుంది.

భూమిపై హక్కు భూచరములకును, సముద్రముపై హక్కు జలచరములకును ప్రసాదించబడినది. భూచరము తన స్వశక్తితో సముద్రములో ఈదగలిగినంత దూరము మరియు లోతుకు వెళ్ళి జలచరములను వేటాడి భుజించ వచ్చును. పడవలు మరియు యితర సాధనముల సహకారముతో మానవుడు సముద్ర జీవులను వేటాడుట వలన దైవ శాసనములను ఉల్లంఘించు చున్నాడు.

జీవులకు ఆహారము భూమి పైనే యున్నది. భూగర్భమందు దాచి పెట్టబడలేదు. భూగర్భములో నిక్షిప్తమైన పదార్ధములను వెలికి తీసెడి హక్కు ఏ జీవికీ లేదు. కేవలం నీటి కొరకు మాత్రమే భూమిపై గుంటలు త్రవ్వవచ్చును.

## గృహము

భూచరములన్నిటికి భూమిపై తమ రక్షణకు అనువైన రీతిలో నివాస యోగ్యమైన గృహమును నిర్మించుకునే హక్కు గలదు. మానవసమాజములో ఈ హక్కు అస్తవ్యస్తముగా యున్నది.

నీ స్వాధీనములో నీ నివాసమునకు, అనగా చిన్న పాక వేసుకొనుటకు అవసరమైన భూమి లేని యెడల నీ గ్రామమునుగాని, పట్టణమును గాని అనుకుని యున్న భూమిలో ఒక శెంటు స్థలమును నీవు ఆక్రమించు కొనుటకు నీకు హక్కు గలదు. ఒక చోట నివాస యోగ్యమైన స్థలము గలవానికి యితర ప్రాంతములందు నివాసస్థలములు కలిగి యుండెడి హక్కులేదు. రెండవచోట నివాస స్థలము కలిగియున్నయెడల మొదటి దానిని యితరులకు స్వాధీనము చేయవలెను.

దారులకై వదలిన స్థలమును ఆక్రమించెడి హక్కు ఎవరికీ లేదు. బావులకు చుట్టు యాభైగజముల లోపు స్థలమును ఎవరూ ఆక్రమించరాదు.

ఒక గ్రామములో 12 సంవత్సరములుగా నివసించిన వానికి, త్రాగుడు, జూదము, వ్యభిచారము మొదలైన వ్యసనములకు బానిసకాని వానికి, 21 సంవత్సరములు నిండిన వానికి ఈ విధముగా స్థలమును ఆక్రమించుకొనెడి హక్కు ప్రాప్తించు చున్నది.

అట్లు ఆక్రమించుకొనుటను నియమబద్ధం చేసే హక్కు సమాజమునకు గలదు. నీటి వాలుకు ఎగువవైపుకు గ్రామము పెరగ వలెను. గ్రామమును యితర గ్రామములతో కలిపెడి ప్రధాన రహదారికి యిరువైపుల తోకలా గ్రామము పెరుగుట వలన గ్రామమునకు అరిష్టము కలుగును. గ్రామము నడిబొడ్డు నుండి అన్నివైపులకు సమముగా పెరుగుట ఉత్తమము.

గ్రామములో 12 సంవత్సరములుగా నివసించి అన్యప్రాంతానికి చెందిన యువకుని వివాహమాడి తన గ్రామములోనే భర్తతో స్థిరపడదలచిన స్త్రీకి ఆమెకు 21 సంవత్సరముల వయసు నిండినచో గ్రామములో యింటి కొరకు స్థలమును ఆక్రమించు కొనవచ్చును. ఆమె భర్తకు అతని స్వగ్రామములో ఉన్న యింటి స్థలమును యితరులకు స్వాధీనపరచిన తరువాతనే ఈ హక్కు ప్రాప్తించును.

చెఱువులు, వనములు, నదులు, పర్వతములు, సెలయేరులు, కాలువలు, రహదారులు, ఆలయభూములు సమాజమునకు చెందినవి. కావున ఏ ఒక్కరు గాని, కొంతమంది వ్యక్తుల కూటమిగాని వాటిని స్వాధీనము చేసుకుని ఆధిపత్యం చెలాయించుట అధర్మము.

నివాస స్థలములేనివారు యితరుల వద్దనున్న మిగులు భూమిని స్వాధీనము చేసుకునేందుకు యత్నించాలి. నివాసస్థలము సమస్తజీవులకు జన్మహక్కు. అది మానవునికి లేకుండా చేసే సామాజిక శాసనములను ధర్మవిరుద్ధమైనవిగా భావించి వాటిని ఉల్లంఘించుటయే ఉత్తమ కర్మ.

నివాస స్థల నిమిత్తం వ్యక్తుల మధ్య తలెత్తే ఘర్షణలను నివారించుటకై ఆ బాధ్యతను సమాజమే చేపట్టవలెను. గ్రామస్థాయిలో ఐదు సంవత్సరములకొక పర్యాయము వయోజనుల సంఖ్యను పరిగణలోకి తీసుకుని, గ్రామమును ఆనుకుని ఒక వీధిని నిర్మించి దానికిరువైపుల స్థలమును వారికి కేటాయించవలెను. ఆ వీధికి తప్పనిసరిగా ఒక త్రాగునీటి బావిని త్రవ్వించవలెను. ఆ వీధికి రెండు వైపుల చెట్లు నాటించ వలెను.

అట్లు స్వాధీనము చేయబడిన స్థలముపై అసలు హక్కుదారు సమాజమే. సమాజము నిర్దేశించిన ధర్మములను వ్యక్తులు అనుష్ఠించినంత కాలము వారా స్థలమునందు నివసించెడి హక్కును కలిగి యుందురు.

ఆ స్థలమునందు నివసించెడి పురుషుడు మరణించిన యెడల అతని భార్యా బిడ్డలకు అందులో నివసించెడి హక్కు ప్రాప్తించు చున్నది. భర్త మరణానంతరం మరోపురుషుని వివాహమాడిన స్త్రీ ఆ స్థలము నందు నివసించెడి అర్హతను కోల్పోవుచున్నది. ఆమె సంతానము యొక్క వయసు 21 సంవత్సరములు నిండని యెడల ఆ స్థలము నందు నివసించెడి హక్కు వారికిని ప్రాప్తించుట లేదు.

ఆ స్థల హక్కుదారుడైన పురుషుడును, అతని భార్యయును ఒకేసారి గాని, విడివిడిగా గాని మృతి చెందినచో వయస్సుతో నిమిత్తము లేకనే వారి సంతానమునకు ఆ స్థలంలో నివసించెడి హక్కు ప్రాప్తించు చున్నది.

తల్లి దండ్రుల మరణాంతరం ఆ స్థలంలో నివసించెడి ఆడ పిల్లలకు వారి వివాహానంతరం ఆ స్థలంపై ఎట్టి హక్కు ఉండదు.

మరణించిన వారికి మగసంతతి యున్నచో అట్టి వారికి 21 సంవత్సరముల వయస్సు నిండిన తర్వాత సమాజముచే వారికి ప్రత్యేక స్థలము కేటాయించబడు కాలము వరకు ఆ స్థలమునందు నివసించు హక్కు గలదు. అన్నలకు స్థలం కేటాయించబడిన తర్వాత అందరికంటే చిన్నవాడు సమాజము యొక్క అనుమతితో ఆ స్థలమునందుండ వచ్చును. చిన్న వానికి గూడా వేరే స్థలము కేటాయించి ఆ స్థలమును స్వాధీనం చేసుకునే హక్కు సమాజమునకు గలదు.

ఒకనికి కేటాయించబడిన స్థలము గాని, ఆ స్థలములో ఆ వ్యక్తి నిర్మించుకున్న గృహమును గాని యితరులకు విక్రయించుటకు గాని, దానము చేయుటకు గాని, లేక మరోవిధముగా దుర్వినియోగము చేయుటకుగాని, ఆ వ్యక్తికి ఎటువంటి హక్కును లేదు.

ఒక వ్యక్తి గ్రామమును వదిలి 7 సంవత్సరములు గడిపినచో అతనికి కేటాయించబడిన స్థలముపై అతని హక్కును కోల్పోవుచున్నాడు. సంవత్సరమునకు 6 మాసములు అతడు ఆ గ్రామములో నివసించినచో ఆ స్థలము పై అతనికే హక్కు ఉండును. సంవత్సరములో 6 మాసములకు తక్కువ కాలమును వరుసగా 7 సంవత్సరములు ఆ గ్రామములో గడిపినచో ఆ స్థలము సమాజమునకు చెందును.

అట్లు స్థలము కేటాయించబడిన తర్వాత ఆ వ్యక్తి హిందూ ధర్మమును వీడి అన్యధర్మములను అనుష్ఠించుట గాని, అన్య మతమును స్వీకరించుట గాని, అన్యమతముల ప్రచారములో పాల్గొనుటగాని, అన్యమత ప్రార్థనా మందిరముకు వెళ్ళి ప్రార్థనలు చేసినగాని, ఆ స్థలములో అన్యమతస్తుల ద్వారా ప్రార్థనలు జరిపించిన గాని, ఆ స్థలమును స్వాధీనము చేసుకొనెడి హక్కు సమాజమునకు గలదు.

ఒకసారి ఆ విధముగా స్థలము స్వాధీనము చేసుకున్న తర్వాత అతనికి గాని, అతడు మృతుడైన తర్వాత అతడి భార్యకుగాని, అతని సంతానమునకు గాని. నివాస స్థలము కేటాయించ వలసిన బాధ్యత సమాజమునకు లేదు.

నుదుట బొట్టు హిందూ సాంప్రదాయము. భర్త జీవించి యుండగానే నుదుట బొట్టు లేకుండా సంచరించే స్త్రీ సంతానమునకు యింటి స్థలమును కేటాయించవలసిన బాధ్యత హిందూ సమాజానికి లేదు.

స్థలము కేటాయించ బడిన వ్యక్తి హిందూయేతర స్త్రీని వివాహమాడినచో ఆమె హిందువుగా మారవలెను. అట్లు మారుటకు ఆమె నిరాకరించినచో అతడాస్థలముపై హక్కును కోల్పోవుచున్నాడు. అట్టి స్త్రీని త్యజించి హిందూ స్త్రీని వివాహమాడిన యెడల సంవత్సరం తిరగక ముందే అతనికి తిరిగి స్థలము కేటాయించవలెను.

స్త్రీనిగాని, 15 సంవత్సరములలోపు వయసుగల వానినిగాని, 70 సంవత్సరములకు పైబడిన వృద్ధులను గాని, గోవులనుగాని, లేగ దూడలను గాని, నెమలి, పావురము, చిలుక వంటి పక్షులను గాని వధించినను లేక వాటి మరణమునకు కారకుడైనను ఆ వ్యక్తికి కేటాయించబడిన స్థలమును సమాజము (గ్రామం) స్వాధీన పరచుకొన వలెను. అతని భార్యకు గాని, పిల్లలకు

గాని ఆ తరువాత 12 సంవత్సరముల వరకు యింటి స్థలము కేటాయింపును అభ్యర్థించే హక్కు ఉండదు.

వృద్ధులైన తల్లి దండ్రులను యాచక వృత్తిని స్వీకరించేలా చేసిన వ్యక్తి, భార్యను వ్యభిచారములోకి దించిన వాడు, మత్తు పానియములు స్వీకరించి వీధులందు సంచరించు వాడు, అట్టి స్థలమునందు నివసించెడి అర్హతను కోల్పోవుచున్నాడు.

## పర్యావరణ పరిరక్షణ

మానవుల పుట్టుకకు పూర్వమే కలుషితం లేని వాతావరణము భూమిపై నెలకొని యున్నది. ప్రకృతిలో ఏ జీవియు వాతావరణమును కలుషితం చేయుటలేదు. జీవుల మనుగడకు అత్యంత కీలకమైన వాతావరణమును కలుషితం చేసెడి హక్కు మానవునికి లేదు.

అజ్ఞానులు, కిరాతకులు, స్వార్థపరులు వాతావరణమును కలుషితం చేయడానికి యత్నిస్తున్న లేక కలుషితం చేస్తున్నా వారిని నిరోధించవలసిన బాధ్యత ప్రతి వ్యక్తిపైనా ఉంది. అదే పర్యావరణ పరిరక్షణ ధర్మము. మనిషి యొక్క ఉనికి వాతావరణము పై ఆధారపడి యుండుటచేత యిది ఆత్మరక్షణ ధర్మము పరిధిలోకి వస్తుంది.

వ్యక్తుల తాత్కాలిక అవసరాలు తీర్చేందుకు వాతావరణాన్ని కలుషితం చేసేహక్కు సమాజానికి లేదు. వాతావరణాన్ని కలుషితం చేయకుండా జీవించలేని పరిస్థితులు ఏర్పడితే మరణమును ఆహ్వానించుటయే ఉత్తమ సామాజిక ధర్మము.

వాతావరణమును ఏవిధముగానూ కలుషితం చేయకుండా భావితరాల వారికి అందివ్వాల్సిన భాధ్యత వర్తమాన సమాజంపై ఉన్నది. వాతావరణమును కలుషితం చేయటద్వారా యితరజీవుల మృతికి, అవి శాశ్వతముగా అంతరించి పోవడానికి మానవుడే కారకుడౌతున్నాడు. చివరకు మానవజాతిగూడా అంతరించిపోక తప్పదు.

పర్యావరణమునకు విఘాతము కలిగించు వానిని చంపి జలచరములకు ఆహారముగా వేసినవాడు ఏ పూజలు చేయకను, ఏ సత్కర్మలు ఆచరింపకను, దైవమునకు ప్రీతి పాత్రుడగును. దైవసృష్టికి అపచారం తలపెట్టిన వారిని సంహరించుటచే అతని సర్వదోషములు సమాప్తమై అతడు పవిత్రుడగు చున్నాడు.

పర్యావరణమునకు హాని చేయువారిని వివాహమాడిన వారికిని, వారితో సంభోగించిన వారికిని, వారి సంతతికిని హీనమైన మరణము ప్రాప్తించుచున్నది.

మానవుడు తన భుక్తికి అవసరమైనంత మేరకే ప్రకృతి సంపదను, జీవ సంపదను వినియోగించుకొనవలెను. ఆపైచర్యలన్నియు పర్యావరణమునకు విఘాతము కల్గించునవిగా గుర్తించుము.

మానవుడు స్పష్టముగాను, నిష్పాక్షికముగాను, దైవప్రతినిధి వలెను, తన హక్కులను గుర్తించిన యెడల పర్యావరణము పరిరక్షించ బడును. అటులకాక మానవులు తమ అనైతిక, అధర్మ చర్యలను సమర్థించుకో జూసిన యెడల మానవజాతి యంతయు ప్రకృతి క్రోధమునకు బలికాక తప్పదు.

# నీచ వృత్తులు

సమాజానికి స్వయం పోషకత్వం ఎంత అవసరమో, వ్యక్తికి ఆత్మ నిర్భరత్వం అంతే అవసరం. సమాజంలో ప్రతివ్యక్తి తన పనులు తాను చేసుకుంటూ, తన శ్రమ ద్వారా ప్రత్యక్షంగా గాని, పరోక్షంగా గాని సామాజిక ఉత్పత్తులను పెంచాలి. ఇందులకై ఏ వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని బలిపెట్టనవసరం లేదు. నీచమైన వృత్తులను చేపట్టి అసహ్యాకరమైన జీవనం గడవలసిన అవసరం లేదు. నీచమైన పనులు చేస్తున్నంత కాలం వారికి సమాజంలో సమాన గౌరవం లభించదు. వారు తరతారాలుగ అదే బానిసత్వంలో మ్రగ్గి పోవాల్సిందే.

## నీచమైన వృత్తులు

1. ఇతరుల మలిన వస్త్రములను మూల్యమునకు ప్రతిగా శుద్ధి చేయుట.
2. ఇతరుల మరుగు దొడ్లను మూల్యమునకు ప్రతిగా శుద్ధి చేయుట.
3. ఇతరుల గృహములను, అందులోని వస్తువులను మూల్యమునకు ప్రతిగా శుద్ధి చేయుట.
4. రోడ్లు, బస్‌స్టాండులు, రైల్వేస్టేషన్లు, విమానాశ్రయాలు మూల్యమునకు ప్రతిగా ఊడ్చి శుభ్రపరచుట.
5. చచ్చిన జంతువుల చర్మమును వొలుచుట.
6. జీవులను చంపి వాటి మాంసమును విక్రయించుట.
7. మూల్యమునకు ప్రతిగా శవాలను దహనము చేయుట.
8. మూల్యమునకు ప్రతిగా యితరుల వాంఛలు తీర్చుటకై తమ శరీరమును అర్పించుట.
9. వ్యభిచార గృహములు నిర్వహించుట.
10. పల్లకీలు మోయుట, రిక్షాలు లాగుట.
11. మూల్యమునకు ప్రతిగా సమాజానికి, ప్రకృతి సమతుల్యానికి అవసరమైన పచ్చని చెట్లను నఱుకుట, వాటిని విక్రయించుట.
12. మూల్యమునకు ప్రతిగా పిల్లలను అపహరించుట, స్త్రీలను అపహరించి విక్రయించుట, హత్యలు చేయుట.
13. సముద్ర జలాలలోను, నదులలోను చేపలు మరియు యితర జలజీవులను పట్టి విక్రయించుట, వాటితో వ్యాపారం చేయుట.
14. భిక్షాటన.
15. దొంగతనం.
16. కప్పలు, పాములు, వన్య మృగములు, పక్షులు మొదలగు వానిని పట్టుకుని, చంపిగాని, సజీవంగా గాని విక్రయించుట.
17. ఇతర సమాజాలకు తమ శక్తియుక్తులను విక్రయించుట.
18. ఇతర సమాజాల, దేశాల వారికి గూఢచారులుగా పనిచేయుట.

ఈ వృత్తులు చేసే వారికి సమానత్వం అన్నది కేవలం కలగా మాత్రమే మిగిలి పోతుంది. వీరికి సమానత్వం కావాలంటే వీరు ఈ వృత్తులను త్యజించాలి. వారు త్యజించనంత కాలం మాల, మాదిగ, వెట్టి, చాకలి, బెస్త, ఎరుకల, యానాది మొదలుగాగల కులాలవారు తక్కువ జాతుల వారిగనే పరిగణింపబడతారు. సామాజిక న్యాయం పొందాలంటే, అగ్రవర్ణాలవారితో సమానంగా గౌరవించ బడాలంటే, కులం పేరుతో యితరులు తమను కించపరచకుండా మసలు కోవాలంటే ఈ నీచవృత్తులు చేసేవారు వెంటనే వాటికి స్వస్తి చెప్పాలి. సంపన్న వర్గం తన సుఖం కోసం, అవసరాలు తీరే నిమిత్తం తయారు చేసిన బానిసలు వీరు. ఈ వృత్తులు మానితే వారు బానిసత్వం నుండి విముక్తి పొందుతారు. సంపన్న వర్గానికి కనువిప్పు కలుగుతుంది. సమాజం రుగ్మతల బారినుండి విముక్తి పొంది నైతిక బలాన్ని వృద్ధి చేసుకుంటుంది.

## మతము

దైవ శాసనములను సామాన్య మానవులకు తెలియజేసెడి యంత్రాంగమే మతము. ఒక మతము యొక్క ఔన్నత్యము మరియు జీవన ప్రమాణము దైవ శాసనాల పట్ల దానికున్న నిబద్ధత పై ఆధారపడి ఉంటుంది.

ఏ మతమైతే సంపన్నుల ఆధ్వర్యంలో మనుగడ సాగిస్తుందో ఆ మతము సంపన్న వర్గ ప్రయోజనముల రక్షణార్థమై దైవ శాసనములను వక్రీకరించి అసత్యములను సత్యములుగా ప్రచారము చేయును.

తనలో దాగియున్న అసత్యమును, అధర్మమును విసర్జించుటకు నిరాకరించెడి మతము సదా అపరిపక్వ దశలోనే యుండును. ఇతర మతస్తుల పట్ల ద్వేషము, అసహనము ప్రదర్శించునవి సంస్కారహీనమైన మతాలు.

ఇతరులను ప్రలోభపెట్టిగాని, బెదిరించిగాని, హింసించిగాని, తమ మతవ్యాప్తికై యత్నించేవారు అజ్ఞానాంధకారములో జీవిస్తున్నారు. మతం అంటే జ్ఞాన భాండాగారం. కాలం గడచిన కొద్ది మతం యొక్క జ్ఞాన సంపద పెరగాలి. అది తరుగుతున్నట్లయితే మతం క్షీణిస్తున్నదని అర్థము. మతం యొక్క మనుగడ మతస్తుల సంఖ్యాబలంపై ఆధారపడి యున్నదనుకోవడం భ్రమ. ధర్మము క్షీణించినప్పుడు నీ మతంగాని, నీ మతస్తులుగాని నీకు ఏ విధముగాను ఉపకరించరు.

దైవం పేరు మీద కలహించుకునే వారు తాము ఆరాధించే దైవమును సైతము నీచముగా చిత్రించుచున్నారు. దైవమునకు ప్రచారము అవసరము లేదని ఏ మతము గుర్తిస్తుందో అదే సర్వోన్నతమైన మతము.

ఒకే ప్రాంతములో నివసించెడి ప్రజలకు ఎవరికిష్టమైన దైవాన్ని వారు ఆరాధించు కోవడానికి స్వేచ్ఛ యివ్వడం ఎంతటి ఉన్నతమైన సాంప్రదాయమో, అన్యమతస్తుల వద్దకెళ్ళి తమ మతాన్ని స్వీకరించమని బోధించే వ్యక్తులను శిక్షించడమూ అంతే ఉత్తమమైన సాంప్రదాయం.

నీవు అనుష్ఠించే మతము యొక్క సుగుణాలను తెలియజేయమని ఎవరైతే నిన్ను కోరెదరో వారికి మాత్రమే విశదపరచవలెను. అదే మతపరమైన జాగృతి. నీ మార్గము ధర్మము, సత్యములతో

నిండియుండి నట్లయితే యితరుల వల్ల నీ మతానికి చెరుపు జరుగుతుందని నీవు భావించనవసరం లేదు. ఆ భయం వ్యర్థమైనది, ఆధారం లేనిది. ఎదుటివాని ధర్మంలో సత్యం ఉంటే అది నీలోని సత్యంతో కలిసి పోతుంది. ఒకవేళ నీలో కొంత అసత్యము దాగియున్న యెడల అది దానిని నాశనము చేసి నీకు మరింత మేలు చేయును. అలా కాక ఎదుటివాని ధర్మములో తేజస్సు లోపించెనేని అదియే నశించును.

నీవు అనుష్ఠించే మతము నిన్నుగాని, నీ కుటుంబమునుగాని, నీ కులమునుగాని, నీ వర్గమునుగాని మతంపేరిట నీచముగా చిత్రించుచున్నను. బానిసలుగా తయారు చేస్తున్నను, సామాజిక సంపదలో అధిక వాటా పొందుతున్న వర్గానికి అనుకూల ధోరణిలో వ్యవహరించు చున్నను, నీ మనోవికాసమునకు అవరోధము కల్పించుచున్నను, మౌలిక వ్యక్తిగత స్వేచ్ఛను హరించుచున్నను, సాంప్రదాయము పేరిట నిన్నుగాని, నీ కుటుంబసభ్యులను గాని వేదనకు గురిచేయుచుండినను, మత వ్యాప్తి కొరకు మాతృభూమికి ద్రోహము చేయమని ప్రేరేపించినను, ఆ మతమును విడనాడుట వ్యక్తిగా నీ ధర్మము.

హీనగుణములు గలవారు, సదా యితరుల సంపదను దోచుకొనవలెనని కాంక్షిచెడి వారు, వ్యభిచారిణులు, వ్యసనపరులు, పోరాటపటిమ లేనివారు, సోమరులు, యాచకులు, కులభ్రష్టులు, అవినీతిపరులు, నీచ వృత్తులను స్వీకరించినవారు, యితర మతములను స్వీకరించిన యెడల వారి హీనత్వము ఆ మతములకు కూడా అంటుచున్నది.

హీనులు నీ మతమును త్యజించి నప్పుడు నీ మతమునకు అంటిన మలినము తొలగినందుకు సంతసించుము. హీనులు నీ మతములో చేరినపుడు వారిలోని హీనత్వమును పోగొట్టుటకు కృషి చేయుము.

స్వదేశములో మతప్రచారానికి విదేశీయుల సహాయాన్ని స్వీకరించే మత సంస్థలు కోరలు దాచుకున్న విషసర్పాలు. వాటికి సరైన అవకాశం దొరికిన రోజున సమాజాన్ని కాటేస్తాయి. విషం తలకెక్కే దాకా యివి కాటేస్తున్న సత్యాన్ని సమాజం గుర్తించదు.

సమాజ మనుగడకు హానికరంగా తయారైన మతాలను నిషేధించే అధికారము సమాజమునకు గలదు.

## బోధకుడు

యోగ నిష్ఠగలవారు ప్రకృతి శాసనములను, సత్యమును గుర్తించి వాటిని దైవశాసనములుగా ప్రజలకు భోధిస్తారు. ఆ బోధకుని పేరుమీద, అతని బోధనలు ఆధారంగా తరువాత కాలంలో ఒక మతం తయారవుతుంది.

బోధకుడు సమాజాన్ని నియంత్రించేందుకు ఆ కాలంలో ప్రజల భావ చైతన్యం ఆధారంగా ఆచార వ్యవహారాలు రూపొందిస్తాడు. బోధకుడు తన సమాజం కొరకు తన వ్యక్తిగత జీవనాన్ని త్యాగం చేస్తాడు.

సగటు మనుషుల కంటే ఎంతో ముందుచూపు కలిగి, భావితరాలకు తన భావనతో చక్కని బాట వేయగలిగిన వాడే నిజమైన బోధకుడు.

యోగ నిష్ఠ ద్వారా ఆత్మశక్తిని స్వాధీనం చేసుకుని సర్వాంతర్యామియైన ఆదిశక్తితో అనుసంధానించి తననితాను చైతన్యము, తేజోవంతము చేసుకుని, విశ్వమానవ శ్రేయస్సు లక్ష్యంగా సమాజ మనుగడను నియంత్రించే వాడే ఉన్నతమైన బోధకుడు.

మానవజాతి ఈ వృద్ధిపై మనుగడ సాగించినంత కాలం వారి ఆచార వ్యవహారాలలోమార్పులు, చేర్పులు అవసరమవుతాయి.

# ఆలయాలు

వర్తమాన హిందూ సమాజానికి అవసరమైన రీతిలో ఆలయాల నిర్మాణం జరగాలి. కులం ప్రాతిపదికగాగాని, వర్గ ప్రాతిపదికగా గాని ఆలయాలు నిర్మించడం హిందూ ధర్మవిరుద్ధం. ఒక గ్రామంలో నివసించే వారు ఒక ఆలయాన్ని మాత్రమే నిర్మించు కోవాలి. అది ప్రధాన ఆలయం.

ఆలయ నిర్మాణానికి ఎంచుకున్న స్థలానికి తూర్పు ఉత్తర దిశలందు వీధులుండాలి. వీధుల కన్న స్థలము మెరకగా యుండాలి. ఆలయ నిర్మాణానికి ముందుగా ఆ స్థలంలో బావి త్రవ్వించాలి. త్రాగునీరు లభ్యం కాని ప్రదేశాలలో ఆలయాలు నిర్మించరాదు.

ఉదయ భానుని కిరణాలు గర్భగుడి గడపను తాక వలెను. కావున స్థలానికి తూర్పు వైపున ఎత్తైన కట్టడములు ఉండరాదు. ఆలయాలకు చేరువలో క్రీడా మైదానములు, శ్మశానములు, కర్మాగారములు, క్షవరశాలలు, పండ్లు, కూరగాయలు, మాంస విక్రయశాలలు, పాఠశాలలు, వైద్యశాలలు ఉండకూడదు.

ఆలయ ప్రాంగణంలో పూజారులుగాని, యితరులు గాని, నివసించరాదు. పూజారి నివాసము కొరకు, బాటసారులు విశ్రమించేందుకు సత్రవలు నిర్మించ దలచినచో సమీపములో ప్రత్యేక స్థలములో నిర్మించవలెను.

ఆలయ ప్రాంగణంలో వర్షపునీరు నిలువరాదు. ప్రాంగణంలోని మట్టి వర్షపు నీటితో కొట్టుకుని పోకుండా కట్టు దిట్టము చేయవలెను. ఆలయ ప్రాంగణంలో కొబ్బరి చెట్లు మినహా యితర ఫలవృక్షములను పెంచరాదు. ప్రాంగణంలోని కొబ్బరి చెట్టు మట్టలను నరకరాదు, కాయలను కోయరాదు. చెట్టునుండి రాలిన కాయలను సేకరించి శుక్ర, శని వారములందు, స్త్రీలకు పిల్లలకు ప్రసాదముగా పంచవలెను.

ప్రాంగణంలో అన్ని రకాల ముళ్ళులేని పూలమొక్కలను పెంచవచ్చును. దేవతార్చనకు రోజుకు అయిదు పూలను మించి కోయరాదు.

ప్రాంగణంలో రాతిగుట్టలు, పేడతిప్పలు, ఎముకలు, మసిగుడ్డలు, రక్తపు మరకలైన వస్త్రములు, ఎంగిలి విస్తరాకులు, గాజు పెంకులు, ఇనుపమేకులు, పాచి కుప్పలు, మృత కళేబరాలు, చిత్తుకాగితాలు ఉంచరాదు.

ప్రాంగణంలో పందులు సంచరించరాదు.

ప్రాంగణం లోపల సర్పములను చంపరాదు. గోవులను హింసించరాదు. గర్భగుడిలో సర్పము ప్రవేశించిన యెడల పక్షం రోజుల వరకు గుడితలుపులు మూయరాదు. ప్రతిరోజు ఉదయము, సాయంత్రము ఆ పక్షం రోజులు పసుపు నీటితో గర్భగుడిని కడుగవలెను.

## విగ్రహం కొలతలు

3 అడుగుల 3 అంగుళములకు తక్కువ విగ్రహమును ఆలయము నందు ప్రతిష్ఠించరాదు. విగ్రహము ఎత్తు 6 అడుగుల 6 అంగుళములకు మించరాదు.

గర్భగుడి యొక్క ద్వారము ఎత్తు 6 అడుగుల 3 అంగుళములకు తగ్గకుండాను 7 అడుగుల 9 అంగుళములకు మించకుండను ఉండాలి. గర్భగుడిలో గోడలకు అరలు, కంతలు ఉండరాదు.

విగ్రహాలకు యిత్తడి తొడుగులు, బంగారు ఆభరణములు పెట్టరాదు. వస్త్రాలంకరణ చేయవచ్చును. ఒకసారి వస్త్రముచే అలంకరించ బడిన విగ్రహమును సదా నూతన వస్త్రములచే అలంకరించ వలెను. వస్త్రములు మార్చునపుడు గుడి తలుపులు మూయవలెను.

విగ్రహ ప్రతిష్ఠ సమయంలో గాని, ఆ తర్వాత గాని, విగ్రహము పగిలినా, వికలాంగమైనా, ఆ ఆలయంలో ఆ దినము నుండి 12 పున్నమి రాత్రులు గడిచేంత వరకు తిరిగి విగ్రహ ప్రతిష్ఠ చేయరాదు. తొలగించ బడిన విగ్రహాన్ని మలచిన శిల్పా చార్యుడు తొలిగించిన దినము నుండి వరుసగా మూడు రాత్రులు ఆలయ ప్రాంగణంలో నిద్రించ వలెను. ఆ మూడు రోజులలో అతడు మూడు సార్లు మాత్రమే అన్నము తినవలెను. తీపి పదార్థములు, మాంసము భక్షించరాదు. మత్తుపానీయములను సేవించరాదు. తన కుటుంబ సభ్యులకు ముఖం చూపరాదు.

గర్భగుడి లోపలి గోడలను గాని, ద్వారమున్న గోడ వెలుపలగాని, వస్తువులతోను, నగిషీరాళ్ళతోను, ఆభరణముల తోను, దీపములతోను, రంగు బట్టలతోను, కాగితములతోను, పూలతోను అలంకరించరాదు. ఈ గోడలపై ఎలాంటి సందేశము లిఖించబడరాదు. దాతల పేర్లు రాయడం నిషిద్ధం. ఈ గోడలకు యితర శిల్పాలుండరాదు.

గర్భగుడి లోపలి కప్పు గొడుగు ఆకారంలో నుండవలయును. ఎట్టిపరిస్థితులలోను చదరముగా ఉండరాదు.

గర్భగుడిలోని దీపములు కాంతి హీనముగా ఉండరాదు. గర్భగుడిలో కునుకు తీయరాదు. నిద్రమత్తుతోను, పాచి ముఖంతోను, గర్భగుడిలో ప్రవేశించరాదు.

గర్భగుడిలో ప్రవేశించువారు పసుపునీటితో కాళ్ళు కడుగుకొనవలెను. వారి పాదముల గుర్తులు గుడిలోపల పడకూడదు. పాదముల గుర్తులు దైవదూషణతో సమానము.

స్నానము చేయకుండా ఆలయంలో ప్రవేశించ రాదు. మైల కాలమందు ఆలయ ప్రాంగణంలో ప్రవేశించరాదు.

చర్మవ్యాధులతో బాధపడేవారు దేవతార్చన చేయరాదు. ఒక సంవత్సరకాలంలో మూడు సార్లు చర్మవ్యాధిగ్రస్తుడైన వ్యక్తి పూజారిగా పనికిరాడు.

తేజస్వియైన బ్రహ్మచారిని శ్రీ ఆంజనేయస్వామి ఆలయాల్లో తప్ప మరెచ్చటను పూజారిగా నియమించరాదు.

వికలాంగుడు, కొంటె చూపులు చూసేవాడు, స్త్రీలవలె ప్రవర్తించే పురుషుడు, విపరీతమైన బొజ్జగలవాడు, మాట్లాడునప్పుడు ఉమ్మితుంపరలు వెదజల్లువాడు, తుమ్ములతోను, ఆయాసంతోను బాధపడేవాడు, చెవిటి వాడు, మూగవాడు, మెల్లకన్నువాడు, మద్యం సేవించువాడు, పొగ త్రాగు వాడు, గారపళ్ళవాడు, పూజారిగా పనికిరాడు.

సరిహద్దు గోడను ఆనుకొని ఆలయాన్ని నిర్మించరాదు. ఒక ఆలయం నిర్మించ బడిన వీధిలో మరో ఆలయం నిర్మించరాదు. ఒకే గ్రామంలో ఒకే దేవునికి ఒకటికంటే ఎక్కువ ఆలయాలుండరాదు. ఇతర మతస్తుల ప్రార్ధనా మందిరాలకు 300 గజములలోపల ఆలయములను నిర్మించ రాదు.

ఒక దేవాలయానికి మరోదేవాలయానికి మధ్యదూరం 300 గజములకు పై బడి యుండాలి. దేవాలయాలకు 300 గజముల లోపల యితర మతస్తుల ప్రార్ధనా మందిరములను అనుమతించ రాదు.

వీధి కంటే గర్భగుడి బేస్ మట్టం ఎత్తు 3 అడుగులకు తగ్గకుండా ఉండాలి. గర్భగుడి పొడవు కాని, వెడల్పు కాని, విగ్రహం యొక్క ఎత్తు కంటే తక్కువ ఉండకూడదు. ఒకే రాతిపై మలచిన జంట విగ్రహములు ప్రతిష్ఠకు పనికిరావు. ఒకే విగ్రహాన్ని పతిష్ఠించుట ఉత్తమం. విగ్రహాల సంఖ్య పెరిగిన కొలదీ ఆలయం శక్తి తగ్గుతుంది.

గర్భగుడికి ప్రక్కన మరో గర్భగుడి నిర్మాణం హిందూ శాస్త్రసమ్మతం కాదు. అది దురాచారం. ఒక సమయంలో గర్భగుడిలో ఒకరికి మించి అర్చకులు ఉండరాదు. ఆలయ ప్రాంగణములో అద్దములుండరాదు.

## ఆలయ దర్శనం

పాటించవలసిన నియమాలు:

ప్రజలు నిరాడంబరంగా దేవాలయాలను సందర్శించిన నాడే దేవాలయాలకు సార్ధకత.

నీవు ఆలయాన్ని దర్శించే సమయంలో నీ వస్త్రముల వలన నీకు యిబ్బంది కలుగకూడదు. ఇతరులకు యిబ్బందికరంగా ఉండరాదు. దైవం పైనుండి ఇతరుల దృష్టి నీపై పడేలా నీవు వస్త్రధారణ చేయరాదు. ఇతరుల దృక్కులు నీ శరీరాన్ని పదే పదే తాకితే అవి నీ ఏకాగ్రతను భంగం చేస్తాయి.

దేవాలయములను సందర్శించే సమయమున నీ దేహము, బట్టలు శుభ్రముగా యుండవలెను. ఎటువంటి దుర్గంధము వెదజల్లబడరాదు. అటులని సువాసనలు వెదజల్లరాదు. స్త్రీలు తమ హోదాను వ్యక్తపరచే విధంగా ఆభరణములు ధరించరాదు.

కాళ్ళూ చేతులు కడుక్కోకుండా ఆలయంలో ప్రవేశించరాదు. గర్భగుడిలో ప్రవేశించ దలచుకున్నచో పసుపు నీటితో కాళ్ళు కడుక్కోవలెను. పాదముల తడి ఆరునంత వరకు ద్వారం వెలుపల వేచి యుండవలెను.

పట్టువస్త్రము ధరించి స్త్రీలు గర్భగుడిలో ప్రవేశించరాదు. గర్భగుడిలో ప్రవేశించే పురుషులకు నాభి పై భాగమున వస్త్రములు ఉండరాదు. ఉత్తరీయమును నడుముకు బిగించవలెను. కట్టుపంచె చెంగులు నేలను తాకరాదు.

గర్భగుడిలో ప్రదక్షిణ చేయరాదు. దేవతా విగ్రహానికి వెన్ను చూపుతు గర్భగుడి నుండి నిష్క్రమించ రాదు.

రద్దీగా నున్న సమయంలో వరుసలో నిలబడి దైవ దర్శనం చేసుకోవలెను. త్రొక్కిసలాటకు పాల్పడి దైవాన్ని దర్శించడం నిష్ప్రయోజనం.

ఎక్కువ సమయం వేచియుండవలసి వచ్చినప్పుడు అసమ్మతి, అసహనం వ్యక్తం చేయరాదు. పూజారులకు, అర్చకులకు కానుకల ఆశచూపి నీకు ఎక్కువ సమయం కేటాయించేలా చేసుకోవడం వల్ల నీ అహం మాత్రమే తృప్తి పడుతుంది. దైవకృప దక్కదు. నీ కారణంగా యితర భక్తులు వేచియుండవలసి వస్తే నీవు దైవకృపను కోల్పోతున్నావని గుర్తించు.

దైవదర్శనానంతరం ఆలయ ప్రాంగణంలో కొద్ది సమయం ప్రశాంతంగా కూర్చో. ఆసమయంలో నీ మనసులో వేరు ఆలోచనలు ఉండరాదు. త్వరగా యిల్లు చేరాలన్న ఆరాటము ఉండరాదు.

పసిపిల్లలను ఆలయ ప్రాంగణంలో శిక్షించరాదు. దూషించరాదు. ఆలయ ప్రాంగణంలో పసివాని రోదన విన్పించగానే అర్చకుడు కార్యక్రమాలను తక్షణమే నిలుపు చేయాలి. రోదిస్తున్న పసివారిని సముదాయించిన తర్వాతనే పుజాకార్యక్రమం కొనసాగించాలి.

**జంతుబలి**

జంతుబలి ధర్మసమ్మతమే. ఇందు నిమిత్తం ప్రత్యేక ఆలయాలు ఊరివెలుపల నిర్మించబడాలి. జంతుబలులు నిర్వహించే ఆలయాలలో అర్చకులు అవసరంలేదు.

ఆలయ ప్రాంగణంలో చిందిన బలిజంతువు రక్తాన్ని బలియిచ్చిన వారు శుద్ధి చేయాలి. బలియిచ్చిన జంతు మాంసమును వండి ఐదు సమభాగాలు చేసి ఒక భాగం తాము ఉంచుకొని మిగిలిన నాలుగు భాగాలు తమకు యిష్టులైన నాలుగు కుటుంబాల వారికి దేవీప్రసాదముగా అర్పించుకోవాలి.

ఆడ జంతువులను, రోగగ్రస్తమైన వాటిని, యుక్తవయస్సుకు వచ్చి కనీసం ఒక పర్యాయమైనా జతకూడని జంతువును బలి యిచ్చుట అపరాధము. బలియిచ్చిన జంతువు తలను భూమిలో పాతి పెట్టవలెను.

జంతుబలులు యిచ్చెడి ఆలయాలకు 9 సంవత్సరాలలోపు పిల్లలను వెంటగొని వెళ్ళరాదు. గర్భిణీ స్త్రీలు, బాలింతలు, యోగవిద్య నేర్పెడి గురువులు, పుత్రశోకంతో విలపించే దంపతులు, 60 సంవత్సరాలు పై బడిన ముదుసలులు, నూతన వధూవరులు, హృదయరోగులు చూస్తుండగా జంతుబలి నిర్వహించరాదు.

బలియిచ్చే వాడు బలియిచ్చేముందుగా బలి పశువుకు మద్యము త్రాపవలెను. పిమ్మట తానును సేవించ వలెను. వధ్యశిలపై కత్తిని పదునుగా నూరవలె. మరణ సమయంలో గాని, మరణానికి ముందు గాని బలిపశువు భయంతో గాని, బాధతో గాని అరవరాదు.

గృహంలోని పిల్లలు ప్రేమించే జంతువును బలియివ్వరాదు. ఒకే ఋతువులో ఒక కుటుంబం వారు ఒకటికి మించి జంతుబలులను నిర్వహించరాదు.

# యజ్ఞము

యజ్ఞము ఒక లక్ష్యము కలిగియుండాలి. ఆ లక్ష్యము వ్యక్తిగతమైనదికాక సమాజానికో, దేశానికో ఉపయోగకారియైనదై ఉండాలి. యజ్ఞము సమాజ శ్రేయస్సు కొరకు నిర్దేశించబడి యున్నందున యజ్ఞఫలము సమాజమునకు చెందుతుంది. కావున యజ్ఞనిర్వహణ భారాన్ని సమాజ సభ్యులంతా కలిసి పంచుకొనవలెను.

యజ్ఞ స్థలము సమతలంగాను, వృత్తాకారంగాను ఉండాలి. హోమగుండము యొక్క ఆకారము చతురస్రంగా ఉండాలి. దాని చుట్టూ కూర్చునే వ్యక్తులు వృత్తాకారంగా కూర్చుని అగ్నిని వీక్షించ గలగాలి.

హోమములో వాడే కర్ర ఎండినదై ఉండాలి. వయసు ఉడిగి నేలకొరిగిన వృక్షాన్ని ముక్కలుగా నరికి అందుకు వినియోగించాలి. అటువంటి వృక్షము అందుబాటులో దొరకని యెడల ఆ జాతి ఎండు పుల్లలు సేకరించి వినియోగించుకోవలెను. పచ్చి వృక్షాన్ని నరికి ఎండ బెట్టిన కట్టెలు వినియోగించిన యజ్ఞము వలన ఫలితము శూన్యము. పచ్చని మొక్కలను, ఆకులను హోమానికి బలియివ్వడం శాస్త్రవిరుద్ధము.

యజ్ఞస్థలి కొచ్చేవారు అభ్యంగన స్నానము చేసి రావలెను. పురుషులు తెల్లని పంచె, ఉత్తరీయము మాత్రమే ధరించవలెను. స్త్రీలు నేత వస్త్రలను ధరించవలెను. ఆభరణములు ధరించరాదు. నుదుట బొట్టు తప్ప మరేవిధమైన పదార్థములను ముఖముపై పూయరాదు. వివాహితలు పసుపు త్రాడుకు గ్రుచ్చిన తాళిని, అవివాహితులు రుద్రాక్షమాలను ధరించవలె.

విప్రుడు యజ్ఞ నిర్వాహకుడు. సత్యవచనుడు, విశాల దృక్పథం కలిగిన వాడు, యజ్ఞానంతరం లభించే కానుకలపై ధ్యాసలేని వాడు, సంపన్నులకు బానిసకానివాడు మాత్రమే యజ్ఞనిర్వాహణకు అర్హత కలిగి యున్నాడు. యజ్ఞారంభానికి ముందు యితడు అభ్యంగన స్నానము చేసి నేతపంచె కట్టుకొన వలెను. నేత కండువా భుజముపై ధరించ వలెను. ఈ రెండు వస్త్రములు గంజిపెట్టనివి, క్రొత్తవి అయి ఉండాలి.

యజ్ఞము చేయవలెనన్న సంకల్పము కలిగి ఆ యజ్ఞనిర్వహణకు అవసరమైనవి సమకూర్చుటకు కృషి చేసిన వ్యక్తి యజ్ఞకర్తగా వ్యవహరించ వలెను. యజ్ఞకర్త ఒంటరివాడై యుండరాదు. అతడు భార్యతో గాని, ప్రియురాలితో గాని కలిసి యజ్ఞము నిర్వహించవలెను.

విప్రుడు, యజ్ఞకర్తలు యజ్ఞారంభమునకు ముందుగా పసుపు నీటితో కాళ్ళు కడుగుకొనవలెను. అనంతరం యజ్ఞకర్త ప్రేక్షకుల వద్దకు వెళ్ళి ఎండుపుల్లలను దానముగా గ్రహించవలెను. అతని సహ ధర్మచారిణి మహిళల వద్ద నుండి యజ్ఞమునకు అవసరమైన నెయ్యి మరియు యితర దినుసులు దానముగా స్వీకరించవలెను.

విప్రుడు యజ్ఞారంభమునకు ముందు యజ్ఞప్రాశస్త్యము గురించి వివరించవలెను. యజ్ఞానంతరము యజ్ఞకర్త తన ఉత్తరీయమును జోలెగా చేసుకుని విప్రుని కొరకై అచటి వారి నుండి భిక్ష స్వీకరించవలెను. తాను యివ్వదలచుకున్నది విప్రుడు చూడ కుండా అందులో కలిపి మూటగట్టి అతనికి సమర్పించు కొనవలెను. విప్రుడు తన నివాస గృహమునకు చేరిన పిమ్మటనే ఆ మూట విప్పవలెను.

ధనాపేక్షతో విప్రుడు యజ్ఞనిర్వహణకు అంగీకరించిన, ఆ యజ్ఞము ఫలమునీయదు. యజ్ఞప్రాంగణమందు పురుషులను రెచ్చగొట్టే విధముగా అలంకరించుకున్న స్త్రీలు సంచరించిన యెడల, ఆ యజ్ఞము లక్ష్యము నుండి చెదరి మన్మధయజ్ఞముగా మారును. స్త్రీలు పైట చెంగును భుజములకు నిండుగా కప్పుకొనవలెను.

యజ్ఞ ప్రాంగణమందు జంతువులను బలి యివ్వరాదు. జీవహింస చేయరాదు. యజ్ఞములు ఆది శక్తికి సమర్పించుకొనవలెను. అన్నిటికంటే ముందుగా యజ్ఞకర్తలోని అహాన్ని భస్మం చేయవలెను. యజ్ఞ నిర్వహణ సమయంలో అతనిలో అహంకారము కనిపించిన యెడల ఆ యజ్ఞమును విప్రుడు మధ్యలో ఆపి తన నిరసనను వ్యక్తము చేయవలెను. కానుకలను ఆశించి యజ్ఞకర్త అహాన్ని సహించేవాడు విప్రుడు కానేరడు.

అల్పాహారము సేవించిన పిదప యజ్ఞము ప్రారంభించవలెను. యజ్ఞ సమయమున పిల్లల ఆక్రందనలు వినబడరాదు. పసివానిని సముదాయించుటకు యజ్ఞమును తాత్కాలికంగా నిలిపినను శుభమే.

గృహములోపల యజ్ఞము చేయరాదు. ఎండలో కూర్చునిగాని, రాత్రి సమయాలలోను హోమము చేయరాదు.

## ఆధ్యాత్మికత

ఇహపరమైన బంధనాల నుండి మనసుకు విముక్తి ప్రసాదించునదియే ఆధ్యాత్మికత. ఈ బంధనాలు మనసుకు ఆనందము కంటే దుఃఖమునే ఎక్కువ కలుగజేస్తాయి. ఎవని మనసైతే దుఃఖరహిత స్థితిని చేరుకుంటుందో వాని ఆధ్యాత్మికత పరిపూర్ణ దశకు చేరినదని అర్థము.

శరీరమును శుష్కింపజేయుట వలన గాని, సోమరిగా జపతపము లాచరించుట వలనగాని, ప్రకృతి సహజమైన కర్మలు నిరోధించుట వలనగాని, యజ్ఞయాగాది క్రతువుల వలన గాని, దాన ధర్మముల వలన గాని, నిరంతరము భగవంతుని నామము జపించుట వలన గాని, ఋషులను, ముని వేషధారులను, భగవంతుని అవతారముగా ప్రచారము చేసుకొను వ్యక్తులను సేవించుట వలన గాని, శరీర మనుగడకు అవసరమైన మౌలిక కర్మలను త్యజించుట వలన గాని, మత ప్రచారమనకు జీవితమును అంకితము చేయుట వలన గాని, రోగులను సేవించుట వలన గాని, గుళ్ళు, గోపురాలు, ప్రార్థనా మందిరాలు నిర్మించుట వలన గాని, భక్తి గీతాలు ఆలపించుట వలన గాని, వినుట వలన గాని, ఆధ్యాత్మిక ఔన్నత్యము లభించుట లేదు.

ఇతరులకు ఆధ్యాత్మికతను బోధించువాడు ఈ ప్రపంచములో కెల్ల మూర్ఖుడు. ఆధ్యాత్మికత బోధనా వస్తువు కాదు. అందుకే ఆధ్యాత్మికతకి గురువులేడు. గరువులు లేనిచోట శిష్యులుండరు. నీవు ఏస్వామి వద్దనో శిష్యరికము చేస్తుంటే నీకు ఆధ్యాత్మికత ఎండమావి. ఎవరైతే గురువును త్యజిస్తారో, ఎవరైతే తమ దేహమును ధృఢముగానూ ఆరోగ్యముగానూ ఉంచుతారో, ఎవరైతేమనసులోని మాలిన్యాన్ని ఆత్మచైతన్యము ద్వారా శుద్ధి చేసుకొనగలుగుతారో, వారు మాత్రమే ఆధ్యాత్మిక మాధుర్యమును చవిచూడగలరు.

సంపదపై ఆరాటము, అధికారముపై వ్యామోహము, 15 సంవత్సరముల వయసును దాటిన సంతానముపై మమకారము, భార్యగాని, ప్రియురాలు గాని, భర్తగాని, ప్రియుడుగాని యితరుల వలలో చిక్కుకుంటారేమోనన్న అనుమానము, కుటుంబ సభ్యుల చర్యలవల్ల తన పరువు ప్రతిష్ఠలకు భంగము కలుగుతుందేమోనన్న సందేహము, ఇతరుల వల్ల తనకు గాని, తనవారికి గాని, ప్రాణసంకటం కలుగుతుందే మోనన్న భయము, దైవభీతి, గురుభీతి, రాజభీతి, శత్రుభీతి - మొదలైన దుర్గుణములలో ఏ ఒక్కటి మనసులో దాగియున్నను ఆధ్యాత్మిక ఔన్నత్యము ప్రాప్తించదు.

ధ్యానమువలన ఆత్మ జాగృత మౌతుంది. జాగృతమైన ఆత్మ శరీరము అనుష్ఠించవలసిన కర్మల గురించి మనసుకు తెలియజేస్తుంది. ఎవని మనసైతే ఆత్మసందేశాన్ని సంపూర్ణ విశ్వాసముతో పాటిస్తుందో వాడు పాపకర్మలనెడి మలినములను త్యజించి పునీతుడగుచున్నాడు.

ఎవరైతే దుర్గణములచే ప్రేరేపింపబడి ధ్యానమును అభ్యసించెదరో వారు తమ దుర్గుణముల యొక్క ప్రేరణనే ఆత్మ సందేశముగా భ్రమసి పాపకర్మలను అనుష్ఠించుటచే మరింత మలినమును ప్రోగుచేసుకొనుచున్నారు.

దుర్గుణములచే ప్రేరేపింపబడి ఆధ్యాత్మిక గురువు పాత్ర నటించువాడు, తననాశ్రయించిన వారిలోని దుర్గుణములను నాశనము చేయజాలడు.

ప్రజలలోని అజ్ఞానము వలన ఎవడైతే దైవాంశ సంభూతునిగా కీర్తించబడుచున్నాడో వాడు ప్రజలను, శిష్యులను సదా అజ్ఞానాంధకారములోనే యుంచును.

మనసులోని దుఃఖము వటవేరు వంటిది. దానిని దుఃఖ జలము నుండి వేరు చేసి నశింపజేయనంత కాలము అది మనసును వేదనకు గురిచేయుచునే యుండును.

దుర్గుణము వలన ప్రేరేపితమైన కర్మానుష్ఠానమువలన కలిగెడి వేదనకు దైవము కారణము కానందున, దైవారాధన వలన ఆ వేదన నశించదు. వేదనకు మూలమైన దుర్గుణమును ఎవడైతే త్యజించుచున్నాడో వాడు జ్ఞానమును, ఆనందమును పొందుచున్నాడు.

వేదములు, పురాణములు క్షుణ్ణముగా అభ్యసించినప్పటికీ, ముందు నుడివిన దుర్గుణములను త్యజించలేనివాడు 'సంకల్పలేమి' యనబడు వ్యాధిచే పీడించబడుచున్నందున, అతని జ్ఞానము వలన ఏవిధమైన ప్రయోజనమును కలుగుటలేదు. అట్టి జ్ఞానమును ఆధ్యాత్మిక జ్ఞానముగా ప్రజలకు విక్రయించు వాడు దైవమును అపహాస్యము చేయుట వలన నీచత్వమును ప్రోగు చేసుకొనుచున్నాడు.

ఎవరైతే శరీరము శుష్కించిన పిదప దైవమును ధ్యానించు చున్నారో వారు తమ ప్రార్థనల ద్వారా దైవమును మోసగించుటకై యత్నించుచున్నారు.

పాప కర్మల దోషము హరించవలెనన్న అంతకు రెట్టింపు సత్కర్మలు అనుష్ఠించవలెను. సత్కర్మలు అనుష్ఠించకుండా భగవంతుని నామము జపించుట వలన పాపము నుండి విడువబడుచున్నానని విశ్వసించువాడు ఆత్మద్రోహము చేసుకొనుచున్నాడు.

సదా ధర్మమును అనుష్ఠించువాడు దైవమును స్మరించకయే దైవ కృపకు పాత్రుడగుచున్నాడు. దైవకృపకు పాత్రుడైన వాని మనసులో భయము, దుఃఖము నశించును.

ఎవరైతే తాము స్వయముగా ఆచరించనివి, ఆచరించలేనివి యితరులను ఆచరించమని బోధించుచున్నారో, వారు తమ ఆత్మలనే చంపుకొనుచున్నారు.

ఎవని మనసు నందు దుఃఖము లేశ మాత్రమైననూ లేదో వాడు ఈ జగమందు అభ్యసించవలసిన విద్య యేదియును లేదు.

## రాజ్యము

ఒక బలమైన అశ్వము సంక్రాంతి మాసములో సూర్యోదయము నుండి సూర్యాస్తమయము వరకు నిర్విరామముగా పరుగెత్తుతూ చుట్టి వచ్చెడి దానికి తక్కువ కాని ప్రాంతము ఒక వ్యక్తిచే పాలించబడుచున్న యెడల ఆ ప్రాంతమును రాజ్యముగను, దానిని పాలించు వానిని రాజుగను పరిగణించ వచ్చును. 21 రాజ్యములకు మించిన ప్రాంతమును సామ్రాజ్యమనియు దానిని పాలించు వానిని చక్రవర్తి అనియు పిలువదగును.

ఎవడైతే తన వ్యక్తి గత శ్రేయస్సు కొరకు రాజ్యము స్థాపించి ప్రజలపై ఆధిపత్యము చెలాయించునో వాడు రాజు స్థానములో నున్నప్పటికి దోపిడీదారుగనే పరిగణించవలెను. అటు వంటి నీచుని శాసనములను ఉల్లంఘించు వారును, వాని ఆధిపత్యము నుండి తమ ప్రాంతమునకు విముక్తి ప్రసాదించుటకై పోరాడువారును, సత్కర్మల అనుష్ఠాన ఫలమునే పొందు చున్నారు.

ప్రజల చేత ధర్మమును అనుష్ఠింపజేయుటకు, దుష్టుల బారి నుండి సజ్జనులను రక్షించుటకు, బలవంతుల బారినుండి బలహీనులను రక్షించుటకు, అంతర్గత వివాదములను పరిష్కరించి కలహములను నివారించుటకు, స్వదేశీ మరియు విదేశీ దోపిడీ దారుల బారినుండి ప్రజల మానప్రాణములను రక్షించుటకు, అధర్మమును అంతము చేసి ధర్మము వ్యాపింప జేయుటకు ఎవరైతే రాజ్యమును స్థాపించెదరో వారిని మాత్రమే రాజుగా గుర్తించి అతని శాసనములను పాటించవలసిన బాధ్యత ప్రజలపై యున్నది. రాజు పాలకుడు మాత్రమే. అతడు రాజ్యమునకు యజమాని కాదు.

ప్రజాహితమే లక్ష్యంగా పరిపాలించబడేది ప్రజారాజ్యం. పాలకుడు రాజైనా లేక ప్రజా ప్రతినిధియైనా ప్రజాశ్రేయస్సుకు తమ జీవితాలను అంకితం చేసినప్పుడే వారి జీవితాలకు సార్ధకత.

పాలనాధికారాన్ని చేపట్టడానికి ప్రత్యేకించి ఒక ధర్మమార్గమంటూ ఏదియునూ లేదు. నిస్వార్ధపరుడు, ప్రజా శ్రేయస్సును కాంక్షించేవాడు, సత్యవచనుడు, నిరాడంబరుడు, ధార్మికుడు అయిన వ్యక్తి ప్రజా వ్యతిరేక పాలనను అంతంచేయడానికి తన శక్తి వంచన లేకుండా కృషి చేయాలి.

ఒక వ్యక్తి నుండి మరో వ్యక్తికి పాలనాధికారం సంక్రమించే విధానాన్ని నిర్దేశిస్తూ స్థానికంగా నెలకొల్పబడిన సాంప్రదాయములను ధర్మములనిగాని, అధర్మములనిగాని భావించరాదు. ధర్మ స్థాపనకు తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి అన్ని సాంప్రదాయములకు అతీతుడు. తన లక్ష్యం చేరుకునేందుకు అతడు ఎన్ని సాంప్రదాయములను ఉల్లంఘించి నప్పటికీ, అతని ఔన్నత్యమునకు భంగము కలుగుట లేదు.

తన జాతిపై పాలనాధికారాన్ని పొందేందుకు మరోజాతి సహకారాన్ని స్వీకరించుట అధర్మము. అయితే నీ జాతిపై మరో జాతి పెత్తనం చేసి నీ జాతిని నిర్వీర్యం చేస్తుంటే నీవు నీ మిత్రజాతి సహకారాన్ని అర్థించడం ధర్మసమ్మతమే.

నీ జాతిపై పాలనాధికారాన్ని పొందేందుకు, ఆ జాతి శ్రేయస్సుకు ఉపకరించే సంపదను గాని, కట్టడములను గాని, లేక మరేయితర నిర్మాణములను గాని, జీవజాలములను గాని, వనములను గాని ధ్వంసము చేయుట అధర్మము.

ప్రజా వ్యతిరేక పాలనపై తిరుగుబాటు చేయమని ప్రజలను హింసించుటయు నేరమే. బానిసత్వము వారికి ఆనందముగా యుంటే వారిని బానిసలుగానే బ్రతక నిమ్ము. వారిని చైతన్యవంతులు కమ్మని జ్ఞానము బోధించుట వరకే నీ కర్తవ్యము పరిమితమై యున్నది.

ప్రజా వ్యతిరేక పాలనను అంతము చేయుటకై, మాతృభూమి రక్షణకై నిర్దేశింపబడిన వ్యవస్థను చిన్నాభిన్నం చేసినచో అది మిక్కిలి నీచకార్యమే అగును. అరాచకత్వము వలన ప్రజలు దుష్టపాలన కంటే ఎక్కువ కష్టములు అనుభవించవలసి వచ్చును.

అవినీతికరమైన పాలనను ప్రజావ్యతిరేక పాలనగా భావించరాదు. పాలనా యంత్రాంగము లోని అవినీతి ప్రజలలోని నీతిని వెల్లడి చేస్తుంది. ప్రజలు నీతివంతులు కానిదే వారికి స్వచ్ఛమైన పాలన అందించుట సాధ్యపడదు. అట్టి పరిస్థితిలో దండనకు అర్హులైన ప్రజలను వొదిలేసి పాలనాయంత్రాంగమును దండించ యత్నించుట వలన ధర్మస్థాపనాభిలాషి శక్తి హీనుడగు చున్నాడు.

అవినీతి పాలన అంతము కావాలని ప్రజలలో అధికశాతం కోరుతూ, దానిని అంతం చేయుటలో వారు అశక్తులై యుండిన యెడల, అవినీతి పరులను నీవు ఏరీతిలో శిక్షించిననూ ధర్మ సమ్మతమే అవుతుంది.

అవినీతిపరులు గాని, దుష్టులుగాని తమ ఆధిపత్యమును రక్షించు కొనుటకు సజ్జనులను, ధార్మికులను, నీతివంతులను, జ్ఞాన బోధకులను హతమార్చుచున్న యెడల నీవు దుష్ట శిక్షణార్థం గైకొనెడి చర్యలకు ప్రజామోదము పొందవలసిన అవసరము లేదు. నీ చర్యల వలన ప్రజలకు తాత్కాలికముగా యిబ్బందులు కలిగినప్పటికీ నీవు చింతించరాదు.

ధర్మము యొక్క ఉనికి ప్రజలపై ఆధారపడియున్నది. 12 మందిలో కనీసం ఒక్కడైనా ధర్మమును ప్రేమించు వాడు లేని యెడల ధర్మస్థాపన జరుగదు. ఆ ఒక్కడే ధర్మమునకు కొన ఊపిరి. ధర్మము జీవించియున్నదనడానకి నిదర్శనం. కావున అధర్మముపై యుద్ధము ప్రకటించుటకు, దానిని అంతం చేయుటకు సమాజంలో 1/12 వ భాగం ప్రజల ఆమోదము అవసరం.

సమాజములో 1/12 వ భాగం ప్రజల ఆమోదం లేకుండా పాలనాయంత్రాగాన్ని రద్దు చేయడం ధర్మవిరుద్ధమే అవుతుంది. ప్రజలంతా అధర్మాన్ని, బానిసత్వాన్ని, స్వీయవినాశనాన్ని కోరుకుంటుంటే వారిని ఆ పాపకూపంలోనే బ్రతకనిమ్ము. వారి అధర్మము వారినే అంత మొందించేంత వరకు వేచియుండుము.

సమాజములో 1/12వ భాగం ప్రజల అనుమతి లభించినదా వెనుదిరిగి చూడకుము. ధర్మస్థాపనను మించి దైవ కార్యం వేరులేదు. అందుకు అవసరమైన నైతిక బలం నీకు ప్రాప్తిస్తుంది.

ధర్మస్థాపనార్థం జరిగే యుద్ధములో పొందే మరణము అన్నిటికన్నా ఉత్తమమైనది. నిన్ను నీవు దైవానికి కానుకగా అర్పించుకుంటున్నావు. ఆ అవకాశం ధన్యజీవులకు మాత్రమే లభిస్తుంది. జాతి నివాళులర్పించే మరణం వలన 11 సంవత్సరాల కఠోర తపస్సు వలన లభించెడి ఫలమును పొందగలుగు తున్నావు.

నీవు ఏమార్గము ద్వారా ధర్మస్థాపన చేయనున్నావో ప్రజలకు స్పష్టముగా తెలియజేయుము. నీ మార్గము ఎంతటి ఉన్నతమైనదైనా కొన్ని సందర్భాలలో ప్రజలకది అధర్మమార్గముగా గోచరించవచ్చును. నీవు ఎన్నుకున్న మార్గానికి సైతం 1/12వ భాగం ప్రజల ఆమోదం అవసరము.

**హింస :** సృష్టిలో ఒక జీవి మరొక జీవిని ఉదరపోషణార్థము మరియు ఆత్మరక్షణార్థము మాత్రమే చంపుట ప్రకృతి ధర్మమై అంతటా వ్యాపించి యున్నది.

ఒకడు నిన్ను చంపుటకు యత్నించినచో నీవు వానిని సంహరించుట ధర్మము.

నీ మాతృభూమిపై దాడిచేసిన శత్రువులను నిరోధించే యత్నంలో నీవు ఎందరిని సంహరించినను నీకు ఏ పాపమూ అంటుటలేదు.

పసిపిల్లలను, స్త్రీలను అపహరించిన వానిని, హత్యచేసిన వానిని, నీ దేశ శత్రువులకు గూఢచారిగా పనిచేయువానిని, త్రాగునీటిలో విషము కలిపిన వానిని, అరణ్యములను దగ్ధము చేయువారిని వధించుట వలన నీకు ఏదోమును అంటుటలేదు.

ఇవి కాక తక్కిన హత్యలన్నియు పాపములే. ధర్మమును రక్షించు నెపమున హత్యలు చేయుట వలన ధర్మము మరింత బలహీన పడును.

## భవిష్యద్ధర్మము

వర్తమానంలో నివసించే మానవులు పృథ్విపై లభించే వొనరుల్ని తమ యిష్టం వచ్చిన రీతిలో వినియోగించుకొనెడి హక్కును ప్రకృతి వారికి ప్రసాదించుట లేదు. ఆ వొనరులపై భావితరాల వారికి కూడా హక్కు గలదన్న సత్యాన్ని గుర్తించి ఆ మేరకు వర్తమాన సమాజం ప్రకృతి వొనరుల వినియోగం విషయంలో పౌరుల ప్రవర్తనను నియంత్రించుటే వర్తమాన సమాజము అనుష్ఠించ వలసిన భవిష్యద్ధర్మము.

**జలము** : సమస్త చరాచర జీవులకు నీరు ప్రాణాధారమైయున్నది. జలములేని చోట జీవము లేదు. జలము నుండియే జీవము పుట్టుచున్నది. పృథ్విపై జలము అమూల్యమైన సంపద. జలమును దుర్వినియోగము చేయువారు, నదీ జలాలను కలుషితము చేయువారు దైవం నిర్దేశించిన బాటను వీడి నీచత్వమును ప్రోగు చేసుకునుచున్నారు.

ఒక గ్రామముగాని, నగరముగాని కలుషితమైన పదార్థములను గాని, తమ పౌరుల మురికినిగాని, నదులలో గాని, సాగు నీటి కాలువలోగాని కలుపుచున్న యెడల, వాటి దిగువ ప్రాంతాలలో ఆ జలం ఆధారముగా జీవనం సాగించే ప్రజలు కలుషితానికి కారకులైన వారిని శిక్షించే అధికారము కలిగియున్నారు.

జల కాలుష్య నివారణార్థమై దిగువ ప్రాంతాలవారు కలుషితం చేస్తున్న ఎగువ ప్రాంత ప్రజలపై దాడిచేసి వారిని గాయపరచినను, అట్టి దాడిలో అనూహ్యమైన రీతిలో ఎగువ ప్రాంతాల

వారు మృతి చెందినను, దాడి చేసిన దిగువ ప్రాంతాల వారికి ఏదోషమూ అంటుటలేదు.

జల కాలుష్య నివారణకై జరిపెడి పోరాటము, మాతృభూమిపై శత్రుదాడిని నిరోధించుటకై జరిపెడి పోరాటము కన్న ఉన్నతమైనది.

దిగువ ప్రాంతాల వారు జల కాలుష్యానికి పాల్పడుచున్నచో ఎగువ ప్రాంతాల వారు వారిపై దాడి చేయరాదు. తమ గ్రామ పెద్దల ద్వారా వారికి హితవుచెప్పుట వరకే వీరి హక్కులు పరిమితమై యున్నాయి.

జల కాలుష్యమునకు కారణమైన గ్రామమునుగాని, నగరమును గాని పాలించుచున్న వానికి ఎటువంటి హెచ్చరికనూ చేయకుండా మృత్యు దండనను విధించే అధికారము దిగువ ప్రాంతాల వారికి యివ్వబడినది.

ఎవని పాలనలోనైతే నదీజలాలు కలుషితమైపోతాయో వానిని ప్రజలు తమ శత్రువుగా భావించి వాని పాలన నుండి విముక్తి పొందుటకై శక్తి వంచన లేకుండా కృషి చేయాలి.

విముక్తికై పోరాడే వారిలో ఎవరినైనా పాలకుడు చంపినను, చంపించినను లేక ప్రత్యక్షముగానో, పరోక్షముగానో మరణమునకు కారకుడైనను, వానికి మృత్యుదండన విధించవలెను. వాని కుటుంబ సభ్యులను 12 సంవత్సరములు గృహ నిర్బంధములో ఉంచవలెను.

ఏ న్యాయమూర్తియైనా రాజశాసనాలకు బద్ధుడై నదీ జల కాలుష్య నివారణకు పోరాడిన వారిని శిక్షించినచో అతనిని దేశద్రోహిగా భావించి మరణ శిక్ష విధించవలెను.

నదీ జల కాలుష్య నివారణ పోరాటంలో తన భర్తను పాల్గొనకుండా నిరోధించెడి స్త్రీ పతిత యగును. అంతవరకు ఆమె అనుష్ఠించిన పాతివ్రత్య ధర్మము వ్యర్థమగుచున్నది.

**అడవులు :** నీరు వర్షము వలన లభించుచున్నది. అడవులు లేనిదే వర్షము లేదు. పృథ్విపై మూడింట ఒక భాగాన్ని అడవుల పెంపకానికి వదిలేయవలెను. అట్టి వనములందు మానవ సంచారమును నిషేధించవలెను. ఆ వనములందు లభించెడి ప్రకృతి వొనరులపై మానవునకు ఎట్టి అధికారమును లేదు.

కొండ యొక్క ఉపరితలము నుండి దాని పాదము వరకు ఉన్న దూరమునకు నాలుగు రెట్లు వెడల్పున కొండ పాదము నానుకుని వనముల పెంపుదలకు కేటాయించవలెను.

నది యొక్క వెడల్పునకు సమానమైన వెడల్పు గల భూమిని నది కిరువైపుల నది పుట్టిన దగ్గర నుండి అది సముద్రములో గాని మరియొక నదిలోగాని కలిసేంత వరకు, అడవుల పెంపకమునకు కేటాయించ వలెను.

వంటచెఱకు కొరకు గాని, గృహ నిర్మాణమునకు అవసరమయ్యే కలప నిమిత్తము గాని అరణ్యములలోని వృక్షములను నరుకు వారిని నిర్బంధించి, సంవత్సర కాలం అడవులు పలచబడిన చోట మొక్కలు నాటించే పనులు చేయించవలెను.

గ్రామ అవసరాలను గుర్తించి వివిధరకాల వృక్షములను గ్రామ పరిధిలోని భూమిలో పెంచవలెను. గ్రామము ఎంత విస్తీర్ణములో నిర్మితమైనయున్నదో అంతటికి సమానమగు విస్తీర్ణముగల భూమిని సామాజిక వనములను పెంచుటకు కేటాయించవలెను.